ఈనాడు

విజయవాడ 9-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 150

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 9-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 150
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



500% సుంకం

రష్యా నుంచి చమురు కొంటే విధింపు

బిల్లు ప్రవేశపెట్టడానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్

వచ్చే వారమే ఓటింగ్‌కు అవకాశం ● బిల్లును ప్రతిపాదించిన సెనేటర్ గ్రాహం

భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం ● కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

న్యూయార్క్, వాషింగ్టన్

రష్యా నుంచి చమురు కొనే దేశాలపై మరింత కక్ష సాధించేందుకు అమెరికా సిద్ధమైంది. ఆ దేశాలపై 500 శాతం సుంకాలు విధించే బిల్లును తేవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందితే భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం పడనుంది. శ్వేతసౌధంలో బుధవారం ట్రంప్‌తో తన సమావేశం ఫలవంతంగా సాగిందని, రష్యాపై ఆంక్షల బిల్లుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సెనేటర్ లిండ్సే గ్రాహం తెలిపారు. ఈ బిల్లు సకాలంలో ఆమోదం పొందాలని, శాంతి కోసం ఉక్రెయిన్ చాలావరకు మినహాయింపులకు అంగీకరించిందని, పుతిన్ మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని, అమాయకులను చంపుతూనే ఉన్నారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఈ బిల్లు అధ్యక్షుడు ట్రంప్‌నకు భారత్, చైనా, బ్రెజిల్ దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించడానికి అపారమైన పరపతిని కల్పిస్తుంది. ఈ దేశాలు చౌకగా చమురును కొనుగోలు చేస్తూ రష్యా ఆదాయం గడించడానికి కారణమవుతున్నాయి. ఆ దేశం ఉక్రెయిన్‌లో రక్తపాతం సృష్టిస్తోంది' అని గ్రాహం అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుపై వచ్చే వారమే ద్వైపాక్షిక ఓటింగ్ జరుగుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. రష్యా నుంచి ఇంధనాన్ని (మిగతా 6లో)

రూ.7.69 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

వివరాలు ఈనాడు బిజినెస్ లో

ఆధ్యాత్మిక విధ్వంసానికి

జగన్ కుట్ర



- తిరుమలలో ఖాళీ మద్యం సీసాల వ్యవహారమే నిదర్శనం
- వైకాపా వాళ్లే తప్పులు చేసి ప్రభుత్వంపై నెడుతున్నారు
- వాళ్ల టీవీ ఛానల్‌లో నానా యాగీ చేస్తున్నారు
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: ఆధ్యాత్మిక వాతావరణాన్ని విధ్వంసం చేసే వ్యక్తి జగన్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు వైకాపా కుట్రలు పన్నుతోందని, ఆ పార్టీ నాయకులే తప్పులు చేసి, వాటిని ప్రభుత్వానికి ఆపాదించేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలలో ఖాళీ మద్యం సీసాల నిర్వాకమే దీనికి తాజా నిదర్శనమన్నారు. ఆ పార్టీ నాయకులే ఖాళీ మద్యం సీసాలు పట్టుకొచ్చి తిరుమలలో పడేశారని, దాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించేందుకు జగన్ ఛానల్‌లో నానా యాగీ చేశారని ధ్వజమెత్తారు. ఆ మద్యం సీసాలపై ఉన్న హోలోగ్రామ్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తే వాటిని ఎక్కడ కొన్నారు, ఎవరు పట్టుకొచ్చి తిరుమలలో వేశారన్నదీ తేలిందని తెలిపారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ వైకాపా తీరును దుయ్యబట్టారు. 'రాయలసీమ ఎత్తిపోతల పథకం జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆగిపోయింది. ఆ నెపాన్ని మనపై నెట్టేయాలని చూస్తున్నారు. భోగాపురం విమానాశ్రయంపై గతంలో జగన్ విషం కక్కారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ చొరవతో ప్రాజెక్టు శరవేగంగా పూర్తవుతుంటే.. క్రెడిట్ చోరీ అంటూ అవాకులూచవాకులూ మాట్లాడుతున్నారు. మంత్రులు అప్రమత్తంగా ఉండి.. వైకాపా కుట్రల్ని, (మిగతా 6లో)


రూ.20,252 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

13,334 ఉద్యోగాల కల్పన లక్ష్యం

విద్యుత్తు ఛార్జీల తగ్గింపు ఉత్తర్వులకూ ఆమోదం

రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలు

లోపలి పేజీలో



పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

పలువురు ప్రముఖుల సంతాపం

కోర్టులకు బాంబు బెదిరింపులు

- పలు జిల్లాల్లో అప్రమత్తం
- నకిలీ ఈ-మెయిళ్లుగా పోలీసుల నిర్ధారణ

లోపలి పేజీల్లో

ఆడపడుచులకు అన్నగా అండగా ఉంటా

పొదుపు సంఘాలకు ఆన్‌లైన్‌లోనే రుణాలు

సరస్ మేళాలో సీఎం చంద్రబాబు



గుంటూరులో మేళా ప్రాంగణం స్వాగత ద్వారం వద్ద వివిధ రాష్ట్రాల కళాకారులు

లోపలి పేజీలో

ఈడీ X దీదీ

కోల్‌కతాలో ఐ-ప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలపై భగ్గుమన్న బెంగాల్ సీఎం



- బొగ్గు కుంభకోణంపై దర్యాప్తులో భాగంగానే తనిఖీలన్న ఈడీ
- ఆ పేరుతో తృణమూల్ సమాచారం, పత్రాలను స్వాధీనం చేసుకున్నారని మమత మండిపాటు
- ప్రతీక్ జైన్ నివాసానికి మమత వెళ్లి కొన్ని దస్త్రాలు తీసుకువెళ్లడంతో హైడ్రామా

6 లో

సతీష్‌కుమార్ అసహజ మరణం కేసును

మేమే పర్యవేక్షిస్తాం



- ఛార్జిషీటు వేసే వరకూ చూస్తామన్న హైకోర్టు
- రవికుమార్ కుటుంబానికి ఆదాయానికి మించిన ఆస్తులు
- సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించి ముందుకెళ్లండి
- సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు ఆదేశం
- పరకామణి కానుకల లెక్కింపులో తితిదే ఈవో ఇచ్చిన నివేదికపై అసంతృప్తి

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో కానుకల చోరీ ఘటనపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదుచేసిన ఏవీఎస్‌వో (అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్) వై.సతీష్‌కుమార్ అసహజ మరణంపై సీఐడీ దర్యాప్తులో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని హైకోర్టు వెల్లడించింది. ఈ నేపథ్యంలో అభియోగపత్రం దాఖలు చేసేవరకూ కేసును తామే పర్యవేక్షిస్తామని తేల్చిచెప్పింది. ఏసీబీ దాఖలుచేసిన నివేదిక ప్రకారం పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్ ప్రభుత్వోద్యోగి నిర్వచనం పరిధిలోకి వస్తారని స్పష్టంచేసింది. ఆయనపై ఉద్దేశపూర్వకంగానే ఐపీసీ 409 (ప్రభుత్వోద్యోగి నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడటం) సెక్షన్ నమోదు చేయలేదంది. ఏసీబీ నివేదిక ప్రకారం రవికుమార్, ఆయన కుటుంబానికి ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని పేర్కొంది. చోరీ కేసును నిర్వీర్యం చేసేందుకు (మిగతా 6లో)



MRP ₹ 4,490
COMBO PRICE ₹2026
Induction Prime 1800W + Stainless Steel Cooker 3 Ltr Cute
MRP ₹ 5,720
COMBO PRICE ₹2026
Swifty 550W Mixer Grinder 3 Jar + 3 Ltr Smart Cooker Outer Lid
MRP ₹ 4,215
COMBO PRICE ₹2026
Fav Tawa 280 + Favorite Pressure Cooker 3 Ltr Outer Lid Induction Base + Favorite Pressure Cooker 5 Ltr Outer Lid Induction Base
MRP ₹ 5,954
COMBO PRICE ₹2026
Cast Iron Flat Tawa 280 + Ayush 2 Burner Black
Pigeon
India's Choice Sale
ఫ్లాట్ ధర @ ₹2026*
*T&C Apply
MRP ₹ 3,725
COMBO PRICE ₹2026
Flat Tawa 250 EX + Inox Pressure Cooker 3.5 Ltr + 5 Ltr Outer Lid Induction Base Stainless Steel
MRP ₹ 4,650
COMBO PRICE ₹2026
Electric Rice Cooker 1.8 Ltr Single Pot + Wonder Cast 280 Tawa
MRP ₹ 3,990
COMBO PRICE ₹2026
EVA Infrared Cooktop 2000W
MRP ₹ 4,715
COMBO PRICE ₹2026
1.5 Ltr Swift Plus Multi-Cook Kettle - Blue + Popup Toaster + Inox Hydra Water Bottle 900 ml
MRP ₹ 4,695
COMBO PRICE ₹2026
Electric Rice Cooker Inox Pro With Steamer 1.8LDX
MRP ₹ 5,995
COMBO PRICE ₹2026
OTG 14 Ltr
Black Diamond Chimney 60cm + Glasstop Sleek 4 Burner Gas Stove
MRP ₹ 29,989
COMBO PRICE ₹14,995
MRP ₹ 4,990
COMBO PRICE ₹2026
Idiyappam Maker/Noodle Maker + CerraSteel Forged Ceramic Tawa 280
MRP ₹ 4,770
COMBO PRICE ₹2026
Nutri Blender 400W 2 Jar + 1.2 Ltr Multipurpose Kettle
STOVEKRAFT
Central Andhra: Vijayawada: Sakti Enterprises: 9700755950 Shree Lakshmi Sai Enterprises: 9963675725
Sales: West Godavari: 9985264716 Krishna Dist: 9963455502 Guntur, Prakasham, Nellore: 9550866753 State Head: 9885733308
For Corporate and Bulk Enquiry: 9949242359
Pigeon Exclusive Stores: Fortune MG Road: 8664066099 Besent Road: 8664065611 Ramavarappadu: 8664060497
Machavaram: 8663533396 Satyanaraynapuram: 8663501253 Nellore: GNT Road: 8614014897 Mogalrajupuram: 8663500757
Satyanaraynapuram: 8663501253 Mogalrajupuram: 8663500757 Guntur: Broadaipeta: 8633501418
Open your own Pigeon Exclusive Store, call: 9959011896
For any service related queries, please contact: 6364914202
Locate your nearest Pigeon Exclusive Store

నాలుగో రోజూ ఆరని బ్లోఅవుట్

అరికట్టేందుకు ఓఎన్జీసీ చర్యలు



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

మలికిపురం, పి.గన్నవరం, రాజోలు, న్యూస్‌టుడే: కోనసీమలోని మలికిపురం మండలం ఇరుసుమండలోని ఓఎన్జీసీ గ్యాస్ బావిలో ఈ నెల 5న సంభవించిన బ్లోఅవుట్ ఇంకా అదుపులోకి రాలేదు. నాలుగో రోజు గురువారం మంటల తీవ్రతలో హెచ్చుతగ్గులు కనిపించాయి. నియంత్రించేందుకు ఓఎన్జీసీ టెక్నాలజీస్, ఫీల్డ్ సర్వీసెస్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా, ఆ సంస్థ నేషనల్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్ (ఎన్‌సీఎంటీ) హెడ్ శ్రీహరి నేతృత్వంలో సిబ్బంది శ్రమిస్తున్నారు. ఐదు వేల జీపీఎం (గ్యాలన్స్ ఫర్ మినిట్) సామర్థ్యం గల పంపుతో నీటిని మంటలపై చిమ్ముతున్నారు. మరోవైపు డ్రిల్లింగ్ సైట్ వద్ద దగ్ధమైన భారీ యంత్ర శకలాల తొలగింపు ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇంతవరకు సుమారు 300 మెట్రిక్ టన్నుల శకలాలను భారీ క్రేన్ల సాయంతో ట్రాలీలపై తరలించారు. ఇవి మరో 300 నుంచి 400 టన్నుల వరకు ఉంటాయని చెబుతున్నారు.

వెల్ క్యాపింగ్ పనులే తరువాయి: డ్రిల్లింగ్ సైట్‌లో మంటలు వ్యాపించిన బావి వద్దకు ఎన్‌సీఎంటీ బృందం చేరుకోవాల్సి ఉంది. దానిచుట్టూ ఉన్న కాలిన శకలాలను నూరు శాతం తొలగిస్తే తప్ప అక్కడికి వెళ్లే వీలుండదు. ఆయా పనులు పూర్తిచేసి, శుక్రవారం నుంచి వెల్ క్యాపింగ్ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బ్లోఅవుట్ జరిగిన నాటినుంచి ఇప్పటివరకు సుమారు 3 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ దగ్ధమైనట్లు అంచనా. అందులో ముడిచమురు లేదని, గ్యాస్‌లో ఘనీభవించిన నీరు కలిసి మండటంతో పొగ వ్యాపించిందని చెబుతున్నారు. బ్లోఅవుట్ నియంత్రణ చర్యలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.

గంగాధర్ మెహెర్ వర్సిటీ వెబ్‌సైట్ హ్యాక్

సరిచేసిన సాంకేతిక నిపుణులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ఉన్న గంగాధర్ మెహెర్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ బుధవారం రాత్రి హ్యాకింగ్‌కు గురైంది. వెబ్‌సైట్ హోం పేజీపై పాకిస్థాన్ జాతీయ జెండా, ఐఎస్ఐ జిందాబాద్, పాకిస్థాన్ జిందాబాద్ వంటి నినాదాలు కనిపించినట్లు వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. సాంకేతిక నిపుణులు వెబ్‌సైట్‌ను సరి చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన హ్యాకర్లు 'ఓవర్‌త్రాష్-13" అనే ఐడీ పేరుతో హ్యాకింగ్‌కు పాల్పడినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి.

పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యకళాశాలకు 837 పోస్టుల మంజూరు

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యకళాశాలతోపాటు, అనుబంధంగా బోధనాసుపత్రి బలోపేతానికి ప్రభుత్వం 837 పోస్టులు మంజూరుచేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కొత్తగా పోస్టులు సృష్టించకుండా మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రుల నుంచి వీటిని కేటాయించింది. ఆయా ఆసుపత్రులను ఇప్పటికే పీపీపీ విధానంలో నిర్వహించేందుకు ప్రతిపాదించడంతో అక్కడి పోస్టులను మళ్లిస్తూ నిర్ణయం తీసుకుంది. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యకళాశాలలో 2026-27 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 330 నుంచి 420కి పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.



సదస్సులో నేషనల్ కాంక్లేవ్‌ను ఆవిష్కరించిన మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు. చిత్రంలో ఏఎస్‌టీసీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆర్.బి.ఎన్ ప్రసాద్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌టీసీ ఛైర్మన్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, 'ఈనాడు' ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎస్‌టీసీ కార్యదర్శి సీఎల్.నరసింహారావు

ప్రయోగశాలల విజ్ఞానం.. ప్రజాక్షేత్రంలో వికసించాలి

- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఈనాడు, హైదరాబాద్: శాస్త్ర విజ్ఞానాన్ని మాతృభాషలో బోధించాలని, అప్పుడే విద్యార్థులకు ఆసక్తి పెరగడంతోపాటు సులువుగా అర్థమవుతుందని, పిల్లల మెదళ్లలో శాస్త్రీయ దృక్పథాలు బలంగా నాటుకుపోతాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మన లక్ష్యం, గమ్యం ఒక్కటేనని... శాస్త్ర విజ్ఞానంలో అగ్రస్థానంలో ఉండటమేనన్నారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ), 'ఈనాడు' సంయుక్తంగా, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా(ఎన్ఏఎస్ఐ) తెలంగాణ చాప్టర్‌తో కలిసి గురువారం హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో 'ల్యాబ్ టు సొసైటీ: సైన్స్ కమ్యూనికేషన్ పాత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. దీనికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కాగా... ఐసీఎంఆర్ మాజీ డీజీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఏఎస్‌టీసీ ఛైర్మన్, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా(ఎన్ఏఎస్ఐ) తెలంగాణ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, 'ఈనాడు' ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎస్‌టీసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.బి.ఎన్.ప్రసాద్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగించారు. "శాస్త్రీయ అంశాలు నాలుగు గోడల మధ్యే ఆగిపోకుండా ప్రజల ముంగిటకు చేర్చి వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగవంతం చేయాలి. మాతృభాషలో విద్యాబోధనతో విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. శాస్త్ర విజ్ఞానాన్ని మాతృభాషలో బోధించడానికి వీలుగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి, యూజీసీలు పాఠ్యప్రణాళికలను సిద్ధం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు.

ఈనాడు

నగరాల వెతలు తీర్చే మార్గమిదీ!

భారతావని ప్రగతి రథాన్ని ముందుకు నడిపిస్తున్నవి నగరాలే. దేశ జీడీపీలో 63శాతం వాటినుంచే సమకూరుతోంది. వచ్చే పాతికేళ్లలో ఆ వాటా 75శాతం కానుందని అంచనా. స్టార్టప్‌లూ నవకల్పనలకు నెలవులుగా, లెక్కకుమిక్కిలి వ్యాపారాలకు ప్రధాన కేంద్రాలుగా వర్ధిల్లుతున్న నగరాలు పల్లెపట్టుల నుంచి ఎంతోమందిని ఆకర్షిస్తున్నాయి. జోరందుకుంటున్న ఆర్థిక కార్యకలాపాలూ వలసలకు తగినట్లే పట్టణభారతంలో నిర్మాణాలూ విపరీతమవుతున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) తాజా అధ్యయనం ప్రకారం, 2000-2022 సంవత్సరాల మధ్యలో గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మాణ ప్రాంత వైశాల్యం 293 చదరపు కిలోమీటర్ల నుంచి 425 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. వేగవంతమైన పట్టణీకరణకు వరద నీటిపారుదల వ్యవస్థల అధ్వాన నిర్వహణ తోడు కావడంతో కుండపోత వానల సమయంలో భాగ్యనగర జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. అధిక వర్షపాతాన్ని తట్టుకునే ఏర్పాట్లు కొరవడటంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో 39శాతం జనావాసాలకు తీవ్రస్థాయి వరద ముప్పు పొంచిఉందని, మరో 24శాతం ప్రాంతాలు ఓ మోస్తరు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని 'టిస్' వెల్లడించింది. హైదరాబాద్ అనేముంది... చెరువులూ మురుగుకాల్వల ఆక్రమణలు, అక్రమ కట్టడాల మూలంగా ఏపీ, తెలంగాణల్లోని పలు పట్టణాలు తరచూ నీట మునుగుతున్నాయి. జనాన్ని కట్టుబట్టలతో నిలబెట్టి కన్నీటి సంద్రంలో ముంచేస్తున్నాయి!

జనాభా అవసరాలకు అనుగుణంగా నాలాలను విస్తరించకపోవడం, ఉన్నవాటిలోనూ పూడికలు తీయకపోవడం లాంటి కారణాలతో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి చోట్ల వానాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. విశాఖపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప తదితరాల్లోనూ మురుగు, వర్షపు నీటి ప్రవాహ మార్గాల బాగుసేత పనులు సకాలంలో జరగట్లేదంటూ కథనాలు వెలువడ్డాయి. దీనికి తోడు స్థానిక నీటి వనరుల కబ్జాలు నగరాలకు ప్రాణసంకటమవుతున్నాయి. బుడమేరు ఆక్రమణపాలుకావడంతోనే పదహారు నెలల కిందట విజయవాడలో పలు ప్రాంతాలు జలవిలయంలో చిక్కుకున్నాయి. దేశవ్యాప్తంగా 5,161 పట్టణ ప్రాంతాలు వరదల బారినపడే ప్రమాదముందని సర్కారీ నివేదికలే హెచ్చరిస్తున్నాయి. ప్రణాళికారహిత పట్టణాభివృద్ధితో పెనుసమస్యలు అనేకం చుట్టుముడుతున్నా యంత్రాంగంలో కదలిక లేకపోవడమే జనభారత ప్రారబ్ధం!

దేశీయ పట్టణాల్లో జనాభా గడచిన అరవై ఏళ్లలో ఆరు రెట్లు పెరిగింది. 2020లో 48కోట్లుగా ఉన్న నగరభారత జనసంఖ్య 2050 నాటికి 95కోట్లను మించిపోనుంది. 1985-2015 మధ్యలో నిర్మాణ కార్యకలాపాల ఉద్ధృతి వల్ల భారతీయ నగరాల్లో వరద ప్రమాద పీడిత జనావాసాలు 102శాతం అధికమయ్యాయి. దానివల్ల దేశం ఏడాదికి 400కోట్ల డాలర్ల సంపదను కోల్పోతోంది. సరైన నివారణ చర్యలు చేపట్టకపోతే 2070నాటికి ఆ వార్షిక నష్టం 3వేల కోట్ల డాలర్లకు చేరుతుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నేతృత్వంలో ప్రపంచబ్యాంకు గ్రూప్ నిరుడు వెలువరించిన నివేదిక లెక్కగట్టింది. ఇతర దేశాలతో పోలిస్తే చాలాతక్కువగా ఇండియాలో పట్టణ మౌలికవసతులు, సేవలకు జీడీపీలో 0.70శాతం సొమ్మునే వెచ్చిస్తున్నారని అది పెదవి విరిచింది. 2050 నాటికి 2.4లక్షల కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెడితేనే ప్రకృతి వైపరీత్యాలను దీటుగా ఎదుర్కొనే సత్తా భారతదేశ నగరాలకు సిద్ధిస్తుందని అంచనా వేసింది. ఆమేరకు నిధులు సమకూర్చుకుంటూ టౌన్‌ప్లానర్ల కొరతను తీర్చడం, జలవనరుల ఆక్రమణలూ పురపాలక సంఘాల్లోని అవినీతిని అరికట్టడంలో ప్రభుత్వాలు నెగ్గుకురావాలి. అప్పుడే సుస్థిరాభివృద్ధి, ఆహ్లాదకర జీవనాలకు పట్టణ భారతం ఆలవాలమవుతుంది!

మళ్లీ వలసవాద యుగంలోకి?

అమెరికా సైనికులు ఇటీవల వెనెజువెలా రాజధాని కరాకస్‌లోని అధ్యక్ష భవనంపై మెరుపు దాడి చేసి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను అపహరించి న్యూయార్క్‌కు తీసుకుపోయారు! మాదకద్రవ్య ఉగ్రవాదానికి పాల్పడ్డారంటూ మదురోపై క్రిమినల్ కేసు పెట్టి, అక్కడ విచారిస్తున్నారు. దేశాధ్యక్షుడి అపహరణను పలు దేశాలు నిర్ద్వంద్వంగా ఖండించాయి. భారత్ మాత్రం సమస్యను శాంతియుతంగా, సంప్రదింపులతో పరిష్కరించుకోవాలంటూ పిలుపిచ్చింది!

వెనెజువెలా దేశాధ్యక్షుడితో పాటు ఆయన భార్యనూ అమెరికా సైన్యం అపహరించుకుని తీసుకుపోవడం యావత్ ప్రపంచాన్నీ నివ్వెరపరచింది. అధ్యక్షుడు మదురో, ఆయన భార్య, కుమారుడు అగ్రరాజ్యానికి కొకైన్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారని ట్రంప్ సర్కారు ఆరోపిస్తోంది. పైగా వారు అమెరికా ఉగ్రవాద గ్రూపులుగా ప్రకటించిన డ్రగ్ ముఠాలతో కుమ్మక్కయ్యారని, ఇది మాదకద్రవ్య ఉగ్రవాదమని (నార్కో టెర్రరిజమని) అంటోంది. ఒక సార్వభౌమ దేశ అధినేత, ఆయన భార్యను సైనిక చర్యతో అపహరించి, వేరే దేశానికి తీసుకురావడం ఐక్యరాజ్యసమితి నిబంధనలకు పూర్తి విరుద్ధం. అగ్రరాజ్య చర్య అంతర్జాతీయ ప్రమాణాలనూ, న్యాయపాలన సూత్రాన్నీ ఉల్లంఘిస్తోంది. ఒకవేళ అమెరికా ఆరోపిస్తున్నట్లు మదురో దంపతులు నిజంగానే నార్కో టెర్రరిజానికి పాల్పడుతున్నా, వారిపై విచారణ చేపట్టడానికి అంతర్జాతీయ సమాజానికి ఆమోదనీయమైన పద్ధతులను అవలంబించాల్సింది. కానీ, తానే అంతర్జాతీయ పోలీసుగా, న్యాయమూర్తిగా వ్యవహరిస్తూ బలప్రయోగంతో ఏకపక్ష చర్యకు ఉపక్రమించడం అమెరికాకు తగదు. ఒక స్వతంత్ర దేశాధ్యక్షుణ్ని సాధారణ నేరస్థుడిగా పరిగణించడం అంతర్జాతీయ గౌరవమర్యాదలకు విరుద్ధం. న్యూయార్క్ న్యాయస్థానం నుంచి మదురో బయటికి వస్తూ, తాను అపహరణకు గురైన అధ్యక్షుడిననీ, యుద్ధఖైదీనని పేర్కొన్నారు.




బలవంతుడిదే రాజ్యమా?

దురదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో దేశాల మధ్య విభేదాలు వివాదాలను బలప్రయోగంతో పరిష్కరించుకునే ధోరణి ప్రబలుతోంది. ఆర్మీనియా-అజర్ బైజాన్, ఉక్రెయిన్‌పై రష్యా దాడులకు దిగడం, ఇజ్రాయెల్-హమాస్‌లు పరస్పరం దాడులు చేసుకోవడం ఇందుకు నిదర్శనం. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడి కూడా ఈ కోవలోకే వస్తుంది. ప్రపంచంలో ఇలా 'బలవంతుడిదే రాజ్యం' అనే ధోరణి ప్రబలితే- చిన్న దేశాలకు సైనికంగా బలహీనమైన రాజ్యాలకూ దిక్కెవరుంటారు? వెనెజువెలాపై వాషింగ్టన్ దండనీతిపై వివిధ దేశాలు రకరకాలుగా స్పందించాయి. రష్యా, చైనా, బ్రెజిల్‌తో పాటు పలు లాటిన్ అమెరికా దేశాలు అగ్రరాజ్య దుందుడుకుతనాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాయి. ఐరోపాలోని అమెరికా మిత్రదేశాలేమో మెత్తగా స్పందిస్తూ, అందరూ అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలంటూ సన్నాయి నొక్కులు నొక్కాయి. ఐరోపా సమాఖ్య(ఈయూ) మాత్రం అమెరికాను ఖండించకపోవడంతో ముందుకురాలేదు. సరికదా, మదురో సర్కారుకు చట్టబద్ధత లేదంటూ అమెరికాకే వంతపాడింది. ఇండియా మాత్రం సమస్యను శాంతియుతంగా, సంప్రదింపులతో పరిష్కరించుకోవాలని పిలుపిచ్చింది. దిల్లీలో విడుదలైన ప్రకటనలో, వెనెజువెలా తాజా పరిణామాలపై భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామంటూ వెనెజువెలా ప్రజల శ్రేయస్సు, భద్రతకు మద్దతు ప్రకటించింది. సంబంధిత పక్షాలన్నీ శాంతియుతంగా విభేదాలను పరిష్కరించుకుని సుస్థిరత సాధించాలని కోరింది. అంటే వెనెజువెలాపై అమెరికా సైనిక చర్యను భారత్ ఖండించనూ లేదు, అంతర్జాతీయ ప్రమాణాలను అగ్రరాజ్యం ఉల్లంఘించిందనీ అభ్యంతరం పెట్టనూలేదు. అదే సమయంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనడం ద్వారా రాజకీయ లక్ష్యాల సాధనకు బలప్రయోగం సరికాదని హితవు చెప్పింది. ప్రస్తుతం ట్రంప్ సర్కారు భారత ఎగుమతులపై సుంకాలను భారీగా పెంచేసింది. భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. అందువల్ల రెండు దేశాల సంబంధాలు సజావుగా లేవనే చెప్పాలి. అవి మరీ దెబ్బతినిపోకుండా చూసుకోవాల్సిన లక్ష్యంతో దిల్లీ వెనెజువెలా వ్యవహారంలో ఆచితూచి వ్యవహరించింది. వాషింగ్టన్-కరాకస్ సంబంధాలు మళ్లీ గాడినపడితే వెనెజువెలాలోని అపార చమురు నిక్షేపాల తవ్వకంలో భారతీయ చమురు కంపెనీలూ పాలు పంచుకోగలుగుతాయి. వెనెజువెలాపై ఆంక్షలను అమెరికా ఎత్తివేస్తే భారత్ అక్కడి నుంచి చమురు దిగుమతి చేసుకోగలుగుతుంది. పైగా ట్రంప్ వెనెజువెలా పాలనను తమ గుప్పిట్లోకి తీసుకుని, అక్కడి చమురు ఆదాయాన్ని సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. దాంతో ప్రపంచం మళ్లీ వలసవాద యుగంలోకి వెళ్తోందా అనే ఆందోళన పెరుగుతోంది. పైకి మాదకద్రవ్య ఉగ్రవాదాన్ని దెబ్బతీయడమే లక్ష్యమని అమెరికా చెబుతున్నా, అక్కడి చమురు నిక్షేపాలను కబ్జా చేయడమే అసలు ఉద్దేశమని తెలుస్తోంది.

తెరపైకి 'డాన్రో' సిద్ధాంతం!

అంతర్జాతీయ వాణిజ్యాన్ని డాలర్‌లో కాకుండా ఇతర కరెన్సీలలో జరపాలని బ్రిక్స్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ట్రంప్‌నకు కంటగింపుగా మారాయి. ఆయా దేశాలు తమ వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీలలోనే నిర్వహించుకునే ప్రయత్నాలను ఆయన వ్యతిరేకిస్తున్నారు. అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా డాలర్ ఆధిపత్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను గట్టిగా నిరోధిస్తున్నారు. ఇలాంటి తరుణంలో, మదురో సైతం చమురు అమ్మకాలను డాలర్లలో కాకుండా చైనా కరెన్సీ యువాన్‌లో జరుపుతుండటం ట్రంప్‌ను చిర్రెత్తించింది. డాలర్ ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికి జరుగుతున్న కుట్రలో పాల్గొనవద్దని లాటిన్ అమెరికా దేశాలను ఆయన హెచ్చరిస్తున్నారు. తద్వారా అవి తన గుప్పిట నుంచి జారిపోకుండా చూసుకుంటున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో- అంటే పశ్చిమార్ధ గోళంలో అమెరికాదే సర్వాధిపత్యమని- ఇక్కడ ఐరోపా దేశాలు సహా మరెవరూ జోక్యం పెట్టుకోకూడదని 1823లో నాటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో హెచ్చరించారు. దీన్నే మన్రో సిద్ధాంతమంటున్నారు. దాన్ని ట్రంప్ పునరుద్ధరిస్తున్నారు. అందుకే దీన్ని ఇప్పుడు 'డాన్రో సిద్ధాంతం' అంటున్నారు. అమెరికా ఒకప్పుడు పాటించిన అంతర్జాతీయ ప్రమాణాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. తనకొక నీతి, ప్రపంచానికి వేరొక నీతి అన్నట్లు ప్రవర్తిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, అమెరికా చర్యలను ఖండించడంవల్ల లాభంకన్నా నష్టమే ఎక్కువని భారత్ భావిస్తోంది. అందుకే ఇది యుద్ధానికి రోజులు కావని, వివాదాలను బలప్రయోగంతో కాకుండా దౌత్యం, సంప్రదింపుల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచిస్తోంది.



అచల్ మల్హోత్రా
ఆర్మేనియా, జార్జియాల్లో భారత మాజీ రాయబారి



ఎంత వేగంగా?

"మో ఫరా కూడా ఉసేన్ బోల్ట్ లానే వరల్డ్ ఛాంపియన్ సార్. ఉసేన్ బోల్ట్ గోల్డ్ మెడల్ గెలిచిన అదే ఒలింపిక్స్‌లో వరుసగా రెండుసార్లు గోల్డ్ మెడల్స్ గెలిచాడు. కానీ అది 100 మీటర్లలో కాదు... 200 మీటర్లలోనూ కాదు. అయిదువేల మీటర్లు... పదివేల మీటర్లు. కానీ ఎవరికీ మో ఫరా గుర్తుండడు. కేవలం వంద మీటర్లు వేగంగా పరిగెత్తే ఉసేన్ బోల్ట్‌ని గుర్తుపెట్టుకుంటారు..."

'మహర్షి' సినిమాలోని ఈ డైలాగ్స్ చాలామందికి తెలుసు. కానీ తెలియని విషయం ఒకటుంది. మో ఫరా 2023లో పరుగు పోటీల నుంచి రిటైర్ అయితే, ఆయన కన్నా మూడు సంవత్సరాలు చిన్నవాడైన బోల్ట్ 2017లోనే అనారోగ్యం కారణంగా పోటీల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. 2017 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో 400 మీటర్ల రిలేలో ఉసేన్ బోల్ట్ గాయంతో మైదానంలోనే కుప్పకూలిపోయాడు. అదే చోట పదివేల మీటర్ల పోటీలో మో ఫరా కాంస్య పతకం సాధించి విజేతగా నిలిచాడు.


మో ఫరా తన చివరి పోటీని ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ముగిస్తే, బోల్ట్ ప్రేక్షకుల జాలి చూపుల మధ్య నిస్సహాయంగా ముగించాడు. ప్రస్తుతం మో ఫరా తన రిటైర్మెంట్ జీవితాన్ని ఆస్వాదిస్తూ ఉంటే, బోల్ట్ మాత్రం వెన్నెముక, మడమ సమస్యలతో బాధపడుతున్నాడు. మెట్లు ఎక్కాలంటే ప్రాణం పోయినట్లుగా ఉంటుందని ఆయనే స్వయంగా చెప్పాడు. బోల్ట్ విజయాల నుంచి స్ఫూర్తి పొందడంతో పాటు, ఆయన ప్రస్తుత పరిస్థితి నుంచి పాఠాలు నేర్చుకోవడం కూడా అవసరమే.

వంద మీటర్ల పరుగు పందెంలో వేగమే ప్రధానం. అందుకే ఆ పది సెకండ్లూ సర్వశక్తులూ ఒడ్డి పరిగెడతారు. కానీ లాంగ్ డిస్టెన్స్ పోటీ అలా ఉండదు. నిలకడగా ఎక్కువసేపు పరిగెత్తాల్సి ఉంటుంది. అందుకే వంద మీటర్ల రేస్‌లో ఉండే మజా లాంగ్ డిస్టెన్స్ రేస్‌లో ఉండదు. కానీ జీవితం 100 మీటర్ల పరుగు పందెం కాదు... వందేళ్ల మారథాన్. ఇందులో గెలవడానికి వేగం ఒక్కటే సరిపోదు. నిలకడగా ఎక్కువ కాలం పాటు పరిగెత్తే వారిదే గెలుపు. ఆ విషయం తెలియక కొంతమంది వేగంగా పరిగెత్తుతూ మార్గమధ్యంలోనే పోటీనుంచి తప్పుకొంటుంటారు.

జీవితంలో వేగంగా ఎదగాలనుకోవడం తప్పుకాదు. కానీ ఎంత వేగంగా? వృద్ధులైన తల్లిదండ్రుల్ని పలకరించలేనంత వేగంగానా? పిల్లలు ఏ క్లాసు చదువుతున్నారో తెలుసుకోలేనంతా? జీవిత భాగస్వామితో వారానికోసారైనా కలిసి కాఫీ తాగలేనంతా? ఆఖరికి ఇష్టమైన పదార్థాలను కూడా తృప్తిగా తినలేనంత వేగంగానా?

ఆరోగ్యం, కుటుంబం, విలువలు, సామాజిక బంధాలను కాపాడుకుంటూ నిలకడగా పరిగెత్తే వారికి ఉసేన్ బోల్ట్ అంత గొప్ప పేరు, సంపద రాకపోవచ్చు. కానీ అతనిలా బాధపడే పరిస్థితి మాత్రం రాదని కచ్చితంగా చెప్పొచ్చు!

- వెలుగోటి రాములు
సోషల్ డెవలప్‌మెంట్ గ్రూప్ డైరెక్టర్, ఏపీ సీఆర్‌డీఏ



అభివృద్ధి పేరుతో ఆత్మహత్యాసదృశమైన కార్యక్రమాలు చేపట్టడమే హిమాలయాల్లాంటి చోట్ల ప్రజల జీవితాలు సంక్షోభంలో పడటానికి కారణం. స్వల్పకాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం శాశ్వతంగా ఉండాల్సిన పర్వతాలనూ నదులనూ నాశనం చేసుకుంటున్నాం.

- సుందర్‌లాల్ బహుగుణ

నీలోని నువ్వు

ప్రతి మనిషిలోనూ సాధారణంగా రెండు కోణాలుంటాయి. పైకి కనిపించే ప్రవర్తన, మనసు పొరల్లో దాగి ఉన్న లోలోపలి చింతన. లోపలి మనిషి ఎప్పుడూ మంచీ చెడుల విచారణ చేస్తూ హెచ్చరిస్తుంటాడు. దాన్ని గుర్తించకుండా బహిరంగ ప్రవర్తన సాగుతుంటుంది.

ఏ పనిచేస్తున్నా దానిమీదే ధ్యాస ఉంచి శ్రద్ధగా, నైపుణ్యంతో చేస్తేనే ఫలితం ఉన్నతంగా వస్తుంది. చేస్తున్న పని పట్ల విముఖత మంచిది కాదు. ఇష్టంగా కాకుండా కష్టంగా, యాంత్రికంగా చేసే ఏ పనీ ఎక్కువ ఫలితాన్నివ్వదు. ప్రతి మనిషిని 'నేను' అనే భావం నడిపిస్తుంది. శాసిస్తుంది. నాలుగు అంతఃకరణాలు మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం కలిసి 'నేను'గా ఏర్పడతాయి. అది అహంభావం, అసూయగా మారితే మనిషి పతనానికి కారణమవుతుంది. 'నేను' అనే భావం పదునైన కత్తి వంటిది. కత్తిని అవసరమైన పనులకు ఉపయోగించవచ్చు, ఇతరులకు హాని కలిగించే పనులకూ వాడవచ్చు. అదొక పనిముట్టు. దాంతో చేసిన పనులకు ఫలితం మాత్రం మనకే లభిస్తుంది. ఒక వ్యక్తి తన క్రూరమైన సహజ స్వభావాన్ని అణచిపెట్టి తపస్సు చేయసాగాడు. అతడికి భగవంతుడు ప్రత్యక్షమైతే ఎటువంటి వరాలు అడుగుతాడోనని భయపడి ఇంద్రుడు తపస్సు విఘ్నం చేయడానికి ఒక ఎత్తు వేశాడు. ఒక కత్తిని తెచ్చి అతడికిచ్చి తాను తిరిగొచ్చేవరకు దాన్ని కాపాడమని కోరాడు. ఆ వ్యక్తి కత్తిని ఎప్పుడూ తన వెంట ఉంచుకుని తన పనులకు ఉపయోగించుకునేవాడు. క్రమంగా ఆయుధ ప్రయోగానికి అలవాటుపడి సహజ స్వభావంతో పతనం చెందాడు.



అంతర్యామి

'నేను' అనే అహంకారం ఒక్కోసారి మనిషిని లొంగదీసుకుంటుంది. విద్య, వృత్తి, ఇతర రంగాల్లో వేరొకరు తనకు సాటిరాకూడదనే ఈర్ష్య అసూయలను ప్రేరేపిస్తుంది. కర్ణుడు విలువిద్యలో గొప్ప ప్రజ్ఞాశాలి. ద్రోణాచార్యుడి ప్రియశిష్యుడిగా అర్జునుడు తన కన్నా ప్రావీణ్యం సంపాదిస్తున్నాడని తెలుసుకున్నాడు. తాను అంతకన్నా ఎక్కువ అస్త్రాలు సాధించాలని పరశురాముణ్ని ఆశ్రయించాడు. అబద్ధం చెప్పి శిష్యుడిగా చేరాడు. ఎన్నో అస్త్ర శస్త్ర ప్రయోగాలు నేర్చుకున్నాడు. ఒకరోజు గురువు శిష్యుడి ఒడిలో తలపెట్టి పడుకున్నాడు. ఒక విషపు పురుగు తన తొడను తొలుస్తున్నా గురువుకు నిద్రాభంగం కలగకుండా ఓర్చుకున్నాడు కర్ణుడు. పరశురాముడు మేల్కొని జరిగింది తెలుసుకున్నాడు. కర్ణుడు తనతో అబద్ధం చెప్పి, మోసంతో విద్య నేర్చుకోవడం భరించలేక శపించాడు. కారణాలు ఏవైనా అంతరాత్మను చంపుకొని ఏదో విధంగా ప్రయోజనం పొందాలని చూస్తే మనకు మనం నష్టం చేసుకున్నట్లే అవుతుంది. అద్దంలో శరీర ప్రతిబింబం మాత్రమే కనిపిస్తుంది, లోపలి మనోబింబం చూడగలిగితే దాన్ని అందంగా తీర్చిదిద్దుకోగలం.

మనిషి అంతరిక్షంలోని సుదూర గ్రహాలకు చేరుకుంటున్నాడు కానీ తనలోనే ఉన్న లోపలి మనిషిని చేరుకోలేక పోతున్నాడు. 'నీలో ఉన్న నువ్వు' ఎవరో తెలుసుకుంటే 'నేనెవరిని' అనే ప్రశ్న ఎప్పటికీ రాదు.

- రావులపాటి వెంకట రామారావు



ఆశ్రయమిస్తారా..!

స్వదేశాల్లో తమ జీవితాలకు భద్రత లేదని భావిస్తున్న చాలామంది ఆశ్రయం కోసం విదేశాలను అభ్యర్థిస్తున్నారు. ఈజిప్ట్, అమెరికా, జర్మనీలకు అలాంటి విన్నపాలు ఎక్కువగా వస్తున్నాయి. 2024లో అసైలం కోసం ఆయా దేశాలకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారంటే... (లక్షల్లో)

ఈజిప్ట్	4.33
అమెరికా	2.92
జర్మనీ	2.29
కెనడా	1.73
స్పెయిన్	1.67
ఇటలీ	1.58
ఫ్రాన్స్	1.30
యూకే	1.08
కెన్యా	0.88
మెక్సికో	0.78
గ్రీస్	0.68
బ్రెజిల్	0.68
పెరు	0.32

(ఆధారం: వరల్డ్ డేటా.ఇన్ఫో)

బ్లోఅవుట్... పర్యావరణానికి పెద్ద ప్రమాదం!

భూమి లోతుల్లోని చమురు, వాయు నిల్వలు రాళ్ల మధ్య, అత్యధిక పీడనంతో కలిసి ఉంటాయి. తవ్వకాల సమయంలో ఈ పీడనాన్ని సమతుల్యం చేయడానికి 'డ్రిల్లింగ్ మడ్' అనే ప్రత్యేక ద్రవాన్ని చమురు లేదా గ్యాస్ బావిలోకి పంపుతారు. తద్వారా ఏర్పడే హైడ్రోస్టాటిక్ పీడనం భూగర్భ పీడనంతో సమానంగా, లేదంటే అంతకంటే ఎక్కువగా ఉండాలి. అలాలేనప్పుడు- చమురు, వాయువు అకస్మాత్తుగా బావిలోంచి ఎగదన్నుకుని వచ్చేస్తుంది. దీన్నే 'కిక్' అంటారు. వెంటనే నియంత్రించకపోతే, అది పెను ప్రమాదకరమవుతుంది. ప్రజల ప్రాణాలకూ, వ్యవసాయానికీ, నీటి వనరులకూ, చుట్టపక్కల పర్యావరణానికీ తీవ్ర ముప్పు వాటిల్లజేసే ఈ పరిస్థితిని నివారించడానికి బ్లోఅవుట్ ప్రివెంటర్ పరికరాలు కీలకమవుతాయి. అయితే వీటిని సరిగ్గా నిర్వహించకపోయినా, సిబ్బందికి సరైన శిక్షణ లేకపోయినా ఈ పరికరాలు విఫలమై ప్రమాదం మరింత ఎక్కువవుతుంది.

మంటలు ఎలా చెలరేగుతాయి?

బ్లోఅవుట్ సమయంలో భూమి లోతుల్లోంచి చమురు, సహజ వాయువు నియంత్రణ లేకుండా వేగంగా బయటకు వస్తూనే ఉంటుంది. ఈ వాయువు ఉపరితల గాలిలోని ఆక్సిజన్‌తో కలిసినప్పుడు తక్షణం మండే స్వభావం ఏర్పడుతుంది. సరిగ్గా అదే సమయంలో అక్కడ ఏపాటి చిన్న నిప్పురవ్వ వచ్చిపడినా క్షణాల్లో మంటలు ఎగిసిపడతాయి. చమురు-వాయు బావి దగ్గర ఎలక్ట్రిక్ స్విచ్, ఇంజిన్లు, జనరేటర్లు వంటి వాటిని ఆన్‌చేస్తారు కాబట్టి, అగ్గి రాజుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇంజిన్ వేడివల్లా మంటలు రేగుతాయి. దేశంలో బ్లోఅవుట్ ప్రమాదాలు కొత్తవేమీ కావు. 1995 జనవరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాశర్లపూడి ప్రాంతంలో చోటుచేసుకున్న బ్లోఅవుట్‌ను నేటికీ స్థానికులు గుర్తుచేసుకుంటారు. అక్కడి చమురు-గ్యాస్ బావిలో తలెత్తిన మంటలు సుమారు 65 రోజులపాటు కొనసాగాయి. 2020 జూన్‌లో అస్సాంలోని తిన్‌సుకియా జిల్లాలో ఏర్పడిన గ్యాస్ బావి బ్లోఅవుట్ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దిబ్రూ-సైఖోవా జాతీయ ఉద్యానవనానికి సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం, మంటలు ఆర్పడానికి 173 రోజులు పట్టడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లింది. దేశంలో సుదీర్ఘకాలం కొనసాగిన బ్లోఅవుట్ ఇదే. ఇప్పుడు ఏపీలోని కోనసీమలో సంభవించిన బ్లోఅవుట్ ఇలాంటి పాత గాయాలను మళ్లీ గుర్తుకు తెస్తోంది. అక్కడ ఒక పాత చమురు బావిలో నిక్షేపాలను వెలికితీయడానికి పరీక్షలు జరుపుతున్న సమయంలో భూమి లోతుల్లోని వాయుపీడనం అకస్మాత్తుగా అదుపు తప్పింది. గ్యాస్ ఒక్కసారిగా బయటికి రావడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల అర కిలోమీటర్ వరకు 50డిగ్రీల ఉష్ణోగ్రతలు వ్యాపించాయి. డెల్టా ప్రాంతాల్లో పాత బావుల నిర్వహణ ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి హెచ్చరించింది.



చమురు, సహజ వాయువులు ఆధునిక సమాజానికి అత్యవసర ఇంధన వనరులు. అయితే వీటి అన్వేషణ, ఉత్పత్తి సమయంలో సంభవిస్తున్న బ్లోఅవుట్‌లు భయానకంగా ఉంటున్నాయి. భూగర్భంలోని అధిక పీడనం కారణంగా చమురు లేదా గ్యాస్ బావి గుండా పైకి ఎగదన్నడం వల్ల ఇవి చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ దగ్గర ఓఎన్‌జీసీ బావిలో బ్లోఅవుట్ సంభవించడంతో పెద్దయెత్తున మంటలు చెలరేగాయి.

అంతర్జాతీయంగానూ ఇలాంటి ప్రమాదాలెన్నో చోటుచేసుకున్నాయి. 2010లో మెక్సికో గల్ఫ్‌లో జరిగిన డీప్‌వాటర్ హరైజన్ బ్లోఅవుట్ అత్యంత భయానక పరిస్థితులను సృష్టించింది. బ్లోఅవుట్ ప్రివెంటర్ విఫలమవడంతో కోట్ల లీటర్ల చమురు సముద్రంలో కలిసిపోయి అక్కడి జీవావరణ వ్యవస్థ దారుణంగా దెబ్బతినిపోయింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కొంతకాలంగా చమురు, సహజ వాయు అన్వేషణ లోతైన, అధిక పీడనం కలిగిన భౌగోళిక ప్రాంతాల వైపు విస్తరిస్తుండటంతో బ్లోఅవుట్ ప్రమాదాలు పెరుగుతున్నాయి. పాత బావుల్లో మరమ్మతులు చేపట్టడం వంటివీ ఈ ముప్పును పెంచుతున్నాయి.

సమర్థంగా నివారించాలంటే...

బ్లోఅవుట్‌లను సమర్థంగా నివారించాలంటే భూగర్భంలోని పీడనాన్ని ముందుగానే కచ్చితంగా అంచనా వేయాలి. తవ్వకాల సమయంలో 'డ్రిల్లింగ్ మడ్' బరువు, రసాయన కూర్పు సరిగ్గా ఉండేలా చూడటంతో పాటు ఏఐ ఆధారిత రియల్ టైమ్ పర్యవేక్షణ చేపట్టాలి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలుండే బ్లోఅవుట్ నివారణ పరికరాలను సమకూర్చుకోవడం కీలకం. మరోవైపు విపత్తు స్పందనా దళాన్ని నిత్యం అప్రమత్తంగా ఉంచుతూ, ప్రమాదాలు సంభవించినప్పుడు సమర్థంగా ఎదుర్కొనేలా పటిష్ఠ ప్రణాళికలను రూపొందించుకోవాలి. చమురు, గ్యాస్ బావులకు పరిసరాల్లో ఉండే ప్రజలకు బ్లోఅవుట్‌లపై అవగాహన కలిగించడం ద్వారా ప్రాణ, పర్యావరణ నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇంధన అవసరాలకంటే ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని ఆయా సంస్థలూ ప్రభుత్వాలూ గ్రహించి... బ్లోఅవుట్ వంటి ప్రమాదాలను సమర్థంగా నివారించడంపై దృష్టి పెట్టాలి.



ఆచార్య నందిపాటి సుబ్బారావు
భూవిజ్ఞాన శాస్త్రవేత్త

భలే అంకెల కథ..!

రాము అయిదో తరగతి చదువుతున్నాడు. ఒకసారి తను టీచర్ దగ్గరికి వెళ్లి.. 'టీచర్ నేను చిన్నగా ఉన్నానని రాజు ఏడిపిస్తున్నాడు' అని బాధగా చెప్పాడు. అప్పుడు టీచర్.. 'పిల్లలూ ఈరోజు మీకు అంకెల కథ చెబుతాను వింటారా?' అన్నారు. 'వింటాం టీచర్' అన్నారు విద్యార్థులు. 'అంకెల్లో తొమ్మిదికి చాలా గర్వం ఉండేది. తనే అన్నింటికంటే పెద్దదాన్ని అనుకునేది. అలా ఒకసారి ఎనిమిదిని గట్టిగా కొట్టింది. అప్పుడు ఎనిమిది.. దానికంటే చిన్నదైన ఏడును కొట్టేసింది. ఇలా అంకెలన్నీ వాటి కంటే చిన్నవైన వాటిని కొట్టుకుంటూ వెళ్లాయి. చివరగా ఒకటి వంతు వచ్చింది. దాని పక్కన అన్నింటి కంటే చిన్నదైన సున్నా ఉంది. ఒకటి కూడా దాన్ని



కొడుతుందేమోనని భయంతో సున్నా కళ్లు మూసుకుంది. కానీ ఒకటి దాన్ని కొట్టకుండా దగ్గరికి తీసుకుని పక్కన కూర్చోబెట్టుకుంది. అప్పుడేమైందో తెలుసా? ఒకటి, సున్నా కలిసి.. 10 అయింది. మొదట గర్వంతో ఉన్న తొమ్మిది చిన్నదైపోయింది. కానీ అన్నింటికంటే చిన్నదైన సున్నాను గౌరవించి పక్కన చేర్చుకున్న ఒకటి మాత్రం పెద్ద సంఖ్య అయింది. అందుకే మనం ఎవరినైనా సరే, తక్కువ చేసి చూడకూడదు. అలా చేస్తే మనమే ఒంటరిగా మిగిలిపోతాం. అదే అందరినీ మిత్రులను చేసుకుంటూ వెళ్తే మనకూ బోలెడు బలం చేకూరుతుంది.

హాయ్! బుజ్జీ!!

మనకు ఎక్కువ బలం ఉంటే.. ఇతరులకు సాయం చేయడానికి ఉపయోగించాలి గానీ.. భయపెట్టకూడదు' అర్థమైందా అన్నారు టీచర్. 'చాలా బాగా అర్థమైంది టీచర్!' అన్నారు పిల్లలంతా. రాజు అదంతా అర్థం చేసుకుని.. రాముకు సారీ చెప్పాడు. అది చూసి క్లాస్‌లో ఉన్న పిల్లలందరూ చప్పట్లు కొట్టారు. అప్పటి నుంచి రాజు ఎప్పుడూ రాముని హేళన చేయలేదు.

- కరణం హరికిషన్





వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మల్లికార్జునరావు. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



జస్టిస్ మల్లికార్జునరావు, కిరణ్మయి దంపతులను సన్మానించి పట్టువస్త్రాలు అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం

న్యాయవ్యవస్థపై జస్టిస్ మల్లికార్జునరావుది చెరగని ముద్ర

- వీడ్కోలు సభలో ఆయన సేవలను కొనియాడిన సీజే

ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ ప్రగడ మల్లికార్జునరావు పదవీ విరమణ సందర్భంగా హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈనెల 18తో జస్టిస్ మల్లికార్జునరావు పదవీ కాలం ముగియనుంది. సంక్రాంతి సెలవులు రావడం, 18న ఆదివారం కావడంతో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మొదటి కోర్టు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. జస్టిస్ టి.మల్లికార్జునరావు అందించిన న్యాయసేవలను గుర్తుచేశారు. వివిధ హోదాల్లో పనిచేసి న్యాయ వ్యవస్థపై చెరగని ముద్ర వేశారన్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. నిజాయతీ, కష్టపడే స్వభావం కలవారని, రాజ్యాంగబద్ధ పదవిని అధిరోహించినప్పటికీ సామాన్యుడిలా ఉంటారన్నారు. ఎన్నో కీలక కేసులు పరిష్కరించారని గుర్తుచేశారు. జస్టిస్ మల్లికార్జునరావు మాట్లాడుతూ 'వ్యవసాయ నేపథ్యం ఉన్న నేను హైకోర్టు న్యాయమూర్తి అవుతానని ఊహించలేదు. అప్పటి సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ నిర్ణయంతో పరిస్థితులు మారాయి. జిల్లా న్యాయవ్యవస్థ నుంచి పెద్ద సంఖ్యలో హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కావడంతో యువ న్యాయవాదుల్లోనూ ఉత్సాహం పెరిగింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా 220 మంది హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సిఫారసు చేశారు' అని గుర్తు చేసుకున్నారు. 'నా సీనియర్ న్యాయవాది వీఎస్ రామచంద్రమూర్తి సూచనలను నా వృత్తి జీవితం మొత్తం అనుసరించాను. హైకోర్టు న్యాయమూర్తిగా నా పేరును సుప్రీం కోర్టు కొలీజియానికి సిఫారసు చేసిన హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయికి కృతజ్ఞతలు. న్యాయమూర్తి వృత్తి జీవితం ఎంతో సంతృప్తినిచ్చింది' అని పేర్కొన్నారు. అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షుడు కేసీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. జస్టిస్ మల్లికార్జునరావు అందించిన న్యాయసేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు, అదనపు ఏజీ సాంబశివప్రతాప్, రాష్ట్ర పీపీ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) పసల పొన్నారావు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

★ మరోవైపు ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ మల్లికార్జునరావు, కిరణ్మయి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.సుజిత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టులకు బాంబు బెదిరింపులు

- పలు జిల్లాల్లో అప్రమత్తం
- నకిలీ ఈ-మెయిళ్లుగా పోలీసుల నిర్ధారణ



ఏలూరు జిల్లా న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన న్యాయమూర్తులు, సిబ్బంది, న్యాయవాదులు



చిత్తూరు కోర్టులో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

ఈనాడు, న్యూస్‌టుడే బృందం: రాష్ట్రంలోని పలు జిల్లా న్యాయస్థానాల్లో గురువారం కలకలం రేగింది. బాంబు దాడులు చేస్తామంటూ ఈ-మెయిళ్లు రావడంతో కొంత సమయం కోర్టుల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు.. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా బాంబులు లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు ఈ-మెయిళ్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వీటిపై విచారణ చేస్తున్నారు. చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆర్‌డీఎక్స్ పెట్టామని మధ్యాహ్నం 12.20 గంటలకు సూపరింటెండెంట్ అధికారిక మెయిల్ ఐడీకి విక్రమ్ రాజగురు అనే ఐడీ నుంచి బెదిరింపు వచ్చింది. మధ్యాహ్నం 1.15కు పేలుడు జరుగుతుందని ఎల్‌టీటీఈ, కశ్మీర్ ఐఎస్ఐ సభ్యుల పేరిట వర్తమానం అందింది. అవి పేలకపోతే ఆత్మాహుతి దాడికి తమ సానుభూతిపరులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని.. కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని బయటకు పంపారు. ఐదు గంటలపాటు తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలూ లేవని నిర్ధారించారు. 2016 ఏప్రిల్ 7న చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని పార్కింగ్ ప్రాంతంలో బాంబు పేలి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసును అప్పట్లో ఎన్ఐఏకు అప్పగించారు. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతోంది. దీంతో తాజా బెదిరింపులను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇదే సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలమనేరు, నగరి, కుప్పం, పాకాల, శ్రీకాళహస్తి, తిరుపతి, పుత్తూరు న్యాయస్థానాల్లోనూ తనిఖీలు చేపట్టారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే గురజాల జగన్.. చిత్తూరు కోర్టు ప్రాంగణానికి చేరుకుని తనిఖీల గురించి ఆరా తీశారు.

★ అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మదనపల్లె కోర్టునూ బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

★ అనంతపురం జిల్లా కోర్టుకు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు బలగాలతో అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు.

★ ఏలూరు జిల్లా న్యాయస్థానంలో బాంబులు పెట్టినట్లు కోర్టుకు ఈ-మెయిల్ రావటంతో విధి నిర్వహణలో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు బయటకు వచ్చేశారు. బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు చేరుకుని కోర్టు ప్రాంగణాన్ని జల్లెడ పట్టాయి. బాంబులు లేవని నిర్ధారించుకున్నాక న్యాయమూర్తులు, సిబ్బంది విధులకు హాజరయ్యారు.

★ విశాఖపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనంతరం కోర్టు కార్యకలాపాలు కొనసాగాయి.

ఒడిశాలోనూ..

ఒడిశాలోని సంబల్‌పూర్, కటక్, దేవ్‌గఢ్ జిల్లా కోర్టుల్లోనూ బాంబులు పెట్టారంటూ గురువారం ఈ- మెయిళ్లు వచ్చాయి. దీంతో ఈ కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియాకు ఫోన్‌చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు ఆయా కోర్టుల్లో డాగ్, బాంబు స్క్వాడ్ దళాలు, పోలీసులు జల్లెడ పట్టారు. ఎక్కడా బాంబులు లభ్యం కాలేదు.



బెండకాయతో గుండె భద్రం

బెండకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. బరువు తగ్గడానికి దోహదపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వాపు లక్షణాలను నివారిస్తాయి.
– కసెనెన్, వైద్య నిపుణులు

గ్రహం అనుగ్రహం

9–1–2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత ఋతువు, పుష్యమాసం, బహుళపక్షం
షష్ఠి: ఉ. 10-30 తదుపరి సప్తమి
ఉత్తర: సా. 5-15 తదుపరి హస్త
వర్జ్యం: రా. 2-07 నుంచి 3-48 వరకు
అమృత ఘడియలు: ఉ.9-48 నుంచి 11-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-48 నుంచి 9-33 వరకు
తిరిగి మ. 12-29 నుంచి 1-13 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.37; సూర్యాస్తమయం: సా.5.37

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.2	28.8
విజయనగరం	14.0	26.0
అనంతపురం	15.5	30.0
శ్రీకాకుళం	16.0	27.0
విశాఖపట్నం	16.4	27.4
గుంటూరు	17.0	29.0
తాడేపల్లిగూడెం	17.0	29.0
విజయవాడ	17.2	29.0
రాజమహేంద్రవరం	17.5	33.0
కర్నూలు	18.6	30.5
తిరుపతి	20.1	28.9
నెల్లూరు	20.8	29.5

156 కిలోల గర్భిణికి ప్రసవం చేసిన ప్రభుత్వ వైద్యులు

చెన్నై (ఆర్కే నగర్), న్యూస్‌టుడే: పలు అనారోగ్య సమస్యలు, అధిక బరువు ఉన్న గర్భిణికి చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడారు. ఆసుపత్రి డీన్, వైద్యుడు శాంతారామన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ.. 'చెన్నైకి చెందిన 36 ఏళ్ల మహిళ ప్రైవేటు ఆసుపత్రిలో కృత్రిమ గర్భధారణతో గర్భం దాల్చారు. 156 కిలోల బరువు ఉన్న ఆమెకు అప్పటికే తీవ్ర శ్వాసకోశ సమస్యలు, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నాయి. గర్భధారణ తర్వాత మరికొన్ని అనారోగ్య సమస్యలూ వచ్చాయి. గర్భస్రావమయ్యే ప్రమాదం ఉందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు గర్భం దాల్చిన 8వ నెలకు (గతేడాది నవంబరు 6న) ఆమెను రాజీవ్‌గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. ఇక్కడ ఆమెను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి 2 వారాలపాటు వైద్యం అందించాం. అదే నెల 19న సిజేరియన్ ద్వారా ప్రసవం చేశాం. ఆమెకు పూర్తిగా మత్తు మందు ఇచ్చే పరిస్థితి లేకున్నా, సవాలుగా తీసుకొని నైపుణ్యంతో శస్త్రచికిత్స చేశాం. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జి చేశాం' అని వివరించారు. చికిత్సలో పాల్గొన్న వైద్య బృందాన్ని అభినందించారు.

డాక్టర్ సుధాకర్ కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి

ఈనాడు, అమరావతి: కొవిడ్ సమయంలో మాస్కులు అడిగినందుకు.. ఎస్సీ వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌పై అప్పటి వైకాపా ప్రభుత్వం కక్షగట్టింది. శారీరకంగా, మానసికంగా హింసించి ఆయన మరణానికి కారణమైంది. కూటమి ప్రభుత్వం ఆయన కుటుంబానికి న్యాయం చేసింది. సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధాకర్ కుమారుడు లలిత్‌ప్రసాద్‌కు ఉద్యోగ హోదా పెంచి గ్రూప్-2 సేవల కింద రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దారుగా నియమించింది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదముద్ర వేసింది. కొవిడ్‌తో ప్రపంచమంతా వణికిపోతున్న సమయంలో అప్పటి జగన్ ప్రభుత్వం.. వైద్య సిబ్బందికి మాస్కులు కూడా ఇవ్వట్లేదని నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో మత్తువైద్యుడు డాక్టర్ సుధాకర్ ప్రశ్నించారు. వైకాపా సర్కారు ఆయనపై కక్షబూని, ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసింది. అర్ధనగ్నంగా రోడ్డుపై కూర్చోబెట్టి.. చేతుల్ని కట్టేసి పోలీసులతో కొట్టించింది. మతిస్థిమితం లేదని ముద్ర వేసి, పిచ్చాసుపత్రికి తరలించింది. తీవ్ర మానసిక వేదనకు గురైన సుధాకర్ తర్వాత గుండెపోటుతో మరణించారు.



వణికించే చలిలో అటవీ ఉత్పత్తులతో లంబసింగి వార సంతకు వెళ్తున్న గిరిజనులు

పాడేరులో 4.1 డిగ్రీల ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. పాడేరులో గురువారం ఉదయం 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. పెదబయలులో 4.8, చింతపల్లి 5, హుకుంపేట 6.2, కొయ్యూరులో 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

11న కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ



ఆదిశేషగిరిరావు

విజయవాడ (గాంధీ నగర్), న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఈ నెల 11న విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆవిష్కరించనున్నట్లు ఆయన సోదరుడు, నిర్మాత ఆదిశేషగిరిరావు వెల్లడించారు. గురువారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలుగు సినిమా రంగంలో విజయవాడకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నగరంలో చాలా మంది ప్రముఖులతో కృష్ణకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. త్వరలోనే సినిమా అరంగేట్రం చేస్తున్న కృష్ణ మనవడు జయకృష్ణకు సూపర్‌స్టార్ ఆశీస్సులు ఉంటాయన్నారు. కృష్ణ జయంతి సందర్భంగా మే 31న సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. పెద్ద సినిమాల టికెట్ ధరలు పెంచడం వల్ల చిన్న సినిమాలకు థియేటర్లు దొరకక వాటి నిర్మాతలు నష్టపోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ఆడదామా.. ఏడు పెంకులాట?

10 నుంచి 'గ్రామీణ సంప్రదాయ క్రీడా సంబరాలు'

ఈనాడు, అమరావతి: తొక్కుడు బిళ్ల, ఏడు పెంకులాట, కర్రసాము, తాడాట (స్కిప్పింగ్), తాడులాగుడు (టగ్ ఆఫ్ వార్), కర్రాబిళ్ల... తరాలుగా తెలుగువారికి ఇవే జీవితకాలానికి సరిపోయే మధుర జ్ఞాపకాలు నింపాయి. ప్రస్తుత ఆధునిక కాలంలోనూ వీటిని ఈ ఆటల్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో 'గ్రామీణ సంప్రదాయ క్రీడా సంబరాలు' పేరుతో తొలిసారి పోటీలు నిర్వహించనున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఈ నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వీటి జరగనున్నాయి. విజేతలకు బహుమతులు, దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ★ మహిళలకు తాడాట, తొక్కుడు బిళ్ల, పురుషులకు ఏడు పెంకులాట, గాలిపటాలు ఎగురవేయడం, పురుషులు, మహిళలకు కర్రసాము, తాడులాగుడు పోటీలు నిర్వహిస్తారు. ★ అన్ని వయసుల వాళ్లూ పాల్గొనవచ్చు. ★ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. ★ వ్యక్తిగతంగా, బృందంగా పాల్గొనవచ్చు. ★ ఆసక్తిగలవారు ఆయా జిల్లాల డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లను సంప్రదించాలి. ★ 12న విజేతలకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తారు.

21 నుంచి జేఈఈ మెయిన్ పేపర్-1

పరీక్షా కేంద్రం ఏ నగరంలో కేటాయించారో తెలుసుకోవాలన్న ఎన్‌టీఏ

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల తేదీలపై పూర్తి స్పష్టత వచ్చింది. గత నవంబరులో నోటిఫికేషన్ సమయంలో జనవరి 21-30 మధ్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) తాజాగా పేపర్-1, పేపర్-2 తేదీలను ప్రకటించింది. తొలి ఐదు రోజులు అంటే.. ఈ నెల 21, 22, 23, 24, 28 తేదీల్లో బీటెక్ సీట్లలో ప్రవేశానికి పేపర్-1 పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు రెండు షిఫ్టుల చొప్పున పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 29న బీఈ, బీటెక్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. పరీక్షా కేంద్రం ఏ నగరంలో కేటాయించారో (జేఈఈ మెయిన్ సిటీ ఇన్‌ఫర్మేషన్ స్లిప్) గురువారం నుంచి తెలుసుకోవచ్చని, అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి మీకు కేటాయించిన నగరం తెలుసుకోవచ్చని పేర్కొంది.

ఉపాధి పథకం పేరు మార్పు తగదు

కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాకూర్



మాట్లాడుతున్న మాణికం ఠాకూర్

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాకూర్ పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి పథకం పేరు మార్పునకు వ్యతిరేకంగా గురువారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో పీసీసీ రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఈ పథకం పేరుతో పాటు నిబంధనలూ మార్చిందని.. దీంతో 13 కోట్ల మంది పని కోల్పోతారని వాపోయారు. ఈ చర్యను నిరసిస్తూ మహాత్మాగాంధీ నరేగా బచావో సంగ్రామం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 11 నుంచి దేశ వ్యాప్తంగా 700 జిల్లాల్లో 7 లక్షల మంది కాంగ్రెస్ శ్రేణులు నిరాహార దీక్ష చేయనున్నారని తెలిపారు. ఏఐసీసీ నాయకుడు కొప్పుల రాజు మాట్లాడుతూ భాజపా తెచ్చిన కొత్త చట్టంతో రాష్ట్రంలో 75 లక్షల మందికి పని హక్కు పోతుందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ పంచాయతీల్లో వర్గాల్లో సమావేశాలు నిర్వహించి, ధర్నాలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు జేడీ శీలం, మస్తాన్‌వలీ, పాలక్‌వర్మ, గిడుగు రుద్రరాజు, ప్రసాద్, చింతా మోహన్, నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



500% సుంకం

(మొదటి పేజీ తరువాయి)

కొంటున్న భారత్‌పై ట్రంప్ ఇప్పటికే 50 శాతం సుంకాలను విధించారు. ◆ అమెరికా కొత్త బిల్లు నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. దాదాపు రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

ఇద్దరు సెనేటర్ల ప్రణాళిక

రష్యాపై ఆంక్షల చట్టం-2025 పేరుతో బిల్లును గ్రాహం, బ్లూమెంథాల్ ప్రవేశపెట్టారు. ఉక్రెయిన్‌పై పుతిన్ చేస్తున్న యుద్ధానికి సహకరించే దేశాలపై అదనపు సుంకాలు, ఆంక్షలు విధించేందుకు దీనిని తీసుకొచ్చారు. దీని ప్రకారం.. ద్వితీయ పక్ష కొనుగోళ్లు, పునః విక్రయంపై 500 శాతం సుంకాలు అమలవుతాయి. 'భారత్, చైనా, బ్రెజిల్‌లపై సుంకాలను విధించడం ద్వారా యుద్ధాన్ని అడ్డుకోవడం సాధ్యమవుతుంది' అని గ్రాహం, బ్లూమెంథాల్ విడుదల చేసిన సంయుక్త ప్రకటన పేర్కొంది. పుతిన్ కస్టమర్లపై ఒత్తిడి తెస్తేనే యుద్ధం ఆగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

గతంలో తక్కువే..

ప్రపంచంలో మూడో అతి పెద్ద చమురు దిగుమతిదారుగా భారత్ ఉంది. దేశీయ అవసరాలకు అవసరమైన ముడి చమురులో 88 శాతం విదేశాల నుంచే మన దేశానికి వస్తోంది. అయినా రష్యా నుంచి గతంలో అతి తక్కువ చమురునే భారత్ కొనుగోలు చేసేది. 2021 వరకూ చమురు దిగుమతుల్లో రష్యా వాటా 0.2 శాతమే. 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగాక రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న రష్యా చౌకగా చమురు అమ్మజూపడంతో భారత్ దిగుమతులను పెంచింది. రష్యా చమురుకు అతి పెద్ద దిగుమతిదారుగా అవతరించింది. దీంతో ఒక శాతం కంటే తక్కువగా ఉన్న దిగుమతులు ఏకంగా 40 శాతానికి చేరుకున్నాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ దిగుమతులను భారత్ తగ్గించుకుంటూ వస్తోంది. నవంబరు మొత్తం దిగుమతుల్లో మూడో వంతు చమురు రష్యా నుంచి రాగా అది డిసెంబరు నాటికి నాలుగో వంతు కంటే దిగువకు పడిపోయింది. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ అంచనా ప్రకారం.. నవంబరులో భారత్ రోజుకు 1.84 మిలియన్ బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంది. అదే డిసెంబరులో అది 1.2 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది.

అమెరికాతో సంబంధాల్లో ప్రతి రోజూ సవాలే: కాంగ్రెస్

దిల్లీ: భారత్, అమెరికా సంబంధాలు కల్లోలభరితంగా సాగుతున్నాయని, ప్రతి రోజూ ఓ కొత్త సవాలు ఎదురవుతోందని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. భారత ప్రధాని బుజ్జగింపుల పోస్టులను అమెరికా పట్టించుకోకపోవడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనే దేశాలపై 500 శాతం సుంకాలను విధించే బిల్లును అమెరికా తేనుండటంపై ఆయన స్పందించారు.

ఈడీ X దీదీ

• కోల్‌కతాలో ఐ-ప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలపై భగ్గుమన్న బెంగాల్ సీఎం



కోల్‌కతాలోని తన నివాసం నుంచి కారులో వెళ్తున్న ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్‌ను వెంబడిస్తున్న మీడియా సిబ్బంది

కోల్‌కతా, దిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ముఖాముఖీ తలపడ్డారు. బెంగాల్‌లో వెలుగులోకి వచ్చిన బొగ్గు కుంభకోణానికి సంబంధించి.. రాజకీయ సంప్రదింపుల సంస్థ 'భారతీయ రాజకీయ కార్యాచరణ కమిటీ (ఐ-ప్యాక్)' కార్యాలయంలో, దాని సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ నివాసంలో ఈడీ అధికారులు గురువారం పెద్దఎత్తున సోదాలు నిర్వహించారు. కోల్‌కతాలో జరిగిన ఈ పరిణామంపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. పార్టీ ఐటీ విభాగాధిపతిగా ఉన్న జైన్‌ను కేంద్ర సర్కారు కావాలనే లక్ష్యంగా చేసుకుందని మమతాబెనర్జీ విరుచుకుపడ్డారు. సోదాల సమాచారం తెలియగానే ఆమె జైన్ నివాసానికి వెళ్లి ఈడీ వర్గాల ఎదుట నిరసన తెలిపారు. ఐ-ప్యాక్ కార్యాలయంలో తమ పార్టీకి, రాబోయే ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులకు సంబంధించిన కీలకమైన సమాచారమంతా ఉందని, దానిని ఎత్తుకుపోయేందుకే ఈడీ వచ్చిందని తీవ్ర ఆరోపణలు చేశారు. కొన్నిగంటలసేపు అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలో ఆవిర్భవించిన ఐ-ప్యాక్.. బెంగాల్‌లో తృణమూల్ పార్టీ ఐటీ, ప్రచార బాధ్యతల్ని చూస్తోంది.

కేసు నేపథ్యం ఇదీ

బెంగాల్‌లోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ మైన్స్‌లో వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దొంగతనానికి గురైనట్లు 2020లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. నగదు అక్రమ చలామణి జరిగినట్లు తేలడంతో తర్వాత ఈడీ రంగంలోకి దిగింది. స్థానిక వ్యాపారి అనూప్ మాఝీ (లాలా) దీనిలో ప్రధాన నిందితుడు. ఇదే కేసులో తృణమూల్ ఎంపీ, మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీని గతంలోనే ఈడీ ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న ఐ-ప్యాక్ కార్యాలయంలో, దిల్లీలోని నాలుగు చోట్ల గురువారం ఉదయం ఏడు గంటల నుంచే ఏకకాలంలో ఈడీ సోదాలు ప్రారంభమయ్యాయి. కొన్ని హవాలా లావాదేవీలు, నగదు వ్యవహారాలు ప్రతీక్ జైన్ ద్వారా జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయని ఈడీ చెబుతోంది. బొగ్గు స్మగ్లింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్న ఒక హవాలా ఆపరేటర్ ద్వారా ఐ-ప్యాక్‌కు చెందిన 'ఇండియన్ పీఏసీ కన్సల్టింగ్ ప్రై.లి.'కు రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయని ఈడీ వర్గాలు వెల్లడించాయి.



ఐ-ప్యాక్ కార్యాలయం నుంచి కొన్ని దస్త్రాలు తీసుకుని బయటకు వస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

ఆఘమేఘాలపై వచ్చి మండిపడ్డ మమత

సోదాల గురించి తెలిసిన వెంటనే జైన్ నివాసానికి మమత హుటాహుటిన చేరుకున్నారు. అప్పటికే అక్కడ డీజీపీ సహా పోలీసు ఉన్నతాధికారులంతా ఉన్నారు. పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. భవనంలోకి ఎవరూ రాకపోకలు చేయకుండా కేంద్ర బలగాలు ఆ ప్రాంగణాన్ని సీజ్ చేశాయి. బలగాలతో ఘర్షణ పడకుండా సాధారణ సందర్శకులు వెళ్లే లిఫ్టులో సీఎం నేరుగా 11వ అంతస్తులోని ఐ-ప్యాక్ కార్యాలయానికి చేరుకున్నారు. రాజకీయ ఉద్దేశాలతో సోదాలు చేస్తున్నారని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. "మా పార్టీ పత్రాలను, హార్డ్‌డిస్కులను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దానిలో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల సమాచారం సయితం ఉంది. అందుకే వాటిని నేను వెనక్కి తెచ్చేశాను" అని ఆమె విలేకరులకు చెప్పారు. హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లు, అభ్యర్థుల జాబితాలు, అంతర్గత వ్యూహ పత్రాలను కూడా తీసుకుపోయేందుకు ఈడీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ సమాచారాన్ని కాపీ చేసుకున్నారని, ఇది నేరమని చెప్పారు. సమాచారాన్ని తాము పోగొట్టుకుంటే మళ్లీ సేకరించుకునేలోగా ఎన్నికలు అయిపోతాయన్నారు. "ఒక రాజకీయ పార్టీ సమాచారాన్ని సేకరించడం ఈడీ విధుల్లో భాగమా? నిజానికి అతి పెద్ద దొంగల పార్టీ భాజపా. దర్యాప్తు సంస్థలు భాజపా నేతలకు ఎందుకని నోటీసులు ఇవ్వవు? ఈడీ సోదాలకు ప్రతీకారంగా భాజపా కార్యాలయాలపై మేం దాడిచేస్తే ఏమవుతుంది? మా సంయమనాన్ని చేతకానితనంగా భావించొద్దు" అని తీవ్రస్వరంతో హెచ్చరించారు. శుక్రవారం తన నాయకత్వంలో కోల్‌కతాలో 5 కి.మీ. మేర పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరుగుతుందని ప్రకటించారు. తనను అడ్డగిస్తే తగిన రీతిలో స్పందిస్తానన్నారు.

సీఎం ఉండగా దస్త్రాల తరలింపు

రాజకీయ వైరంతోనే సోదాలు చేస్తున్నారని, విపక్షాలను బెదిరించడానికి రాజ్యాంగ సంస్థల్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దుర్వినియోగపరుస్తున్నారని మమత ఆరోపించారు. దేశాన్ని రక్షించడం చేతకాకపోయినా ఎన్నికల ముందు విపక్షాల్ని వేధించడానికి దర్యాప్తు సంస్థల్ని ఆయన పంపుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యాలయానికి జైన్ వచ్చాక సాయంత్రం 4.14 గంటలకు ఆమె అక్కడి నుంచి వెళ్లారు. ఓ ఆకుపచ్చని ఫోల్డర్‌ను చేతిలో పట్టుకుని బయటకు వచ్చారు. ఆమె ఆ కార్యాలయంలో ఉండగానే పలు దస్త్రాలను అక్కడి నుంచి తెచ్చి సీఎం వాహనంలో ఉంచినట్లు తెలుస్తోంది. కుంభకోణంలో ఆధారాల ప్రకారమే తాము వెళ్లామని, రాజకీయాలతో సంబంధం లేదని ఈడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని కంప్యూటర్లను, పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపాయి. సోదాల సమయంలో కొన్ని ముఖ్యమైన పత్రాలు తమ నివాసంలో చోరీ అయ్యాయని ప్రతీక్‌జైన్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. చట్టపరమైన దర్యాప్తును మమత అడ్డుకున్నారని, ఆమెతో కలిసి రాష్ట్ర పోలీసులు కీలక ఆధారాలను బలవంతంగా తీసుకుపోయారని దిల్లీలోని ఈడీ కార్యాలయం ఆరోపించింది. తమ దర్యాప్తునకు అడ్డంకులు కల్పిస్తున్న వారిపై పిటిషన్ వేసేందుకు కలకత్తా హైకోర్టు అనుమతిని సంస్థ కోరింది. ఆటంకం కలగకుండా విచారణ సాగేలా ఆదేశాలివ్వాలంది. సోదాలను ప్రశ్నిస్తూ ఐ-ప్యాక్ కూడా హైకోర్టును ఆశ్రయించింది. వాటి చట్టబద్ధతను ప్రశ్నించింది.

మమతపై చర్యలు తీసుకోవాలి: సువేందు

ఈడీ సోదాలు జరుగుతుండగా ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం వెళ్లడంపై పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సువేందు అధికారి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇది దర్యాప్తులో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. దీనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఒక కార్పొరేట్ సంస్థలో సోదాలు జరిగితే మమతకు ఉలికిపాటు ఎందుకని కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్‌రంజన్ చౌధరీ ప్రశ్నించారు. తృణమూల్ అగ్రనేతల కోసం భారీగా డబ్బుల వసూలులో ఆ కంపెనీకి పాత్ర ఉందని ఆరోపించారు. ఈడీ దర్యాప్తు చివరకు తన ఇంటి తలుపు తడుతుందని తెలిసి మమత అడ్డంకులు సృష్టిస్తున్నారని భాజపా ఆరోపించింది. ఆమె తీరు సీఎం పదవికి తగినట్లు లేదని భాజపా జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా దిల్లీలో చెప్పారు.

రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట ప్రభల తీర్థం

• మంత్రి దుర్గేష్, సృజనాత్మక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని వెల్లడి



ఈనాడు, అమరావతి: 'కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా నిర్ణయించారు. ఈ మేరకు మంత్రిమండలి గురువారం నిర్ణయం తీసుకుంది. ఇది మన సంస్కృతికి దక్కిన గౌరవం' అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సృజనాత్మక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని పేర్కొన్నారు. సచివాలయంలో గురువారం వారిద్దరూ మాట్లాడారు. 'జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాచీన సంప్రదాయం. 476 ఏళ్లుగా ఈ తీర్థాన్ని ఏటా సంక్రాంతి పండుగలో కనుమ రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలు చూసేందుకు ఐదారు లక్షల మంది హాజరవుతారని అంచనా. ఏకాదశ రుద్రులు 11 గ్రామాల నుంచి బయలుదేరి జగ్గన్నతోటలో ఆ రోజు కొలువుదీరతారని, వారు అక్కడ ప్రజాక్షేమం కోసం చర్చించుకుంటారనేది కోనసీమ వాసుల నమ్మకం. ఈ 11 గ్రామాలతో పాటు ఇతర పల్లెలు, ప్రాంతాల నుంచి అనేక ప్రభలు జగ్గన్నతోటకు చేరుకుంటాయి. ఇప్పటికీ పాత సంప్రదాయం ప్రకారమే అధిక బరువుండే ప్రభలను మోసుకుంటూ.. పొలాలు, తోటలు, కౌశిక నదిని దాటుకుంటూ అక్కడికి చేరుస్తారు. ఈ తీర్థం నిర్వహణను గతంలో ప్రధాని మోదీ ప్రస్తుతించారు. రిపబ్లిక్ పరేడ్‌లో కూడా ఈ తీర్థం విశిష్టతను ప్రదర్శించారు. ఇప్పుడు రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లూ చేయనుంది. ప్రజలంతా ఈ తీర్థాన్ని సందర్శించాలి' అని తేజస్విని కోరారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కోనసీమ యావత్తూ ప్రభల తీర్థాన్ని పెద్ద పండుగగా చేస్తారని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వాటిని గుర్తించి, ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పారు. కోనసీమలోని పర్యాటక ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

అతివేగానికి నాలుగు ప్రాణాలు బలి!

• హైదరాబాద్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం
• చెట్టును ఢీకొన్న కారు.. నలుగురు విద్యార్థుల దుర్మరణం

హైదరాబాద్, న్యూస్‌టుడే: అతి వేగం నలుగురు విద్యార్థులను బలి తీసుకుంది. రాత్రివేళ.. గంటకు వంద కిలోమీటర్లకుపైగా వేగంతో వెళ్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. అంతకుముందే స్నేహితుడి జన్మదిన వేడుకలో సరదాగా గడిపినవారు అంతలోనే విగతజీవులయ్యారు. మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేటలోని ఓ ప్రైవేటు వసతిగృహంలో ఉంటున్న శ్రీనిఖిల్ (20), సంగారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన కర్నాటి సుమిత్ (20), ఏపీలోని విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన ఓ విద్యార్థిని.. ముగ్గురూ హైదరాబాద్ నగర శివారులోని ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్‌లో బీబీఏ చదువుతున్నారు. వారికి మరో విద్యార్థి, మంచిర్యాలకు చెందిన దేవాల సూర్యతేజ(20)తో మంచి స్నేహం ఉంది. వీరికి కోకాపేటకు చెందిన ఎంజీఐటీ ఇంజినీరింగ్ విద్యార్థి బల్మూరి రోహిత్ (18), మోకిలకు చెందిన సాయిఆకాశ్ పరిచయమయ్యారు. బుధవారం సుమిత్ పుట్టినరోజు కావడంతో ఆరుగురూ నార్సింగిలోని ఓ హోటల్‌లో విందు చేసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయిఆకాశ్‌ను ఇంటి వద్ద దింపేందుకు ఆ విద్యార్థులు కారులో బయలుదేరారు. అతడిని దింపాక తిరిగొచ్చే సమయంలో సుమిత్ కారు నడిపాడు. వేగంగా నడపడంతో మీర్జాగూడ గేటు వద్దకొచ్చాక.. రోడ్డుపై వేగ నియంత్రణ కోసం ఏర్పాటుచేసిన బారికేడ్‌ను గమనించిన సుమిత్ దాన్ని తప్పించేందుకు కుడివైపునకు తిప్పాడు. అప్పటికే వాహనం అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అవతలి వైపు చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

ఘటనలో శ్రీనిఖిల్, సుమిత్, సూర్యతేజ, రోహిత్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విశాఖపట్నానికి చెందిన విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి పోలీసులు, అంబులెన్సుకు సమాచారమిచ్చారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను తీవ్రంగా శ్రమించి బయటకు తీశారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏకాంబరనాథర్ ఆలయ ఉత్సవ విగ్రహాల్లో బంగారం లేదు

• ఐఐటీఎం నివేదిక



ఉత్సవమూర్తులు

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని కాంచీపురంలో ప్రసిద్ధి చెందిన ఏకాంబరనాథర్ ఆలయ ఉత్సవ విగ్రహాల్లో బంగారం లేదని ఐఐటీ మద్రాస్ నిపుణులు తేల్చారు. 2015లో ఏళవార్ కుళలి సమేత ఏకాంబరనాథర్ మూర్తులను తయారు చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఆ మేరకు కొంత బంగారం, ఇతర లోహాలతో 55 కిలోల బరువున్న రెండు విగ్రహాలను సిద్ధం చేయించింది. కానీ, ఆ విగ్రహాల్లో బంగారం లేదని కాంచీపురానికి చెందిన అన్నామలై అదే ఏడాది శివకంచి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అప్పటి ఆలయ ఈఓ మురుగేశన్‌తో పాటు మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగానే విగ్రహాలను ఐఐటీఎం నిపుణులతో పరిశీలన చేయించారు. ఈ నివేదికను, కేసు పురోగతి ప్రతులను గత డిసెంబరు 30న అన్నామలైకి అందించారు. వాటిలో 'ఉత్సవమూర్తుల తయారీలో ఉపయోగించేందుకు 312.5 సవర్ల బంగారం సేకరించారు. ఇందులో భక్తుల నుంచి సేకరించిన బంగారం 8.7 కిలోలు ఉంది. కానీ, తయారు చేసిన విగ్రహాల్లో బంగారం లేదు. బంగారం విరాళంగా ఇచ్చిన భక్తులకు రసీదులు ఇవ్వలేదు. విగ్రహాల తయారీని వీడియో రికార్డింగ్ చేయలేదు. ప్రస్తుతం ఈ కేసును కాంచీపురం నేర పరిశోధన విభాగం దర్యాప్తు చేస్తోంది. ఫిబ్రవరి 2న కాంచీపురం కోర్టులో విచారణకు రానుంది' అని అందులో పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.4,451 కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల రుణాన్ని తీసుకునేందుకు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిడ్కో)కు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు హామీ ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆధ్యాత్మిక విధ్వంసానికి జగన్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

కుయుక్తుల్ని తిప్పికొట్టాలి' అని పేర్కొన్నారు.

సముద్రంలోకి పోయే నీళ్లను తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే మేలు

సముద్రంలోకి వృథాగా పోయే నదీ జలాల్ని రెండు తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే మేలని చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. నీటి లభ్యత పెరిగితే స్థానిక వాతావరణ పరిస్థితులు, నేలల స్వభావాన్ని బట్టి లాభసాటిగా ఉండే కొత్త పంటల్ని సాగు చేసేలా రైతుల్ని ప్రోత్సహించవచ్చని చెప్పారు.

2029కి యూనిట్ విద్యుత్‌పై రూ.1.19 తగ్గిస్తాం

గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు 13 పైసలు తగ్గించామని, మార్చి నాటికి మొత్తం 39 పైసలు తగ్గించాలన్నది లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. 2029 నాటికి యూనిట్‌పై రూ.1.19 తగ్గిస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించడంతో పాటు వైకాపా ప్రభుత్వ హయాం నాటి రూ.4,498 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తోందని సీఎం పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలంటే ఉత్పత్తి బాగా పెరగాలని, పంపిణీ నష్టాలు తగ్గాలని, కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్లు వంటి మౌలిక వసతులు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టును వచ్చే ఏడాది వేసవి నాటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధిపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా ప్రతి నెలా రాష్ట్ర జీఎస్‌డీపీని లెక్కిస్తున్నామని తెలిపారు. సీఎం చెప్పిన ఇతర అంశాలివీ..

మంత్రులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

◆ మంత్రులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి. ఆర్థిక అంశాలపైనా లోతైన అవగాహనతో మాట్లాడాలి.

◆ ప్రపంచంలో జలరవాణా అత్యంత చౌక. రాష్ట్రంలో సముద్రతీరం ఉన్న ప్రతి జిల్లాలోనూ పోర్టులు అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉపరితల జలరవాణా ప్రాజెక్టును ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడతాం.

◆ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్న పీపీపీ విధానాన్ని అందిపుచ్చుకోవడంలో ఏపీ మొదటి స్థానంలో ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ విధానంలో 270 ప్రాజెక్టులు చేపట్టాం. 2026-27లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా ప్రాజెక్టుల్ని దీనికింద చేపడతాం.

పర్యాటక హబ్‌గా సూర్యలంక

◆ బాపట్ల జిల్లాలోని సూర్యలంకను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. అక్కడ ఇప్పటికే 1,100 హోటల్ గదులున్నాయి. కొత్తగా ఒక త్రీస్టార్, రెండు ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాం. రెండేళ్లలో అవి అందుబాటులోకి వస్తాయి. సూర్యలంక హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో అక్కడి నుంచి ఎక్కువగా పర్యాటకులు వస్తారు.

◆ వైకాపా హయాంలో వచ్చిన చెడ్డపేరును తొలగించి, పెట్టుబడులకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రదేశమన్న బ్రాండ్ ఇమేజ్‌ను చాలా త్వరగా తీసుకురాగలిగాం. దాన్ని మరింతగా పెంచుకోవాలి. ఇప్పటి వరకు ఒప్పందాలు జరిగిన ప్రాజెక్టులన్నీ ఆచరణలోకి వచ్చేలా అధికారులతో మంత్రులు సమన్వయం చేసుకోవాలి.

◆ ఫెర్రోఅల్లాయ్స్ పరిశ్రమలు ఏడాదిలోగా సొంత విద్యుత్ ప్లాంట్‌లు, బ్యాటరీ స్టోరేజీ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తాం. ఈలోగా వారికి విద్యుత్ రాయితీలు ఇస్తాం.

◆ ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం. కోకో, మామిడి, ఉల్లి, బ్లాక్‌బర్లీ పొగాకు వంటి వంటలు సాగు చేసిన రైతుల్నీ ప్రభుత్వం ఆదుకుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు స్మార్ట్ కార్డులు



డిజిటల్ ఐడీ కార్డు అందిస్తున్న డీసీటీఎం సాయి చరణ్‌తేజ, పక్కన ఆర్టీసీ అధికారులు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులకు స్మార్ట్ డిజిటల్ ఐడీ కార్డులను గురువారం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ టి.సాయిచరణ్ తేజ అందించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులందరికీ వీటిని ఇవ్వనున్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ముందుగా ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు డిజిటల్ పీవీసీ కార్డులను అందించారు. ప్రస్తుతం ఇచ్చిన స్మార్ట్ కార్డులు ఐదేళ్ల వరకు ఉపయోగపడేలా తయారు చేయించారు.

ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మె నోటీసు సంఘాల నేతలతో మంత్రి భేటీ

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకం కింద నడుపుతున్న ఐదు రకాల బస్సులకు నిర్వహణ భారం పెరిగిందని, దానికి తగినట్లు అదనపు మొత్తం చెల్లించాలన్న డిమాండుతో ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘాలు సమ్మెకు సిద్ధం కాగా, వారితో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ నెల 12 నుంచి సమ్మెకు వెళ్తామని ప్రకటించిన సంఘాల నేతలతో మంత్రి గురువారం సచివాలయంలో చర్చించారు. ఐదు రకాల బస్సుల్లో రద్దీ అధికమైందని, నిర్వహణ ఖర్చులు పెరిగాయని సంఘ నేతలు పేర్కొన్నారు. బస్సులకు బీమా కవరేజ్‌లోనూ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అద్దె బస్సుల యజమానుల సంఘం ఆర్టీసీ ఎండీ పేషీలో గురువారం సమ్మె నోటీసు అందజేసింది. మరోవైపు శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు సంఘాలతో చర్చించనున్నారు. ఐదు రకాల అద్దె బస్సులకు నెలకు రూ.5,200 చొప్పున అదనంగా ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోగా, దీన్ని మరింత పెంచాలంటూ సంఘాలు కోరుతున్నాయి. ఎండీ వద్ద జరిగే సమావేశంలో దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సతీష్‌కుమార్ అసహజ మరణం కేసును మేమే పర్యవేక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు రవికుమార్ తదితరులతో తితిదే అప్పటి అధికారుల, పోలీసులు కుమ్మక్కయ్యారని పునరుద్ఘాటించింది. నిందితుడు రవికుమార్ తితిదేకి ఇచ్చిన ఆస్తులను స్వీకరించే విషయంలోనూ తితిదే అధికారులు, బోర్డు సభ్యులు నిబంధనలను పాటించలేదని ఆక్షేపించింది. సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించి ఈ అంశాల విషయంలో 'చట్ట నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలి' అని సీఐడీ, ఏసీబీ డీజీలను ఆదేశించింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు, తితిదేకి స్పష్టంచేసింది. దర్యాప్తు తీరుపై సంతృప్తి వ్యక్తంచేసింది. సంబంధిత అధికారులను అభినందించింది.

● మరోవైపు పరకామణిలో కానుకలు లెక్కించేందుకు స్వచ్ఛందంగా వచ్చే భక్తులను అమానవీయ రీతిలో తనిఖీ చేయడాన్ని నిలిపివేయాలని కోర్టు చేసిన సూచనకు తితిదే ఈవో సానుకూలంగా స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది. కానుకల లెక్కింపునకు టేబుళ్లు ఏర్పాటు చేయాలన్న కోర్టు సూచనను పాటించడం సాధ్యం కాదని ఈవో నివేదికలో పేర్కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. లెక్కింపు ప్రక్రియలో మర్యాదపూర్వక విధానాన్ని అనుసరించే ఆలోచనలతో ముందుకురావాలని ఈవోకు సూచించింది. అందుకు మరికొంత సమయం ఇస్తూ విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

● గురువారం జరిగిన విచారణలో ఈవో తరఫు న్యాయవాది శ్రీనివాసబాబా వాదనలు వినిపిస్తూ.. 'టేబుళ్లను ఏర్పాటు చేసి కానుకలను లెక్కించాలని న్యాయస్థానం చేసిన సూచనను అనుసరించడం సాధ్యం కాదు. ఆర టన్ను బరువున్న హుండీని టేబుల్‌పై బోర్లించడం సురక్షితం కాదు. రోజూ పరకామణిలో 300 మంది భక్తులు కానుకలను లెక్కిస్తారు. వారందరికీ టేబుళ్లు ఏర్పాటుచేయడం సాధ్యం కాదు. తితిదేలో ప్రస్తుత విధానాల్లో మార్పులు తేవాలంటే ఆగమశాస్త్ర పండితులు, తితిదే బోర్డు సభ్యుల ఆమోదం తప్పనిసరి. ఈవో ఒక్కరే నిర్ణయించలేరు. బోర్డులో ఎలాంటి సభ్యులున్నారో మీకు (కోర్టుకు) తెలిసిందే. కోర్టు చేసిన సూచనలను శాశ్వత ప్రణాళిక(ప్లాన్-బి)లో అమలు చేసేందుకు ఈవో చర్యలు తీసుకుంటారు' అన్నారు. ఈ వాదనలపై న్యాయమూర్తి తీవ్రంగా స్పందించారు. కోర్టు సూచనలను పట్టించుకోకుండా సంప్రదాయాలను సాకుగా చూపుతారా? అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కానుకలను కింద పోసి, తొక్కుతూ నడవడం సంప్రదాయమా? అని మండిపడ్డారు. లెక్కింపులో అనుసరిస్తున్న ప్రస్తుత విధానం సరైంది కాదన్నారు.

ఈ వ్యవహారంలో ఏదో ఉంది

• రవికుమార్ విషయంలో మధ్యంతర ఉత్తర్వులివ్వలేం
• స్పష్టం చేసిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం

సీఐడీ విచారణతో పాటు తన ఆస్తుల విషయంలో దర్యాప్తు జరపాలని ఏసీబీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్ దాఖలుచేసిన అప్పీల్‌పై గురువారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో ఏదో ఉందని పేర్కొంది. రూ.15 కోట్ల ఆస్తులు తితిదేకి సరెండర్ చేసి మొత్తం వ్యవహారాన్ని చక్కదిద్దుకునేందుకు జరిగిన ప్రయత్నం కేసు కదా అని గుర్తుచేసింది. ప్రస్తుతం రవికుమార్ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. రవికుమార్ అప్పీల్‌తో పాటు చోరీ కేసును రాజీ చేస్తూ లోక్ అదాలత్ జారీచేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే విషయంపై నమోదుచేసిన సుమోటో వ్యాజ్యంపై ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. గురువారం జరిగిన విచారణలో రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు జరపాలని, కేసు నమోదు చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారన్నారు. రవికుమార్‌పై తొందరపాటు చర్యలు తీసుకోకుండా నిలువరించాలని కోరారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇవ్వాలన్నారు. ఇది చిన్న చోరీ కేసని తెలిపారు.

ఉద్యోగంలో రాణించాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు



ప్రతిభ మీకు ఉద్యోగాన్ని తెచ్చిపెట్టొచ్చు, కానీ అందులో మీరు బాగా రాణించాలంటే మాత్రం మరికొన్ని అంశాలపై పట్టు సాధించాలి. అవేంటంటే.. ✦ మీ ఆలోచనలను స్పష్టంగా వివరించడం.
✦ భావోద్వేగాలపై అదుపు సాధించడం.
✦ తీవ్ర ఒత్తిడిలోనూ ప్రశాంత చిత్తంతో పనిచేయడం.
✦ మార్పులకు అనుగుణంగా వేగంగా మారడం. ✦ పరిస్థితులను విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకొనే నేర్పు.

– టొలులోప్ మైఖేల్, టెక్ ఆంత్రప్రెన్యూర్

వసుంధర

vasundhara@eenadu.in

సారా... నంబర్ 1 తార!

'సారా అర్జున్'... కొన్ని నెలల క్రితం వరకూ ఈమెవరు అని వెతికినవారే అంతా! తరవాత తనెవరో గుర్తించి ఆశ్చర్యపోయారంతా. కానీ ఇప్పుడు దేశమంతా ఆమె పేరు మారు మోగుతోంది. తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ కొట్టేసింది. రూ.వందల కోట్ల సినిమాలో భాగమైంది. అంతేనా... తాజాగా స్టార్లనూ వెనక్కి నెట్టి నం.1 స్థానంలో నిలిచింది.


సారా

'హీరోయిన్ పాత్ర నాకు నచ్చింది. నేను చేయనా?' అని అడిగారట యామీ గౌతమ్ భర్త, దురంధర్ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్‌ని. కానీ 'ఒక ఫ్రెష్ ఫేస్ కావాలి. అలాగే ఆ పాత్ర భావోద్వేగాలని లోతుగా అర్థం చేసుకునే అమ్మాయి కావాలి' అని చెప్పి భార్యని రిజెక్ట్ చేశారట ఆదిత్య. ఇక అప్పట్నుంచీ వెతుకులాట మొదలైంది. ఏకంగా 1300 మందికి ఆడిషన్లు నిర్వహించారట. అక్కడ తనే ఈ పాత్రకి పర్‌ఫెక్ట్ అనిపించుకుంది... సారా అర్జున్. '20 ఏళ్లే. కానీ మెచ్యూరిటీలో మాత్రం వయసుకి మించి! భావోద్వేగాలు పలికించడంలో దిట్ట' అంటూ చిత్రబృందం ప్రశంసలు అందుకుంది. అలా 'దురంధర్'లో హీరోయిన్‌గా తొలిసినిమా అవకాశాన్ని అందుకుంది సారా.


మాల్‌లో ఆకట్టుకుంది!

పుట్టిపెరిగిందంతా ముంబయి. సారాది సినిమా నేపథ్యమున్న కుటుంబమే. నాన్న రాజ్ అర్జున్ నటుడు. అమ్మ సన్యా డ్యాన్స్ ఇన్‌స్ట్రక్టర్. అయినా సారాకి అవకాశం వచ్చింది మాత్రం అనుకోకుండానే. కుటుంబంతో మాల్‌కి వెళ్లినప్పుడు అమ్మ చేతిలోని 18 నెలల సారాని చూసి ఓ యాడ్ సంస్థ ప్రతినిధులు ముగ్ధులయ్యారు. తమ ప్రకటనలో నటింపజేయమని అడిగారు. అలా తొలిసారి కెమెరా ముందుకు వచ్చింది సారా. అయిదేళ్లు వచ్చేసరికి 100 వాణిజ్య ప్రకటనల్లో మెరిసిందట. తరవాత సినిమా అవకాశాలూ వచ్చాయి. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ చిత్రాల్లో బాలనటిగా నటించి... అవార్డులూ అందుకుంది. అయితే ఎక్కడా చదువుని నిర్లక్ష్యం చేయలేదామె. సెలవుల్లోనే షూటింగ్‌ని ప్లాన్ చేసుకునేది. దేశంలోనే ఎక్కువ మొత్తం సంపాదన ఉన్న బాలనటిగానూ పేరు తెచ్చుకుంది. పొన్నియిన్ సెల్వన్ చేసేటప్పుడు విపరీతమైన వేడి... అలాంటి వాతావరణంలోనూ గుర్రపుస్వారీ నేర్చుకుంది. కరెంటు లేకపోతే లాంతరు వెలుగులోనే స్క్రిప్ట్ చదివేదట. ఫిర్యాదుల్లేకుండా తన పని చేసుకుంటుంది అని పేరు తెచ్చుకుంది. 'నటన అంటేనే ఎక్కువ ఆసక్తి. నిజానికి దాన్ని ఎంజాయ్ చేస్తా. అలాగని నేర్చుకోవడాన్నీ పక్కన పెట్టను అందుకే, చదువుకీ సమాన ప్రాధాన్యమిస్తా'నంటోన్న సారాని 'పొన్నియిన్ సెల్వన్' తరవాతా చిన్నమ్మాయిగానే చూశారు. తీరా హీరోయిన్ అనే సరికే ఆశ్చర్యపోయారంతా.

ట్రోల్స్ దాటి...

సినిమా ప్రకటించగానే 'ఇంత చిన్నమ్మాయిని రణ్‌వీర్ పక్కన నటింపజేస్తున్నా'రంటూ ట్రోల్స్ మొదలయ్యాయి. అసలే బాలనటిగా దేశం మనసు గెలుచుకున్న అమ్మాయి... దీంతో వ్యతిరేకత చాలా వచ్చింది. కానీ సినిమా విడుదలయ్యాక ప్రశంసలు అందుకుంది సారా... ఎప్పట్లాగే! 'నటన ఎక్కడా నేర్చుకోలేదు. అమ్మానాన్నలు మధ్యతరగతి అమ్మాయిగానే పెంచారు. అదీకాక నాకు కొత్త ప్రదేశాలను చూడటం అంటే ఇష్టం. ఎవరిని కలిసినా బిడియం అన్నదే లేకుండా ప్రశ్నలు అడుగుతుంటా. అవే నాకు నటనా పాఠాలు. అలాగని ఇంతటితో సంతృప్తి పడాలనీ లేదు. నటనా కోర్సులు చేయాలి, ఇంకా నేర్చుకోవాలి' అంటోంది సారా. ఇప్పుడామెకు అభిమాన గణమూ పెరిగింది. ఫ్యాన్ పేజీలు వచ్చాయి. 50 వేలమంది కూడా లేని తన ఇన్‌స్టా ఖాతాకి 15 లక్షల ఫాలోవర్లు వచ్చారు. నెపోటిజం లేకుండా ప్రతిభతోనే నిరూపించుకుంటూ వచ్చిందీమె. 'హిడెన్ టాలెంట్' అని ప్రముఖుల కితాబులు అందుకుంది. కాబట్టే ఈమెకు ఆదరణ పెరుగుతోంది. తాజాగా ఈ వారంలో ఎక్కువ ప్రజాదరణ పొందిన భారత సెలెబ్రిటీల జాబితాని ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ (ఐఎండీబీ) విడుదల చేసింది. దానిలో ప్రభాస్, విజయ్ వంటి అగ్రతారలనూ వెనక్కి నెట్టి, తొలి స్థానాన్ని దక్కించుకుంది సారా. తెలుగుతోపాటు మరెన్నో భాషల్లో అవకాశాలూ అందుకుంటున్న తనకి ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా?

బిబ్లియోథెరపీ తెలుసా..!



ఇటీవల యంగ్‌లైవ్స్ ఇండియా చేసిన అధ్యయనంలో... ఒత్తిడికి గురవుతున్న వారిలో మహిళలూ, అమ్మాయిల సంఖ్యే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ సమస్యతో సతమతం అవుతూ నిద్ర పట్టని వారూ ఎక్కువేనట. దీన్నుంచి బయటపడాలని ప్రయాణాలు, తోటల పెంపకం, చిత్రలేఖనం... వంటి హాబీలను అలవరచుకుంటున్నారు కదా! వీటితోపాటూ 'బిబ్లియోథెరపీ'ని ప్రయత్నించమంటున్నారు నిపుణులు. పుస్తక పఠనాన్నే బిబ్లియోథెరపీ అంటారు. అయితే మానసిక సమస్యలతో బాధపడుతున్న వాళ్లకి వాళ్లున్న దశ, సమస్యకు సంబంధించిన పుస్తకాన్ని, క్యారెక్టర్‌ని చదవాల్సిందిగా సిఫార్సు చేస్తారు. దీనివల్ల, ఒత్తిడి 68శాతం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బాగా ఒత్తిడిలో ఉన్నప్పుడు నడవడం, సంగీతం వినడం వంటివి చేస్తుంటాం కదా. వీటన్నింటి కన్నా ఇలాంటి ఓ పుస్తకం చదవడం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందట. మనసుకు విశ్రాంతి లభించి, నిద్రకు సహకరిస్తుందనీ చెబుతున్నాయి అధ్యయనాలు.

బంగారం - వెండి



8న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,39,920	1,26,900	2,38,649
విజయవాడ	1,35,910	1,26,500	2,49,400
ప్రొద్దుటూరు	1,39,200	1,28,060	2,43,500
రాజమహేంద్రవరం	1,38,000	1,24,500	2,56,000
విశాఖపట్నం	1,38,000	1,26,500	2,45,000
తమిళనాడు	-----	1,27,500	2,72,000

డియర్ వసుంధర

మా పాపకి 15 ఏళ్లు. ఈ మధ్యే నెలసరి ప్రారంభమైంది. అయితే నెలకి రెండుసార్లు పీరియడ్స్ వస్తున్నాయి. ఎందుకిలా? ఇది సహజమేనా? లేదంటే ఏదైనా సమస్యా? - ఓ సోదరి


డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

నెలకి రెండుసార్లు పీరియడ్స్...

నెలసరి మొదలైన ప్రారంభంలో ఇలా రావడం సహజమే. తొలిరోజుల్లో పీరియడ్ ఒకే క్రమంలో రాదు. కొందరికి రెండు, మూడు నెలలకి ఓసారి వస్తే... ఇంకొందరికి 15, 10 రోజులకీ వస్తుంటుంది. ఇంకా చిన్నవయసే కదా! అప్పుడే వీళ్లకి హార్మోనుల్లో సమతుల్యత రాదు. అందుకే ఇలా జరుగుతుంటుంది. అది క్రమబద్ధం కావడానికి ఆరు నెలల నుంచి ఒక్కోసారి రెండేళ్లు కూడా పడుతుంది. కాబట్టి, కంగారు పడకండి. రక్తస్రావం మరీ ఎక్కువగా అవుతోంది, పాప నీరస పడిపోతోంది అనుకుంటే... కొన్నిరోజులు హార్మోనల్ సప్లిమెంట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడు నెలసరి క్రమంగా వస్తుంది. లేదంటే రక్తస్రావాన్ని అదుపు చేసే మందులు అయినా ఇవ్వొచ్చు. సలహా కోసం వైద్యులను ఓసారి సంప్రదించండి. అయితే ఇది కంగారుపడాల్సిన విషయమైతే కాదు.

సంక్రాంతి ముచ్చట్లు



మాది... సంబరాల మూట!

మా ఊరి రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు నెలగంట ముహూర్తాన ప్రారంభిస్తారు. ఇక అప్పట్నుంచి నెలరోజులపాటూ పండుగ వాతావరణం కనిపిస్తూనే ఉంటుంది. ఊరంతా ధనుర్మాస ఉత్సవాలు, హరిదాసుల గానం, హరివిల్లు ముగ్గులతో నిండిపోతుంది. ఊళ్లోని 500 కుటుంబాలు కలిసి అతి పెద్ద భోగి మంట వేయడం మా ప్రత్యేకత. విద్య, ఉద్యోగరీత్యా ఎక్కడో స్థిరపడిన వాళ్లంతా సంక్రాంతికి ఊరు చేరుకోవాల్సిందే. ఈ సమయంలో ఊరంతా ఒకే కుటుంబంలా ఉంటుంది. కల్మషం లేని జీవితాలకు అద్దం పడుతుంది. కనుమనాడు రైతులంతా పొలంలో గోమాతను పూజిస్తారు. మా పెద్ద మతలబు పేట గ్రామం పచ్చని పొలాలతో పచ్చని చీర కట్టినట్టు ఉంటుంది. సంక్రాంతికి ప్రతిబింబంలా కనిపిస్తుంది. అందుకే సంక్రాంతికి మా ఊరిని సంబరాల మూటగా పిలుచుకుంటాం.



- ఎండా లలిత కుమారి,
పెద్ద మతలబు పేట గ్రామం, శ్రీకాకుళం జిల్లా

కనుమరోజు కొత్త బట్టలు!



అరుగులు అలికి, బియ్యప్పిండితో రంగవల్లికలు పెట్టడంతో మా పండుగ మొదలయ్యేది. సంక్రమణం ప్రవేశించగానే ప్రతి ఇల్లాలూ పసుపు, కుంకుమ, అరటిపళ్లు, ఖర్జూర తాంబూలం ధార పోసుకుని, నైవేద్యం పెట్టి, ముత్తయిదువులకు పంచి పెట్టడం మాకు ఆనవాయితీ. అత్తగారింటికి కొత్త అల్లుళ్లు రావడం పరిపాటి. వాళ్లతో ఆటపాటలు, మర్యాదలు చేయడంతో సాగే సందడే వేరు. మా ఊళ్లో ఎడ్ల పందాలు, తీర్థాలు బాగా జరుగుతాయి. ఊరంతా అక్కడికి చేరితే అదో వేడుకలా తోస్తుంది. సంక్రాంతి పండుగ నాడు బ్రాహ్మణులకు స్వయం పాకం ఇచ్చి పెద్దల ఆశీర్వచనం తీసుకుంటాం. పండుగ అనగానే కొత్త బట్టలు తప్పనిసరి కదా! కానీ మేం కనుమరోజు తప్పక కొత్త దుస్తులు వేసుకుంటాం. ఆరోజు వేసుకుంటే కలకాలం వేసుకుంటామని ఓ నమ్మకం. ఆరోజు మినుములు తినాలని ఓ ఆచారం. అందుకే తప్పక మినప సున్నుండలు చేసుకుని తింటాం.

- చెల్లూరు రాజేశ్వరి, చోడవరం

మీకు తెలుసా!



ఒకటి నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులు రోజులో దాదాపు 180 నిమిషాలు(3గం.లు) శారీరకంగా ఎంత చురుగా ఉంటే వాళ్ల ఆరోగ్యానికి అంత మంచిదని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే తల్లిదండ్రులు వాళ్లని ఆరుబయట ఆడించడం, నడిపించడం వంటివి చేయిస్తుండాలట.

నా అనుభవం

ఇతరులతో పోల్చుకోకండి...




నా స్టార్టప్ జర్నీలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నా. 2015లో షుగర్ కాస్మెటిక్స్‌ని ప్రారంభించినప్పుడు... సోలో విమెన్ ఫౌండర్‌ని అనే కారణంతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టడానికి నిరాకరించారు. ఓ ప్రముఖ ఇన్వెస్టర్ నన్ను కలవడానికి కూడా ఆసక్తి చూపించలేదు. ఇలాంటి తిరస్కరణలు 100కు పైగా ఎదుర్కొన్నా. అయితే, ఇవేవీ నన్ను నిరాశపరచలేదు. పట్టుదలతో స్కిన్ కేర్ బ్రాండ్‌ను నిర్మించుకున్నా. మన దేశంలో స్టార్టప్ ఫండింగ్‌లో మహిళలకు చాలా తక్కువ వాటా ఉండటం, కనిపించని వివక్ష కారణంగా ఆడవాళ్లు ఎక్కువగా నిరూపించుకోవాల్సి వస్తుంది. పనిచేసే స్త్రీలందరికీ నాదో సలహా... కెరియర్ మీదే కాదు... మీ ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు మీద దృష్టిపెట్టండి. మీ ప్రయాణాన్ని ఇతరులతో పోల్చుకోవద్దు. ఏ పనైనా చేయాలనుకున్నప్పుడు సామాజిక ఒత్తిళ్లతో తొందరపడకండి. దీర్ఘకాలిక వ్యూహంతో అడుగులు వేయండి. విజేత మీరే!

- వినీతా సింగ్, షుగర్ కాస్మెటిక్స్, సీఈవో అండ్ కో-ఫౌండర్

రంగవల్లిక

15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ




మద్దిపట్ల లక్ష్మి, హైదరాబాద్

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.

9154091911కు వాట్సాప్ చేయొచ్చు.


vasundhara@eenadu.in

ఎ. అస్మిత, కె.అభిరామిల ముగ్గులను ఈ-పేపర్‌లో చూడవచ్చు

సిరి

siri@eenadu.net

చిన్నారుల భవితకు ఫండ్ల తోడు



తల్లిదండ్రులుగా మనకున్న అతి పెద్ద బాధ్యత పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం. ఇప్పుడు ఎల్‌కేజీ ఫీజులు చూస్తేనే భయమేస్తోంది. మరి, రేపు పిల్లల ఉన్నత చదువుల ఖర్చులు ఏ స్థాయికి చేరతాయో ఊహించగలమా? విద్యా ద్రవ్యోల్బణం ఏటా 10-12 శాతం పెరుగుతోంది. దీన్ని జయించి, పిల్లల కలలను నిజం చేయాలంటే.. సంప్రదాయ పొదుపు మార్గాలు సరిపోవు. అందుకే, చిల్డ్రన్స్ మ్యూచువల్ ఫండ్‌లాంటివి ఎంచుకోవాల్సిన అవసరం ఉంది.

మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం మ్యూచువల్ ఫండ్లలో అనేక రకాలున్నాయి. ఇందులో పిల్లల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ప్రత్యేకంగా రూపొందించినవే ఈ 'సొల్యూషన్ ఓరియెంటెడ్ పథకాలు. ఇవి కేవలం డబ్బు దాచుకోవడానికే కాదు.. ఒక నిర్ణీత లక్ష్యం కోసం ఉద్దేశించినవి. ఇవి ప్రధానంగా రెండు రకాలు..

రవి, సురేష్ ఇద్దరూ స్నేహితులు. రవి ఏ చిన్న సందర్భం వచ్చినా తన కొడుకు కోసం ఖరీదైన దుస్తులూ, బొమ్మలూ కొనేవారు. సురేష్ మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించారు. తన కూతురు పేరు మీద ఒక చిల్డ్రన్ మ్యూచువల్ ఫండ్ ఖాతా తెరిచారు. నెలకు రూ.5,000 మదుపు చేస్తుండేవారు. చిన్న పిల్లలకు మ్యూచువల్ ఫండ్లేమిటి అని రవి అంటున్నా.. సురేష్ పట్టించుకునేవారు కాదు. 18 ఏళ్ల తర్వాత రవి తన కొడుకు కాలేజీ ఫీజు బ్యాంకు రుణం కోసం వెతుకుతుంటే.. సురేష్ మాత్రం తన కూతురు పేరుమీద ఉన్న ఫండ్ ఖాతాలోని డబ్బును తీసి, మంచి పేరున్న కాలేజీలో చేర్పించారు. ఇక్కడ తేడా సంపాదనలో లేదు.. ముందస్తు ప్రణాళికలో ఉంది.

హైబ్రిడ్ ఫండ్లు: ఈక్విటీ (షేర్లు), డెట్ (బాండ్లు) రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి. నష్టభయం తక్కువగా ఉండాలని కోరుకునే వారికి ఇవి సరిపోతాయి.

ఈక్విటీ ఫండ్లు: పూర్తిగా షేర్లలోనే మదుపు చేస్తాయి. స్వల్పకాలంలో కాస్త నష్టభయం ఉన్నా, దీర్ఘకాలంలో మంచి లాభాలకు ఆస్కారం ఉంటుంది.

వీటిలో ఉండే అతి ముఖ్యమైన నిబంధన.. లాకిన్ పీరియడ్. వీటిలో పెట్టుబడిని కనీసం 5 ఏళ్లు లేదా పిల్లలకు 18 ఏళ్లు నిండే వరకూ (ఏది ముందైతే అది) కొనసాగించాలి. అప్పటి వరకూ ఈ పథకాల్లో నుంచి డబ్బు వెనక్కి తీయడం కుదరదు.

సులభంగానే..

పిల్లల ఫండ్లలో మదుపు చేయడం చాలా సులభం.
✦ పెట్టుబడి కచ్చితంగా పిల్లల పేరుమీదే ఉండాలి.
✦ తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ పెట్టుబడి ఖాతాను నిర్వహిస్తారు.
✦ పిల్లల పుట్టిన తేదీ ధ్రువీకరణ అవసరం.
✦ కేవైసీ నిబంధనల కోసం తల్లిదండ్రుల/సంరక్షకుల పాన్, ఇతర పత్రాలు కావాలి.
✦ పిల్లల పేరుమీద బ్యాంకు ఖాతా ఉంటే మంచిది. లేకపోయినా తల్లిదండ్రుల ఖాతా నుంచి సిప్ చేయొచ్చు. గడువు తీరాక డబ్బు వెనక్కి తీసుకునేటప్పుడు కచ్చితంగా పిల్లల ఖాతాలోనే జమ అవుతుంది.
✦ గతంలో పిల్లల తల్లిదండ్రుల ఖాతా నుంచి మాత్రమే డబ్బు కట్టాలనే నిబంధన ఉండేది. కానీ ఇప్పుడు సెబీ వీటిని సడలించింది. తాతయ్యలు, అమ్మమ్మలు కూడా మనవళ్ల/మనవరాళ్ల మ్యూచువల్ ఫండ్ ఖాతాలో డబ్బులు కట్టొచ్చు. పండగలకు, పుట్టినరోజులకు ఖరీదైన బహుమతులకు బదులు, వారి ఫండ్ ఖాతాలో రూ. 5000 వేస్తే.. అదే వారికిచ్చే నిజమైన ఆశీర్వాదం.

రూ. 50 లక్షలు సాధ్యమేనా?

ఈ రోజు మంచి ఇంజినీరింగ్ కాలేజీలో సీటు రావాలంటే దాదాపు రూ. 10లక్షల వరకూ అవసరం అవుతోంది. సగటున 10 శాతం ద్రవ్యోల్బణం లెక్కేస్తే.. మరో 18 ఏళ్ల తర్వాత దాదాపు రూ.55 లక్షలు అవసరం.. దీన్ని సాధించాలంటే.. సగటున 12 శాతం రాబడితో నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలో చూద్దాం..

నెలవారీ మొత్తం	15 ఏళ్లకు	20 ఏళ్లకు
రూ.5,000	రూ.25 లక్షలు	రూ.50 లక్షలు
రూ.10,000	రూ.50 లక్షలు	రూ.1 కోటి
రూ.15,000	రూ.75 లక్షలు	రూ.1.5 కోట్లు

చూశారుగా నెలకు రూ.5,000తో మదుపు ప్రారంభించినా.. 20 ఏళ్ల తర్వాత మీ పాప/బాబు చేతిలో రూ.50లక్షలు ఉంటాయి. 6 శాతం వడ్డీనిచ్చే పథకాల్లో దాచుకుంటే.. రూ.22 లక్షలు మాత్రమే జమవుతాయి.

లాభాలేమిటి?

✦ ఇంట్లో ఏదైనా అత్యవసరం రాగానే చాలామంది పిల్లల కోసం దాచిన డబ్బును వాడేస్తుంటారు. ఈ ఫండ్లలో జమ చేయడం వల్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. కాబట్టి, ఆ అవకాశం ఉండదు. కేవలం పిల్లల అవసరాల కోసమే డబ్బును వాడుకుంటాం.

✦ ఈక్విటీ మార్కెట్ దీర్ఘకాలంలో 12-15 శాతం రాబడినిచ్చే అవకాశం ఉంటుంది. కాస్త నష్టభయం ఉన్నప్పటికీ, సంప్రదాయ పథకాలతో పోలిస్తే కాస్త మెరుగైన రాబడినే అందిస్తుంది.

✦ డెట్ ఫండ్స్, ఎఫ్‌డీలతో పోలిస్తే వీటిలో పన్ను భారం తక్కువ. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల వరకూ వచ్చిన లాభంపై ఎలాంటి పన్ను వర్తించదు. ఆ పరిమితి దాటిన తర్వాత వచ్చిన లాభంపై మాత్రమే 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ఉంటుంది. వీటిలో కొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి..

పిల్లలకు ఏదైనా అత్యవసర ఖర్చు వచ్చినా, ఇతర ఇబ్బందులు వచ్చినప్పుడు డబ్బు తీయాలంటే.. ఇబ్బంది ఎదురవుతుంది. లాకిన్ వ్యవధి పూర్తయిన తర్వాతా కొన్ని ఫండ్లు అమ్మకపు రుసుమును విధిస్తున్నాయి.

ఇలా చేయొచ్చు...

మీకు ఆర్థిక క్రమశిక్షణ ఉంటే.. 'నేను పిల్లల కోసం దాస్తున్న డబ్బును ఎట్టి పరిస్థితుల్లోనూ తీయను' అనే నమ్మకం ఉంటే. ప్రత్యేకంగా పిల్లల ఫండ్లలోనే పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. మంచి పనితీరున్న ఫ్లెక్సీ క్యాప్ లేదా ఇండెక్స్ ఫండ్లనూ పరిశీలించవచ్చు. దీనికి పిల్లల చదువు అనే పేరు పెట్టుకోండి. సాధారణ ఫండ్లలో పనితీరు బాగాలేకపోతే, మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. చిల్డ్రన్స్ ఫండ్లలో ఆ స్వేచ్ఛ ఉండదు. డబ్బు చేతిలో నిలవదు అనుకునే వారికి మాత్రం.. చిల్డ్రన్ ఫండ్లే మంచి ఎంపిక.

✦ పిల్లలకు 16-17 ఏళ్లు వచ్చాక, ఈక్విటీలో నుంచి డబ్బును క్రమానుగత బదిలీ విధానం (ఎస్‌టీపీ) ద్వారా డెట్ పథకాల్లోకి మార్చుకోవాలి. అప్పుడు మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ లభిస్తుంది.

చిన్న కంపెనీల్లో

కొత్త పథకం

గ్రో మ్యూచువల్ ఫండ్ సరికొత్తగా గ్రో స్మాల్ క్యాప్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 22 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 500తో ఇందులో మదుపు చేయొచ్చు. దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న చిన్న తరహా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రధాన లక్ష్యం. ఫండ్ మేనేజర్లు 'క్వాలిటీ, గ్రోత్' సూత్రాన్ని పాటిస్తూ కేవలం ధర తక్కువగా ఉన్న షేర్లను కాకుండా, వృద్ధికి అవకాశం ఉన్న నాణ్యమైన షేర్లను ఎంచుకుంటారు. దీర్ఘకాలంలో మంచి రాబడికి అవకాశం ఉన్నప్పటికీ, స్మాల్ క్యాప్ విభాగం కాబట్టి, నష్టభయం అధికంగా ఉంటుంది. కాబట్టి, 5-7 ఏళ్లపాటు మదుపు చేయగలను అనుకున్న వారే ఈ ఫండ్‌ను ఎంచుకోవచ్చు.

విద్యార్థులకు టర్మ్ బీమా

ఆదాయం లేని విద్యార్థులకూ టర్మ్ ఇన్సూరెన్స్ అందించేలా యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. తాను అందిస్తున్న స్మార్ట్ టర్మ్ ప్లాన్ ప్లస్‌ను 18 ఏళ్లు నిండిన డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకూ అందించనుంది. ఈ ప్లాన్ ద్వారా గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకూ జీవిత బీమా రక్షణ లభిస్తుంది. కాల వ్యవధి 10 ఏళ్లు. చిన్న వయసులోనే పాలసీ తీసుకోవడం వల్ల ప్రీమియం చాలా తక్కువగా ఉంటుంది. లాకిన్ పద్ధతిలో భవిష్యత్తులోనూ అదే ప్రీమియం చెల్లించేందుకు వీలుంటుంది. విద్యా రుణాలు తీసుకున్న వారికి ఇది ఒక రక్షణ కవచం లాంటిది అని చెప్పొచ్చు. దురదృష్టవశాత్తూ విద్యార్థికి ఏదైనా జరిగితే, ఈ రుణ భారం తల్లిదండ్రులపై పడకుండా ఈ పాలసీ ఆదుకుంటుంది. విద్యార్థులకు ఎలాంటి ఆదాయం ఉండదు. కాబట్టి, ఆదాయ ధ్రువీకరణ అవసరం లేకుండా ప్రత్యేక నిబంధనలతో పాలసీని జారీ చేస్తారు. భవిష్యత్తులో ఉద్యోగం వచ్చాక, పెళ్లి తర్వాత కవరేజీని పెంచుకునే వీలూ ఉంటుంది.

రిఫండ్ ఇంకా రాలేదా?



గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (2024-25)ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండు కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి డిసెంబరు నాటికే దాదాపు రిఫండు ప్రక్రియ పూర్తవుతుంది. కానీ, ఈసారి సాంకేతిక కారణాలు, ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి నుంచి మరింత స్పష్టమైన సమాచారాన్ని కోరడం తదితర కారణాలతో పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ నిరీక్షించాల్సి వస్తోంది.

సాధారణంగా రిటర్నులలో ఏదైనా వ్యత్యాసం ఉన్నప్పుడు ఆదాయపు పన్ను శాఖ నోటీసుల ద్వారా పన్ను చెల్లింపుదారులకు సమాచారం అందిస్తుంది. ఒకసారి సమస్య పరిష్కారం అయిన తర్వాత రిఫండు విడుదల అవుతుంది. ఎలాంటి వ్యత్యాసాలు లేని సందర్భాల్లో వేగంగా రిఫండు బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

- ఐటీఆర్ ఫారం 26 ఏఎస్/ఏఐఎస్‌తో పోల్చి చూసినప్పుడు మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌లోని వివరాలు సరిపోలనప్పుడు..
- బ్యాంకు ఖాతా వివరాలు తప్పుగా ఇవ్వడం లేదా ఖాతాను ముందస్తుగా ధ్రువీకరించుకోకపోవడం..
- అనర్హమైన, తప్పుడు మినహాయింపులను క్లెయిం చేయడం..
- ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత రిటర్నులను తప్పనిసరిగా ఇ-వెరిఫికేషన్ చేయాలి. లేకపోతే రిఫండు రాదు.
- అధిక విలువ కలిగిన లావాదేవీలు కనిపించినప్పుడు, వాటిని రిటర్నులలో నమోదు చేయకపోవడం.. ఇలాంటి కొన్ని కారణాలతో రిఫండు రావడం ఆలస్యం కావొచ్చు.

పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి నోటీసులు రాకపోతే, తక్షణమే ఏమీ చేయాల్సిన అవసరం లేదు. అంతర్గత తనిఖీలు, ధ్రువీకరణ పూర్తి కాగానే రిఫండు జమ అవుతుంది. పైన పేర్కొన్న కారణాల్లో ఏమైనా మీకు వర్తిస్తాయో పరిశీలించండి. ఒకవేళ మళ్లీ రిటర్నులు దాఖలు చేయాల్సి వస్తే.. అప్‌డేటెడ్ రిటర్నులను సమర్పించాలి.

నెలకు రూ.30వేలు రావాలంటే

మార్గదర్శి

నేను వచ్చే నెలలో పదవీ విరమణ చేస్తున్నాను. నా దగ్గర ఉన్న మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసి, నెలకు రూ.30వేలు వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నాను. ఇందు కోసం ఎంత మొత్తం మదుపు చేయాలి? దీని వల్ల ఏమైనా నష్టం వస్తుందా? - ప్రసాద్

నెలకు రూ.30వేలు రావాలంటే.. సగటున 7 శాతం రాబడి వచ్చేలా రూ.52 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మీకు డబ్బు అవసరం చాలా ఏళ్లపాటు ఉంటుంది. కాబట్టి, మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న మొత్తాన్ని కాస్త నష్టభయం ఉన్న పథకాల్లో మదుపు చేయొచ్చు. ఇందుకోసం బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్లను ఎంచుకోవచ్చు. వీటిలో సగటున 10 శాతం వరకూ రాబడి అందే అవకాశం ఉంది. ఇందులో నుంచి నెలకు రూ.30వేలు వెనక్కి తీసుకోండి. అయిదేళ్లపాటు పెట్టుబడి పెడితే నెలనెలా ఆదాయం తర్వాతా మీ పెట్టుబడి వృద్ధి అయ్యే అవకాశం ఉంటుంది.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

వినూత్న ఆవిష్కరణలతో

మహీంద్రా మనులైఫ్ మ్యూచువల్ ఫండ్ నుంచి మహీంద్రా మనులైఫ్ ఇన్నోవేషన్ ఆపర్చునిటీస్ ఫండ్ విడుదలయ్యింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 2 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. వినూత్న ఆవిష్కరణలతో పరిశ్రమల రూపురేఖలను మార్చేస్తూ, భవిష్యత్తులో భారీ వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీలను గుర్తించి పెట్టుబడి పెట్టడమే ఈ ఫండ్ లక్ష్యం. ఇన్నోవేషన్ థీమ్ ఫండ్ కాబట్టి, కాస్త నష్టభయం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, దీర్ఘకాలిక లక్ష్యాలున్న మదుపరులు మాత్రమే దీన్ని పరిశీలించాలి.

ఛాంపియన్

అభిమానులూ సిద్ధమా! టీ20 ప్రపంచకప్, ఐపీఎల్‌కు ముందు మరో ధనాధన్ టోర్నీ అలరించనుంది. నేటి నుంచే మహిళల ప్రీమియర్ లీగ్. స్మృతి, హర్మన్‌ప్రీత్, గార్డ్‌నర్, నాట్‌సీవర్, అమేలియా, లానింగ్.. ఇలా ఎందరో స్టార్ ప్లేయర్లు అదిరే ఆటతో కావాల్సినంత వినోదాన్ని పంచనున్నారు. లీగ్ తొలి మ్యాచ్‌లో రెండు సార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్.. మాజీ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది.

మెరుపుల ఆటకు వేళాయె..

నేటి నుంచే డబ్ల్యూపీఎల్

రాత్రి 7.30 నుంచి

● తొలి మ్యాచ్‌లో ముంబయి × బెంగళూరు



ముంబయి

రసవత్తర సమరాలకు వేళైంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్ శుక్రవారం మొదలుకానుంది. తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్.. స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరుతో తలపడనుంది. ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్‌లు కూడా జట్టులో ఉండడంతో ముంబయి దుర్భేద్యంగా కనిపిస్తోంది. ఈ ఇద్దరితో పాటు హర్మన్‌ప్రీత్, కమలిని, అమేలియా కెర్, అమన్‌జ్యోత్‌లతో ముంబయి బ్యాటింగ్ బలంగా ఉంది. పేస్‌బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్.. ముంబయి బౌలింగ్‌ను నాయకత్వం వహించనుంది. సైకా ఇషాక్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్ ఆ జట్టుకు ఉంది. మరోవైపు దిగ్గజ ప్లేయర్ ఎలీస్ పెర్రీ లేకపోవడం బెంగళూరుకు లోటే. ఆమె గైర్హాజరీలో కెప్టెన్ స్మృతి మంధాన టాప్‌లో ఎలా ఆడుతుందన్నదే బెంగళూరుకు కీలకం. జార్జియా వోల్, ఆల్‌రౌండర్ గ్రేస్ హారిస్, నడైన్ డిక్లర్క్ బ్యాటింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. వికెట్‌కీపర్ రిచా ఘోష్ రూపంలో మంచి ఫినిషర్ ఆర్సీబీకి ఉంది. లారెన్, పూజ వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, డిక్లర్క్, పేస్ బాధ్యతలు మోస్తారు. రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్‌ల రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు కూడా బెంగళూరుకు ఉన్నారు. నవీ ముంబయి స్టేడియంలోని పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. ఆరంభంలో పేసర్లకు కాస్త సహకారం లభించవచ్చు. ఛేదనలో మంచు ప్రభావం ఉండొచ్చు. ఇక్కడ జరిగిన 11 డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌ల్లో మూడుసార్లు మాత్రమే మొదట బ్యాటింగ్ చేసిన జట్టు గెలవడం గమనార్హం. ఐపీఎల్ మ్యాచ్‌లను స్టార్‌స్పోర్ట్స్‌లో చూడొచ్చు. జియో సినిమా యాప్‌లో లైవ్‌స్ట్రీమింగ్ ఉంటుంది.

వీళ్లు లేరు..: ఈసారి కొందరు ముఖ్యమైన ప్లేయర్లు డబ్ల్యూపీఎల్‌కు దూరమయ్యారు. ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్లు ఎలిస్ పెర్రి, అనాబెల్ సదర్లాండ్ వ్యక్తిగత కారణాలతో ఈ సీజన్ నుంచి వైదొలిగారు. పెర్రి మూడు సీజన్లలో ఆర్సీబీ తరఫున అదిరే ప్రదర్శన చేసింది. 25 మ్యాచ్‌ల్లో 972 పరుగులు చేసి 14 వికెట్లు పడగొట్టింది. మరోవైపు 2026 క్వాలిఫయర్స్ కోసం అమెరికా జట్టుకు ఎంపిక కావడంతో తారా నోరిస్.. యూపీ వారియర్స్ జట్టుకు అందుబాటులో లేకుండా పోయింది. అలీసా హీలీ, చమరి ఆటపట్టు, హెదర్ నైట్‌లను వేలంలో ఏ ఫ్రాంఛైజీ కూడా తీసుకోలేదు.

ఇప్పటివరకు ఇలా..

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఇప్పటివరకు మూడు సీజన్లు జరిగాయి. టోర్నీలో ముంబయి ఇండియన్స్ అత్యంత విజయవంతమైన జట్టు. రెండు సార్లు విజేతగా నిలిచింది. 2023, 2025లో ఆ జట్టు టైటిళ్లు గెలుచుకుంది. 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. దిల్లీ క్యాపిటల్స్ మూడుసార్లూ ఫైనల్ చేరినా ట్రోఫీని అందుకోలేకపోయింది. ఈసారి కొత్త జట్టు టైటిల్ గెలుస్తుందా లేదా పూర్వ విజేతే మళ్లీ నెగ్గుతుందా అన్నది చూడాలి.

ఇదీ ఫార్మాట్

టోర్నీ ఎప్పటిలాగే డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్లో జరుగుతుంది. అయిదు జట్లు ఒకదానితో ఒకటి రెండేసి మ్యాచ్‌లు ఆడతాయి. లీగ్ దశలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టేబుల్ టాపర్ నేరుగా ఫైనల్లో ప్రవేశిస్తుంది. రెండు, మూడో స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో స్థానం కోసం ఎలిమినేటర్‌లో తలపడతాయి.

తొలిసారి డబుల్ హెడర్

టీ20 ప్రపంచకప్, రంజీ ట్రోఫీల కోసం చాలా వేదికలను బీసీసీఐ అట్టిపెట్టడంతో నవీ ముంబయి, వడోదరలు మాత్రమే డబ్ల్యూపీఎల్‌కు ఆతిథ్యమిస్తున్నాయి. తొలి 11 మ్యాచ్‌లు నవీ ముంబయిలో.. ఎలిమినేటర్, ఫైనల్ సహా తర్వాతి 11 మ్యాచ్‌లు వడోదరలో జరుగుతాయి. డబ్ల్యూపీఎల్‌లో తొలిసారి డబుల్ హెడర్‌లు ఉండడం విశేషం. ఈ నెల 10, 17వ తేదీల్లో నవీ ముంబయిలో రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. డబుల్ హెడర్ రోజుల్లో తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30కి మొదలవుతుంది.

కొత్తగా..



దీయా

తొలిసారి డబ్ల్యూపీఎల్‌లో ఆడబోతున్న లిజెల్ లీ దీయా యాదవ్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్‌లు ఎంతో ఆసక్తి రేపుతున్నారు. దక్షిణాఫ్రికా మాజీ వికెట్‌కీపర్ లిజెల్ లీ డబ్ల్యూబీబీఎల్‌లో అదిరే ప్రదర్శనతో మంచి ఫామ్‌లో ఉంది. ఆ టోర్నీలో ఆమె 38.12 సగటుతో 305 పరుగులు చేసింది. ఆమె దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడనుంది. ఇంకా అరంగేట్రం చేయని హరియాణా బ్యాటర్ దీయా యాదవ్ కూడా దిల్లీకే ప్రాతినిధ్యం వహించనుంది. 16 ఏళ్ల దీయా.. తన రాష్ట్రానికే చెందిన షెఫాలి వర్మలా ధాటిగా ఆడుతుంది. ముంబయికి ఆడనున్న మిల్లీ ఇల్లింగ్‌వర్త్ మంచి ఫాస్ట్‌బౌలర్. 120 కిలో మీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తుంది. ఎలా రాణిస్తుందో చూడాలి.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ



సాత్విక్, చిరాగ్

సింధు కూడా

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆమె 21-8, 21-13తో ఎనిమిదో సీడ్ తొమొక మియాజకి (జపాన్)పై విజయం సాధించింది. మంచి ఫామ్‌లో ఉన్న సింధు.. కేవలం 33 నిమిషాల్లోనే మియాజకిని చిత్తుచేసింది. ప్రత్యర్థిపై తన గెలుపోటముల రికార్డును 2-1తో మెరుగుపరుచుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం 21-18, 21-11తో జునైది ఆరిఫ్, రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 20-22, 15-21తో లీ చుక్ (హాంకాంగ్) చేతిలో, ఆయుష్ 18-21, 21-18, 12-21తో టాప్ సీడ్ షై యుకి (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. క్వార్టర్స్‌లో అకానె యమగూచి (జపాన్)తో సింధు, ఫజర్ అల్ఫియాన్-మహ్మద్ ఫిక్రి (ఇండోనేసియా)తో సాత్విక్-చిరాగ్ తలపడనున్నారు.

ఆఖరిది ఆసీస్‌దే

యాషెస్ సిరీస్



సిడ్నీ: ఇంగ్లాండ్‌పై ఇప్పటికే యాషెస్ సిరీస్ సాధించిన ఆతిథ్య ఆస్ట్రేలియా.. ఆఖరిదైన అయిదో టెస్టునూ సొంతం చేసుకుని సిరీస్‌ను 4-1తో ఘనంగా ముగించింది. అయిదో టెస్టులో కంగారూ జట్టు 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై గెలిచింది. మ్యాచ్‌లో ఆఖరి రోజు, గురువారం ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. బదులుగా 160 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 31.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. లబుషేన్ (37), వెదరాల్డ్ (34), ట్రావిస్ హెడ్ (29), కామెరూన్ గ్రీన్ (22 నాటౌట్) రాణించారు. కెరీర్‌లో చివరి టెస్టు ఆడిన ఉస్మాన్ ఖవాజా ఆఖరి ఇన్నింగ్స్‌లో 6 పరుగులకే ఔటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 384.. ఆసీస్ 567 పరుగులు చేశాయి. ఈ సిరీస్‌లో తొలి మూడు టెస్టులను ఆసీస్ గెలవగా.. నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ నెగ్గింది.

తిలక్‌కు శస్త్రచికిత్స



తిలక్ వర్మ

కివీస్‌తో తొలి మూడు టీ20లకు దూరం

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధమవుతున్న టీమ్‌ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం రాజ్‌కోట్‌లో వృషణాలకు శస్త్రచికిత్స చేయించుకున్న కీలక మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ ఆ సిరీస్ తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. కోలుకుంటాడా లేదా అన్న దానిపై అతడు మిగతా రెండు మ్యాచ్‌ల్లో ఆడడం ఆధారపడి ఉంది. ఫిబ్రవరి 7న జరిగే ప్రపంచకప్ ఆరంభం కానున్న నేపథ్యంలో తిలక్ పరిస్థితి టీమ్‌ఇండియాకు ఆందోళన కలిగించేదే. విజయ్ హజారే ట్రోఫీ కోసం హైదరాబాద్ జట్టుతో తిలక్ రాజ్‌కోట్ వెళ్లాడు. మంగళవారం బెంగాల్‌తో మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్ సందర్భంగా అతడికెలాంటి గాయం కాలేదు. కానీ బుధవారం తీవ్రమైన నొప్పితో విలవిల్లాడాడు. స్కానింగ్ తీశాక.. వెంటనే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో తిలక్ శస్త్రచికిత్స చేయించుకున్నాడని బీసీసీఐ పేర్కొంది. తిలక్ గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జయ్యాడు. కివీస్‌తో టీ20 సిరీస్ ఈ నెల 21న మొదలవుతుంది. తిలక్ స్థానంలో మరో ఆటగాణ్ని సెలక్టర్లు ఇంకా ఎంపిక చేయలేదు.

8వ స్థానంలో వచ్చి..



అకిబ్ నబి 114 నాటౌట్

నబి మెరుపు సెంచరీ

● హైదరాబాద్‌కు అనూహ్య ఓటమి

సౌరాష్ట్ర: విజయ్ హజారే ట్రోఫీని హైదరాబాద్ ఓటమితో ముగించింది. ఇప్పటికే నాకౌట్ రేసుకు దూరమైన హైదరాబాద్ గ్రూప్-బి ఆఖరి మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో జమ్ముకశ్మీర్ చేతిలో కంగుతింది. మొదట హైదరాబాద్ 9 వికెట్లకు 268 పరుగులు చేసింది. అమన్ రావు (60), రాహుల్ సింగ్ (56), నితేశ్ రెడ్డి (54) రాణించారు. అకిబ్ నబి (3/56), అబిద్ (2/50) హైదరాబాద్‌కు కళ్లెం వేశారు. ఛేదనలో మహ్మద్ సిరాజ్ (2/45), మిలింద్ (2/54) ధాటికి జమ్ముకశ్మీర్ తడబడింది. 90 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ స్థితిలో ఎనిమిదో స్థానంలో వచ్చిన అకిబ్ నబి (114 నాటౌట్; 82 బంతుల్లో 10×4, 7×6) హైదరాబాద్ బౌలర్లపై మెరుపుదాడి చేశాడు. వన్షజ్ శర్మ (69 నాటౌట్)తో కలిసి అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు అతడు 182 పరుగులు జోడించడంతో జమ్ము కశ్మీర్ 47.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మరోవైపు ఆంధ్ర విజయంతో ముగించింది. గ్రూప్-డి చివరి మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో సర్వీసెస్‌ను ఓడించింది.

షూటర్‌పై కోచ్ లైంగిక వేధింపులు

దిల్లీ: మైనర్ షూటర్‌ను లైంగికంగా వేధించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న జాతీయ కోచ్ అంకుశ్ భరద్వాజ్‌పై భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) వేటు వేసింది. అంకుశ్‌పై ఫరీదాబాద్‌లో పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైనట్లు ఎన్ఆర్ఏఐ ధ్రువీకరించింది. "అంకుశ్‌ను ఎన్ఆర్ఏఐ సస్పెండ్ చేసింది. అతనికి షోకాజ్ నోటీసు ఇచ్చింది. విచారణ పూర్తయ్యే వరకు అతనికి శిక్షణ కార్యకలాపాలతో సంబంధం ఉండదు" అని ఎన్ఆర్ఏఐ కార్యదర్శి రాజీవ్ భాటియా తెలిపాడు. ఎఫ్ఐఆర్ ప్రకారం గత నెలలో జాతీయ ఛాంపియన్‌షిప్ సందర్భంగా తనపై అంకుశ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు చేసింది. పోటీలు ముగిసిన అనంతరం మ్యాచ్ ప్రదర్శనను విశ్లేషించాలనే సాకుతో సూరజ్‌కుండ్ (ఫరీదాబాద్)లోని హోటల్ గదికి పిలిచినట్లు ఆరోపించింది. అక్కడ ఫిజియో థెరపీ పద్ధతిలో వెన్ను నొప్పిని సరిచేస్తానని నమ్మించి.. లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఈనాడు సినిమా



నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

అల్లుడు వస్తున్నాడు... రెడీనా!

గౌరవపురం జమిందార్ గోపరాజు మనవడు రాజు పాత్రలో ఈ సంక్రాంతికి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు నవీన్ పొలిశెట్టి. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన 'అనగనగా ఒక రాజు' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. మారి దర్శకత్వంలో... సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. నాగార్జున వాయిస్ ఓవర్‌తో సాగే ఈ ట్రైలర్‌లో 'పండగకు అల్లుడు వస్తున్నాడు... రెడీగా ఉండండి మరీ', 'ప్రశాంతంగా ఉన్నోడిని.. .. ప్రశాంత్ నీల్ జోన్‌లోకి తీసుకొచ్చారు కదరా....', 'రాజుగాడి పెళ్లి ఏడు తరాలు అటు... ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది' అంటూ నవీన్ పొలిశెట్టి చేసిన అల్లరి ఆకట్టుకుంది. వేడుకను ఉద్దేశించి నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ "ఈ సంక్రాంతికి కుటుంబమంతా కలిసి ఆస్వాదించేలా ఈ సినిమాని రూపొందించాం. ఆరంభం నుంచి చివరివరకూ సన్నివేశాలు వినోదం పంచుతాయి. అదే సమయంలో బలమైన భావోద్వేగాలూ ఉంటాయి. దర్శకుడు మారి తొలి సినిమా ఇది. చాలా బాగా తెరకెక్కించాడు. మీనాక్షి తన నటనతో మరోసారి అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఈ పండగకు చాలా సినిమాలొస్తున్నాయి. నా అభిమాన హీరోల సినిమాలన్నీ ఒకేసారి విడుదల వుతున్న ఈ సంక్రాంతి నాకు చాలా ప్రత్యేకం. ప్రభాస్ అన్న సినిమాతో మొదలుపెట్టి, చిరంజీవి, రవితేజ... అందరి సినిమాలూ విజయవంతం కావాలని కోరుకుంటున్నా. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతిరత్నాలు', 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'... ఇలా వరుస హిట్స్ ఇచ్చిన తర్వాత, ఆ వెంటనే సినిమా చేయలేకపోయా. నాకు ప్రమాదం జరగడమే కారణం. అయితే ఈ విరామానికి తగ్గట్టుగా, రెట్టింపు వినోదంతో 'అనగనగా ఒక రాజు' సినిమా వస్తుంది" అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ "ఇందులో నేను చారులత అనే యువతి పాత్రని పోషించా. నా మనసుకు దగ్గరైన పాత్ర" అన్నారు. దర్శకుడు మారి మాట్లాడుతూ "సంక్రాంతి పండగకు తగ్గ మంచి వినోదభరిత చిత్రమిది" అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "రెండు గంటలపాటు నవీన్ శైలిలో నవ్వించే చిత్రమిది. చివరి 15 నిమిషాలు మినహా, ఆరంభం నుంచి పంచ్‌లు పేలుతూనే ఉంటాయి" అన్నారు.

రానే వచ్చాడు... రాయ



యశ్

అతడు వస్తాడా రాడా? అని ఆలోచించేలోపే రానే వచ్చాడు... రాయ. వచ్చాక అతడు సృష్టించిన విధ్వంసం ఏ రీతిన సాగిందో తెలియాలంటే మాత్రం 'టాక్సిక్' చూడాల్సిందే. యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమే 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ - అప్స్'. గీతూమోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిర్మాణంలోనే కాకుండా, ఈ సినిమా రచనలోనూ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి భాగం పంచుకున్నారు కథానాయకుడు యశ్. గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'టాక్సిక్' టీజర్‌ని విడుదల చేశారు. తుపాకుల పహారాలో ఉన్న శ్మశానంలోకి అడుగు పెట్టి... శత్రువులకు చుక్కలు చూపిస్తూ, విధ్వంసాన్ని సృష్టించే రాయ పాత్రలో పరిచయమయ్యారు యశ్. ఆయన 'కె.జి.ఎఫ్' చిత్రాల తర్వాత నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటుగానే సినిమా రూపొందుతోందని టీజర్ చాటుతోంది. కన్నడ, ఆంగ్ల భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాని తెలుగు, హిందీ, తమిళ, మలయాళం సహా పలు భాషల్లో మార్చి 19న విడుదల చేయనున్నారు.

యాక్షన్... ప్రియాంక



ప్రియాంక చోప్రా

గతేడాది 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రంతో ప్రేక్షకులకు థ్రిల్ పంచింది బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా. ఇప్పుడామె ఖాతాలో రాబోయే మరో యాక్షన్ అడ్వెంచర్ హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'. దర్శక నిర్మాత ఫ్రాంక్.ఇ.ఫ్లవర్స్ తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రియాంకతో పాటు కార్ల్ అర్బన్ నటించారు. తాజాగా ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో అధికారికంగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ.. ప్రియాంక ఫస్ట్ లుక్ పోస్టర్‌లను ఆవిష్కరించింది. ఈ సినిమా ఫిబ్రవరి 25 నుంచి ప్రైమ్‌లో ప్రసారం కానుంది. "తల్లి, రక్షకురాలు, పైరేట్.. 'బ్లడీ మేరీ'ని కలవండి అంటూ ఇన్‌స్టాలో విడుదలైన ఈ పోస్టర్‌లలో ప్రియాంక గన్ చేతపట్టి కిల్లింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది. "ఈ సినిమాతో ప్రియాంక.. కుటుంబం కోసం రక్తపాతాన్ని విడిచిపెట్టి ప్రశాంతంగా జీవిస్తున్న మాజీ పైరేట్ మేరి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది. ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడానికి తన బృందం తిరిగి వచ్చినప్పుడు.. తాను ప్రేమించే వారిని రక్షించాలనే సంకల్పంతో కత్తి యుద్ధాలు, వ్యూహాత్మక పోరాటాల నేపథ్యంతో ఈ సినిమా రూపొందింద"ని చిత్రవర్గాల సమాచారం.

తొలి సీజన్‌ను మించి కానిస్టేబుల్ కనకం 2

"ఊహకందని ట్విస్టులు, మలుపులతో ఆద్యంతం ఆసక్తి రేకెత్తించే సిరీస్ 'కానిస్టేబుల్ కనకం 2'" అన్నారు దర్శకుడు ప్రశాంత్ దిమ్మల. క్లైమాక్స్ ఎవరి ఊహలకు అందని రీతిలో ఉంటుందని తెలిపారు. ఆయన దర్శకత్వంలో వర్ష బొల్లమ్మ టైటిల్ పాత్ర పోషించిన ఈ సిరీస్ ప్రస్తుతం ఈటీవీ విన్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే గురువారం 'ఈనాడు సినిమా'తో దర్శకుడు ప్రశాంత్ ముచ్చటించారు.



ప్రశాంత్

"నేనెప్పుడూ ఈటీవీని నా కుటుంబంలో భాగంలాగే చూస్తా. చిన్నప్పుడు నాన్న నన్ను రామోజీ ఫిల్మ్ సిటీకి టూర్‌కు తీసుకెళ్లిన రోజులు ఇప్పటికీ ప్రత్యేకమే. ఈటీవీ లాంటి గొప్ప సంస్థలో అవకాశం రావడం, నా స్క్రిప్ట్‌తో వాళ్లని ఒప్పించడం ఓ కలలా ఉంది. ఈ సిరీస్ ప్రయాణంలో నేనెప్పుడూ ఒత్తిడికి గురైంది లేదు. నేను దీన్ని గొప్ప బాధ్యతగా తీసుకున్నా. ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటే నాలాంటి మరో వంద మందికి అవకాశమిస్తుంది ఈ సంస్థ. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఒళ్లు దగ్గర పెట్టుకుని ఎంతో నిజాయతీగా ఈ సిరీస్‌ను రూపొందించా. దీనికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. తొలి సీజన్ తర్వాత నాకు పలు నిర్మాణ సంస్థల నుంచి అవకాశాలొచ్చినా.. ఓ దర్శకుడిగా నా కర్తవ్యాన్ని పరిపూర్ణం చేయాలన్న ఉద్దేశంతో 'కానిస్టేబుల్ 2'పైనే దృష్టి పెట్టా".

★ "'కానిస్టేబుల్ కనకం' తొలి సీజన్‌కు ప్రేక్షకుల నుంచి ఆదరణ చూశాక రెండో సీజన్ కోసం ఎడిటింగ్ పరంగా కీలకమైన మార్పులు చేశాం. చంద్రిక ఎక్కడుంది.. తనకి ఏమైందనేది చివరి వరకు ప్రేక్షకుల ఊహలకు అందని రీతిలో స్క్రీన్‌ప్లేను ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దుకున్నాం. తొలి సీజన్ విషయంలో కొన్ని చోట్ల కథ సాగదీతగా ఉన్నట్లు వినిపించింది. అలాంటి ఏ చిన్న పొరపాటు కూడా కనిపించనీకుండా ఆద్యంతం ఆసక్తికరంగా ఉండేలా 'కానిస్టేబుల్ కనకం 2'ని సిద్ధం చేశాం. దీంట్లో ఎపిసోడ్‌లని కూడా నాలుగుకే కుదించాం. ఇవన్నీ మంచి ఫలితాన్నే ఇచ్చాయి. ఈ రెండో సీజన్ చూసిన ప్రతిఒక్కరూ తొలి భాగాన్ని మించి థ్రిల్ పంచారని మెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా క్లైమాక్స్ సీక్వెన్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు".

"ప్రస్తుతం ఈటీవీ విన్‌లోనే ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నా. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. 1990ల్లో చిత్తూరు - మద్రాస్‌ల మధ్య జరిగే కథగా ఉంటుంది. మహాభారతంలోని ఓ అంశాన్ని తీసుకుని దీన్ని సిద్ధం చేశా. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం. 'కానిస్టేబుల్ కనకం 3' కథను ఇప్పటికే సిద్ధం చేశా. అది ఒడిశా పూరి జగన్నాథ స్వామి నేపథ్యంతో ముడిపడి ఉంటుంది. అలాగే కనకం పాత్రతో ఓ సినిమా చేయాలనే ఆలోచన ఉంది".


సేవా స్ఫూర్తిని రగిలించే చిత్రం



రవిచంద్ర

"మూఢనమ్మకాలు, దురాచారాల నుంచి మహిళల్ని కాపాడేందుకు మహాత్మ జ్యోతిరావ్ పులే, సావిత్రీబాయి దంపతులు చేసిన కృషి అద్భుతమైనది. అలాంటి గొప్ప సంస్కర్తల జీవిత చరిత్రను మనవాళ్లకు తెలియజెప్పాలనే 'ఫులే' సినిమాని తెలుగులోకి తీసుకొస్తున్నాం'' అన్నారు పొన్నం రవిచంద్ర. ఇప్పుడాయన తెలుగులో విడుదల చేయనున్న ఈ చిత్రాన్ని అనంత్ మహదేవన్ తెరకెక్కించారు. ప్రతీక్ గాంధీ, పత్రలేఖ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వీక్షించారు. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో థాంక్స్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ.. "ఈరోజు ఆడబిడ్డలు చదువుకుని గొప్ప స్థాయికి వెళ్తున్నారంటే ఎన్నో ఏళ్ల క్రితం పులే దంపతులు చేసిన కృషి కారణం. సమాజ హితం కోసం జీవితాల్ని అంకితం చేసిన వారిద్దరూ ఎన్నో దురాచారాల్ని రూపుమాపేందుకు పోరాటం చేశారు. వితంతు పునర్వివాహాల్ని జరిపించారు. అందుకే వాళ్ల కథను మన వాళ్లకు చూపించాలని ఈ సినిమాని తెలుగులోకి తీసుకొస్తున్నా. ఇది హిందీ అనువాదమైనా ఎక్కడా ఆ ఫీల్ కలగదు. తెలుగు చిత్రంలాగే ఉంటుంది. ఇది ప్రతి ఒక్కరిలో సేవా స్ఫూర్తిని కలిగిస్తుంది. ప్రస్తుతం సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు.

వేసవిలో రాకాస



సంగీత్ శోభన్

విజయవంతమైన 'కమిటీ కుర్రోళ్ళు' తర్వాత నిహారిక కొణిదెల తన నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై జీ స్టూడియోస్‌తో కలిసి రూపొందిస్తున్న చిత్రం... 'రాకాస'. సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. నయన్ సారిక కథానాయిక. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఉమేశ్ శర్మతో కలిసి నిహారిక నిర్మిస్తున్న ఈ సినిమాని వేసవి సందర్భంగా ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఆ విషయాన్ని గురువారం టైటిల్ మోషన్ పోస్టర్‌ని విడుదలతోపాటు ప్రకటించింది చిత్రబృందం. "ఫాంటసీ కామెడీ కథతో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఒక పాట, నాలుగు రోజుల టాకీ భాగం మినహా చిత్రీకరణ పూర్తయింద''ని సినీ వర్గాలు చెప్పాయి.



మా అమ్మలాగే ఆ పిల్లల్ని ప్రేమిస్తున్నా!

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.net లో



జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, ఈయూ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ చిన్ని, పొడపాటి తేజస్వి, నూకసాని బాలాజీ



తరలివచ్చిన ప్రజానీకం


ఆనందాల వెల్లువ.. కావలసినంతోయ్!

కృష్ణా తీరంలో ఆహ్లాద కెరటాలు..


ఆవకాయ్-అమరావతి ఉత్సవాలకు శ్రీకారం



కృష్ణమ్మకు హారతులు



వెయ్.. చిందెయ్..





అంబరమే మురిసేలా..

వీనుల విందు..

కృష్ణా నదీ తీరంలో 'ఆవకాయ్-అమరావతి' వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్తు దీపాల వెలుగులతో పున్నమిఘాట్ కొత్త శోభ సంతరించుకుంది. పిల్లలు, పెద్దలు కలిసి.. భారీగా తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. జామర్స్ లైవ్ బ్యాండ్ ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సినిమా పాటలతో వీక్షకులను ఉర్రూతలూగించారు. భారీ తోలుబొమ్మల సయ్యాట, డప్పు వాయిద్య కళాకారుల ప్రదర్శనలతో పండగ వాతావరణం నెలకొంది. ప్రారంభ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అతిథులకు పర్యాటకశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారుల నగాడా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన కృష్ణా హారతిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజాప్రతినిధులంతా కలిసి తిలకించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి పరిశీలించి హౌస్ బోట్‌లను ప్రారంభించారు. **- ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి**
- భవానీపురం, న్యూస్‌టుడే



ప్రతి నగరంలోనూ పర్యాటక ఉత్సవాలు

అభివృద్ధి, సంక్షేమంతో పాటు సినిమా, సంస్కృతి, కళలను కూడా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సర్క్యూట్ ఆఫ్ మనీ ఉండాలంటే పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలోనే చెప్పారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకే 'ఆవకాయ్.. అమరావతి' వేడుకలు నిర్వహిస్తున్నాం. వైజాగ్‌లో బీచ్ ఫెస్టివల్, విజయవాడలో అమరావతి ఉత్సవ్ ఇప్పటికే నిర్వహించాం. రాష్ట్రంలోని ప్రతి నగరంలోనూ ఇలాంటి ఉత్సవాలు నిర్వహిస్తాం. కృష్ణమ్మకు జలహారతిని మళ్లీ 2019 తర్వాత ఇప్పుడు ఆరంభించాం. **-కేశినేని శివనాథ్, ఎంపీ**



నేనొచ్చేశా.. నవ్వించేశా..



పర్యాటకంలో రూ.19వేల కోట్ల పెట్టుబడులు

పర్యాటక రంగంలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలపాలని ప్రయత్నిస్తున్నాం. టూరిజం పాలసీ తీసుకొచ్చాం. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో ఒక్క పర్యాటక రంగంలోనే రూ.19 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. ఇప్పటికే చాలా మంది పనులు ప్రారంభించారు. పర్యాటకశాఖ హోటళ్లు రూ.20కోట్ల లాభాల్లో నడుస్తున్నాయి. ఎక్కడ వీలైతే అక్కడ హౌస్ బోట్లు, ఫ్లోటింగ్ బోట్లు నడుపుతాం.
-నూకసాని బాలాజీ, ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్



ఫ్లెమింగో.. తోలుబొమ్మలాట



ముచ్చటైన బొమ్మ.. మురిపించెనమ్మ..



ఆహార స్టాళ్ల వద్ద సందడే సందడి...

స్వచ్ఛంద సేవకుల పాత్ర ప్రశంసనీయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ దర్శనానికి వస్తున్న భక్తులకు పలువురు సేవకులు లాభాపేక్ష లేకుండా సేవలు అందిస్తున్నారు. ఆన్‌లైన్ కౌంటర్లు, అన్నప్రసాద పంపిణీ, ఆలయ ప్రాంగణం, కానుకల లెక్కింపు, క్యూలైన్ల వద్ద సేవలు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. క్యూలైన్లు, లిఫ్టుల వద్ద వారు భక్తులను క్రమ మార్గంలో పంపించడం, దేవస్థానం అందిస్తున్న సేవలపై అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం పని చేస్తున్న సేవకులకు సీవీ రెడ్డి ఛారిటీస్‌లో వసతి కల్పించడంతోపాటు వారు ఆలయ ప్రాంగణం చేరడానికి ప్రత్యేకంగా దేవస్థానం బస్సు సౌకర్యం ఉందన్నారు. స్వచ్ఛంద సేవ చేయడానికి వచ్చే భక్తులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్లో https:///durgamalleswaraswamy.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


చేజారితే ప్రమాదం.. తిరిగొస్తుందా ప్రాణం..



కదులుతున్న బస్సులో పుట్‌బోర్డు ప్రయాణం ఎంతో ప్రమాదకరమైంది. కొందరు విద్యార్థులు, యువత ఏమాత్రం భయం లేకుండా వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. రద్దీ సమయాల్లో ఆయా మార్గాల్లో సిటీ బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు.
-ఈనాడు, అమరావతి

అక్షర నిధి.. అపూర్వమది!

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడ పుస్తక మహోత్సవం.. ఏడో రోజైన గురువారం భారీగా తరలివచ్చిన పుస్తక ప్రేమికులతో సందడిగా సాగింది. జనవరి 2న ప్రారంభమైన పుస్తక ప్రదర్శన 12తో ముగియనుంది. ముగింపు సమయం దగ్గర పడుతుండటంతో పుస్తక ప్రియులు అధికంగా వస్తున్నారు. మిగిలిన అయిదు రోజుల్లో మరింత మంది వచ్చే వీలుంది. ప్రతి స్టాల్ వద్ద.. తమకు నచ్చిన పుస్తకం కోసం సందర్శకులు వెతుకుతున్నారు. అందుబాటులోని పుస్తకాల్లో పేజీలు తిరగేసి.. తమ అభిరుచికి తగిన వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో వృత్తాకారంలో 200కు పైగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో భక్తి, చరిత్ర, ఆరోగ్య తదితర అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట ఉండటంతో ఆసక్తిగా తిలకించారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తదితరులు

పెద్ద పండక్కి..

ప్రయాణం ప్రయాసే!

హైదరాబాద్‌కు అరకొరగా బస్సుల కేటాయింపు

ఈనాడు, అమరావతి

పెద్ద పండగ కోసం పొరుగు రాష్ట్రాల నుంచి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. అధికారులు అరకొరగానే బస్సులు కేటాయిస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, మచిలీపట్నం వచ్చే వారు అధికంగా ఉన్నా బస్సులు ఆ స్థాయిలో లేవు. దీంతో ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేలా లేవు.

35 బస్సులతో ఎలా..?

★ సంక్రాంతి అంటే హైదరాబాద్ నుంచి జనం పోటెత్తుతారు. కొన్నేళ్ల కిందట దాదాపు 150 ప్రత్యేక బస్సులు నడిపేవారు. ఇటీవల వరకు 18 బస్సులే కేటాయిస్తున్నట్లు అధికారులు చెప్పుకొచ్చారు. గురువారం ఆ సంఖ్య కొద్దిగా పెంచి 24 కేటాయిస్తున్నట్లు చెబుతున్నారు. చెన్నై, బెంగళూరుకు ఐదారు సర్వీసులే ఉన్నాయి. ★ హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వచ్చేవారి కోసం 11 కేటాయించారు. రెండేళ్ల కిందట వరకు 70 బస్సులు నడిపేవారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 35 బస్సులతో సంక్రాంతిని సర్దేయాలన్నది ఆర్టీసీ అధికారుల ఆలోచన. ★ టీఎస్‌ఆర్టీసీ నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు కేటాయిస్తున్నారు. కానీ ఏపీఎస్‌ఆర్టీసీ కంటే టీఎస్‌ఆర్టీసీ టిక్కెట్ల రేటు 50శాతం అదనం. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఏపీఎస్‌ఆర్టీసీలో టికెట్ రేటు రూ.450 ఉంటే టీఎస్‌ఆర్టీసీలో రూ.675.
★ ఉన్న బస్సుల్లో ఎక్కువ హైదరాబాద్‌కు కేటాయిస్తే పండగకు వచ్చే అంతర్రాష్ట్ర ప్రయాణికులకు, స్త్రీ శక్తి పథకం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పవన్న కోణంలో అధికారులు ఉన్న బస్సులు సర్దుబాటు చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర.. రాయలసీమ ఫుల్

★ జనవరి 9, 10 తేదీల నుంచి సెలవులు మొదలవుతున్న నేపథ్యంలో 9 నుంచి 12వ తేదీ వరకు వైజాగ్‌కు 37 బస్సులు, రాయలసీమకు 33 బస్సులు కేటాయించారు. ★ ఈ బస్సుల్లో గురువారానికే రిజర్వేషన్లు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు వెళ్లేవారి కోసం మరిన్ని బస్సులు కావాల్సి ఉంది. రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన విద్యార్థులు, వివిధ పనుల కోసం వలస వచ్చిన వారు విజయవాడలో ఎక్కువగా ఉన్నారు.
★ 'డిమాండ్‌ను బట్టి స్థానిక సర్వీసులు పెంచుతాం. రాష్ట్రం నలుమూలలకు విజయవాడ నుంచి రిజర్వేషన్ లేకుండా తిరిగే బస్సులు కూడా ఉన్నాయి. హైదరాబాద్ బస్సుల విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తా' అని పీఎన్‌బీఎస్ డిప్యూటీ సీటీఎం సూర్యపవన్‌కుమార్ తెలిపారు.

10న సిద్ధార్థ స్వర్ణోత్సవాలకు సీఎం చంద్రబాబు రాక

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాలను ఈ నెల 10న మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



విజేతలతో ప్రిన్సిపల్ వంశీకిరణ్, పద్మజ సుజుకీ ఏవో మీనా కేతన్, డైమండ్ నెస్ట్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, అధ్యాపకులు



ముగ్గులకు రంగులు అద్దుతున్న విద్యార్థినులు


కంచికచర్ల, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనాడు-ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో గురువారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. రంగు రంగుల ముగ్గులతో కళాశాల ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నేటితరం విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా 'ఈనాడు' ఆధ్వర్యంలో ఇటువంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ టి. వంశీ కిరణ్ అన్నారు. విద్యార్థినులు పి. జయశ్రీ- జి. దివ్యశ్రీ (మొదటి), ఆర్. సౌమ్య- ఎ. రీతిక (ద్వితీయ), బి. సింధు- వి. సులోచన (తృతీయ) బహుమతులు సాధించారు. విజేతలకు పద్మజ సుజుకీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. మీనాకేతన్, డైమండ్ నెస్ట్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ టి. వంశీకిరణ్‌లు బహుమతులు అందజేశారు. మిగిలిని విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా డైమండ్ నెస్ట్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజా సుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించారు.

91.9 Mee FM VIJAYAWADA

క్రెడిట్ కార్డులు హ్యాక్ చేసి లావాదేవీలు

రెండు రోజుల్లో రూ.2.37 లక్షలు మాయం

విజయవాడ నేరవార్తలు: ఒక ఉద్యోగికి తెలియకుండా అతని క్రెడిట్ కార్డుల ద్వారా రూ. 2.37 లక్షల లావాదేవీలు నిర్వహించినట్లు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేటలో పని చేసే ఒక ప్రభుత్వ ఉద్యోగికి రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ఈ నెల 5, 6 తేదీల్లో ఆయనకు తెలియకుండానే లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీనిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్ ద్వారా అతని చరవాణిని హ్యాక్ చేసి, క్రెడిట్ కార్డుల సమాచారం తస్కరించి లావాదేవీలు జరిపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను (ఐపీఈ)-2026 విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వొకేషనల్ ప్రయోగ పరీక్షలు, ఫిబ్రవరి ఒకటి నుంచి పదో తేదీ వరకు సాధారణ ప్రయోగ పరీక్షలు, ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 36,734 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 39,534 మంది.. మొత్తం 76,268 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఇందుకు 98 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, స్టోరేజ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పరీక్ష పత్రాల తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బందోబస్తు, భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.

'నో సెల్ ఫోన్ జోన్'గా పరీక్ష కేంద్రాలు : అన్ని పరీక్షా కేంద్రాలు 'నో సెల్ ఫోన్ జోన్'గా ఉంటాయని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్తు ఉండేలా చూడాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. [illegible] జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.ప్రభాకరరావు, [illegible] తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా పోలీస్ వ్యవస్థ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినుల చెక్క భజన నృత్యం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మహిళలు భయపడవద్దని రక్షణగా పోలీస్ వ్యవస్థ ఉందని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. వివిధ రూపాల్లో నేరాలు చేసే వారికి కఠినమైన శిక్షలుపడే వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మహిళా ఫెస్ట్ గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకే విద్యార్థినులు, మహిళలు తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. మహిళల కంటే పురుషుల్లో ఆత్మహత్యల శాతం ఎక్కువగా ఉందని, వీటికి ప్రధాన కారణం ఆర్థిక సమస్యలేనన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తరుణీ తరంగాలు ఉపాధ్యక్షురాలు విద్యాకన్నా మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలతో పోలిస్తే మహిళల్లో అక్షరాస్యత శాతం గణనీయంగా పెరిగిందని, అంతరిక్షంలో దూసుకుపోతున్నారని ఇది మహిళాభివృద్ధికి సంకేతమన్నారు. అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచంటి సునీత, తరుణీ తరంగాల అధ్యక్ష, కార్యదర్శులు రావి శారద, డి. రమాదేవి, వి.శ్రీదేవి, ఉషారాజా, [illegible] అనీషా, సరోజ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు, బృందగానం, కోలాటం, బెస్ట్ ఫర్ వేస్ట్ పోటీల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

అంబులెన్స్ డ్రైవర్ల సేవలు అమూల్యం



జెండా ఊపి అంబులెన్స్‌ల ప్రదర్శన ప్రారంభిస్తున్న సీపీ రాజశేఖరబాబు. పక్కన ఆసుపత్రి ప్రతినిధులు

సీతారాంపురం, న్యూస్‌టుడే : అత్యవసర స్పందన వ్యవస్థలో అంబులెన్స్ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమైనదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు పేర్కొన్నారు. ప్రపంచ అంబులెన్స్ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రి వారు నగరంలోని అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లను గౌరవిస్తూ సీపీ కార్యాలయం వద్ద అభినందన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అత్యవసర వైద్య సేవల్లో.. ప్రజల ప్రాణాలను కాపాడడంలో వారి పాత్ర అమూల్యమని కొనియాడారు. రోగులు, ఆసుపత్రుల మధ్య వారధిలా పని చేస్తారన్నారు. ట్రాఫిక్‌ను చాకచక్యంగా దాటడం, వేగంగా స్పందించడం, ఒత్తిడిలోనూ శాంతంగా ఉండడం వల్ల రోగుల ఆరోగ్య ఫలితాలు మెరుగవుతాయన్నారు. మణిపాల్ ఆసుపత్రి డైరెక్టర్ జె. రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ కేర్.. హాస్పిటల్‌లో కాదు, అంబులెన్స్‌లోనే మొదలవుతుందన్నారు. కఠిన పరిస్థితుల్లోనూ అలసట లేకుండా పనిచేసే డ్రైవర్లు, ఓనర్లు నిజమైన ప్రాణరక్షకులని కొనియాడారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, క్యాజువాలిటీ వైద్యాధికారి డాక్టర్ శ్రీచరణ్ మాట్లాడుతూ.. సమన్వయంతో కూడిన అత్యవసర సేవల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం సీపీ రాజశేఖరబాబు జెండా ఊపి అంబులెన్స్‌ల ప్రదర్శన ప్రారంభించారు.

రైల్వే సిబ్బందిపై దాడులు చేస్తే కేసులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ఉన్న రైల్వే సిబ్బందిపై దాడులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల రైల్లో ఒక టీటీఈపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతి రోజూ లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చడమే రైల్వే శాఖ ముఖ్య లక్ష్యమని చెప్పారు. సిబ్బందిపై దాడి చేస్తే రెండేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. రైలు ప్రయాణంలో తనిఖీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ★ టికెట్ చెకింగ్ సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు డీఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

వెనకబడిన తరగతులకు రక్షణ ఛత్రం కావాలి



కాలమానిని విడుదల చేస్తున్న ఎంపీ కృష్ణయ్య, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

విజయవాడ (విద్యాధరపురం), న్యూస్‌టుడే: బీసీ అట్రాసిటీ చట్టం వెనకబడిన తరగతులకు రక్షణ ఛత్రం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం నిర్వహించిన 20వ రాష్ట్ర మహాసభలో నూతన సంవత్సర డైరీ, కాలమానిని విడుదల చేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. వెనకబడిన తరగతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ అట్రాసిటీ చట్టం తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న వెనకబడిన తరగతులు కులాల వారిగా విడిపోవడం వల్ల డిమాండ్ల సాధనకు ఆటంకంగా మారిందన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన అవరోధాలను అధిగమించేందుకు చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు ఐకమత్యంగా సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ల మాదిరిగా ఆన్ డ్యూటీ (ఓడి)ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్, రాజయ్య, మురళీ మోహన్, పూర్ణచంద్రరావు, నాగరాజు, రామారావు, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.



వంకాయలు-18/20, టమాటా-30, బెండ-34, పచ్చిమిర్చి-28, కాకర-45, బీర-30/34, క్యాలీఫ్లవర్-25/30, క్యాబేజి-22, క్యారెట్-36, దొండ-36, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-32, దోస-30/38, సొర-15/20, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-10/12, ఆకుకూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-30, కీరదోస-30, బీన్స్-56, క్యాప్సికమ్-56, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

హోటళ్లకు రేటింగ్ ఇస్తే డబ్బులు!

గృహిణికి సైబర్ నేరగాళ్ల టోకరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'హోటళ్లకు రేటింగ్ ఇస్తే డబ్బులే డబ్బులు. ఇంట్లో కూర్చునే సంపాదించుకోవచ్చు...' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనకు ఆకర్షితురాలైన ఓ మహిళ మోసపోయారు. పెట్టుబడుల రూపంలో రూ. 4.27 లక్షలు పోగొట్టుకున్నారు. కొండపల్లికి చెందిన ఓ గృహిణి (32) గత నెల 29న ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. పార్ట్‌టైం ఉద్యోగం పేరిట ఉన్న ప్రకటన చూశారు. దాన్ని క్లిక్ చేయగానే ఒక టెలిగ్రామ్ గ్రూప్‌నకు అనుసంధానమయ్యారు. సభ్యులు పార్ట్‌టైం ఉద్యోగం ఉందని హోటళ్లకు రేటింగ్‌లు ఇస్తే డబ్బులు ఇస్తామనడంతో ఆసక్తి చూపారు. కొన్ని రివ్యూలు రాయగానే.. డబ్బులు రావడంతో ఆకర్షితులయ్యారు. తర్వాత ఎదురు పెట్టుబడులు పెడితే.. మరింత ఆదాయం అని చెప్పేసరికి ఆశపడి వారి మాటలు నమ్మారు. గత నెల 29 నుంచి 31వ తేదీ మధ్య విడతల వారీగా రూ. 4.27 లక్షలు రెండు బ్యాంకు ఖాతాలకు, మరో రెండు యూపీఐ ఖాతాలకు డబ్బులు పంపించారు. వచ్చిన ఆదాయం వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా.. అవి రాలేదు. మోసపోయినట్లు గుర్తించి గురువారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

కొండపల్లిలో ప్రజాదర్బార్ (నేడు)

కొండపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నేడు కొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, పురపాలక, మండల అధికారులు పాల్గొంటారని చెప్పారు. పుర ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

రెడ్డిగూడెం: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ ఆర్.దేవి ప్రవణ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

14,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 14,600 మెట్రిక్ టన్నులు ధాన్యం కొన్నట్లు రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. గత ఏడాది ఖరీఫ్‌లో 11 వేల టన్నులు కొనగా ఇప్పటికే 3600 టన్నులు అధికంగా కొన్నట్లు పేర్కొన్నారు. రుద్రవరం, కుదప, ముచ్చనపల్లి గ్రామాల్లో రైతుల నుంచి కొంటున్నామని, మరో 8 వేల టన్నులు కొనే అవకాశం ఉందని తెలిపారు.



మిట్టగూడెం వద్ద ధాన్యం కాటాలు వేస్తున్న హమాలీలు

ముగిసిన ముగ్గురమ్మల జాతర



నిమ్మకాయలను సూదులతో శరీరానికి గుచ్చుకున్న యువకులు



కొక్కేలు వీపునకు గుచ్చుకుని కారు లాగుతున్న యువకుడు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: కాచవరం శివారు దొనబండలో ముగ్గురమ్మల ఆలయాల ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి దాటాక అమ్మవార్ల జాతర ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భక్తులు వారి ఆచారాల మేరకు పొంగళ్లు తీసుకుని ఆలయాలకు వచ్చి నివేదించడంతో జాతర మహోత్సవం ప్రారంభమైంది. మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త అప్పారావు వేర్వేరుగా కూటమి నాయకులతో కలిసి వచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పరసర గ్రామాల నుంచి వచ్చిన క్వారీ కార్మికులు ఆలయంలో మారియమ్మ, సత్తెమ్మ, కాళాయమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్వారీ కార్మికులు తెలుగు, తమిళ సంప్రదాయాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు నిప్పుల కుండలను తలపై ఉంచుకుని, శరీరానికి సూదులతో నిమ్మకాయలు గుచ్చుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. మరో యువకుడు కారుకు కట్టిన తాళ్ల కొక్కేలను వీపునకు గుచ్చుకుని కారును అమ్మవారి ఆలయం వద్దకు లాగుతూ వచ్చి మొక్కు తీర్చుకోవడం విశేషం. జాతర సందర్భంగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

పైపులైన్ లీకులు.. దాహం కేకలు

జి.కొండూరు, న్యూస్‌టుడే :

వేసవి రాక మునుపే మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తిందని ప్రజలు మండిపడుతున్నారు. పైపులైన్ లీకులతో నీరు ఎగువ గ్రామాలకు వెళ్లడం లేదని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా కృష్ణా జలాల సరఫరా నిలిచి నీటి కోసం ప్రజలు వ్యయ, ప్రయాసలు పడుతున్నారు. చెవుటూరులో దాదాపు 15 రోజులుగా తాగునీరు సరఫరా కాక గ్రామానికి చెందిన వ్యక్తి యేలియ్య ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు.



చెవుటూరులో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న యేలియ్య, బిందెలతో పట్టుకుంటున్న మహిళలు



వెలగలేరులో పైపులైన్ లీకై వృథాగా పోతున్న నీరు

అడుగడుగునా మరమ్మతులే..

జి.కొండూరు మండలంలోని చెరువు మాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు లోయ గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో తాగునీటి కొనాలన్నా సమీపంలో కేంద్రాలు లేక నీటి కోసం జనం అవస్థలు పడుతున్నారు. మండలంలోని కందులపాడు, గంగినేనిపాలెం, ఎర్రుపాలెం (కేజీవై) ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు చేస్తుండటంతో నీటి సరఫరా నిలిచిందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు పైపులైన్ గ్యాపులు ఎక్కువ ఉండటంతో చెవుటూరు గ్రామానికి నీటి సరఫరా నిలిచిందని చెబుతున్నారు. వెలగలేరు నుంచి నూజివీడు వైపు వెళ్లే పైపులైన్ వెలగలేరు, కోడూరు తదితర గ్రామాల్లో ప్రధాన రహదారి వెంబడి లీకై నీరంతా వృథాగా పోతోందని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో వెలగలేరు హైస్కూల్ పక్కనే ఉన్న కాలనీవాసులు తాగునీటి కోసం వెతలు పడుతున్నారు. సమస్యపై ఏఈ దయానంద్‌ను అడుగగా రూ.1.10 కోట్లు పైపులైన్ మరమ్మతులకు మంజూరయ్యాయని.. మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏవో శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు

అందుబాటులో 110 మెట్రిక్ టన్నుల యూరియా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలో గ్రామాల్లో 110 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పీఏసీఎస్ సిబ్బంది సమ్మెలో ఉండటంతో రైతులకు యూరియా పంపిణీ ఆగడంతో రుద్రవరం, కూనపరాజుపర్వ పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.సాంబశివరావు, ఆర్.వెంకటేశ్వరరావుతో మాట్లాడి గురువారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏవో చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అల్లుకున్నాయ్.. అంతరాయం కలిగిస్తున్నాయ్

విద్యుత్తు స్తంభాలకు, తీగలకు పిచ్చి మొక్కలు తీగలు అల్లుకున్నా విద్యుత్తు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గుంటుపల్లి ఉప కేంద్రం నుంచి వ్యాగన్ వర్క్‌షాపునకు విద్యుత్తు సరఫరా చేస్తున్న స్తంభాలపై తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. వీటి వల్ల సరఫరాకు ముప్పు పొంచి ఉంది. ఇప్పటికైనా పిచ్చి మొక్కలు తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే ఇబ్రహీంపట్నం గ్రామీణం

సెమీ ఫైనల్స్‌కు కబడ్డీ జట్లు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు గురువారం సెమీ ఫైనల్స్‌కు చేరాయి. పోటీలను తెదేపా నాయకుడు బొమ్మసాని సుబ్బారావు ప్రారంభించారు. విజయనగరం, ఇబ్రహీంపట్నం పురుష, మహిళా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

అసంపూర్తి నిర్మాణాలు.. ఆకతాయిలకు అడ్డాలు

అసంపూర్తి నిర్మాణ భవన ప్రాంతాలు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. మండలంలోని చంద్రగూడెంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ స్థలంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలను ప్రారంభించి, శ్లాబ్ వేశారు. అనంతరం బిల్లులు రాక పనులు ఆపారు. అప్పటి నుంచి పిచ్చిచెట్ల మాటున ఉన్న భవన ప్రాంతాన్ని కొందరు అడ్డాగా మార్చుకుని అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారు. అక్కడే మద్యం తాగి సీసాలు పగలగొడుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు విసిరేస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మైలవరం



భవనాల వద్ద మద్యం సీసాలు, వ్యర్థాలు

కూటమి ప్రభుత్వ పాలనలో రహదారుల అభివృద్ధి

గంపలగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులు అభివృద్ధికి నోచుకున్నాయని శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు కూడా ప్రజలు సుఖంగా ప్రయాణించేందుకు వీలుగా రహదారుల నిర్మాణాలకు నిధులకు కేటాయించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గంపలగూడెం మార్కెట్ యార్డు నుంచి గుళ్లపూడి వరకు 6.8 కి.మీ దూరం తారురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా.. పనులకు గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తిరువూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పలు రహదారుల మరమ్మతులు, నిర్మాణాలు చేశారని వివరించారు. ఆర్అండ్‌బీ డీఈ రోజాకుమారి, ఏఈ ఒ.అచ్చారావు, గుత్తేదారు పి.రవిచంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు. సంక్రాంతి తర్వాత తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.



రోడ్డు నిర్మాణ పనులకు టెంకాయ కొట్టిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

రహదారి నిర్మాణానికి భూమిపూజ.. తిరువూరు : పట్టణం నుంచి అక్కపాలెం గ్రామాన్ని కలిపే రహదారి పనులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ రోడ్డు 6 కిలోమీటర్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

తిరువూరు న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 21 విడతలుగా 25.23 కోట్ల విలువైన చెక్కులు అందజేసినట్లు చెప్పారు.

ప్రగతి కోసం సైన్స్ అనేదే నినాదం

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రగతి కోసం సైన్స్ అన్న నినాదంతో 37 ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక విస్తృతంగా విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తోందని జవివే జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ అన్నారు. కొండపల్లి పట్టణ శాఖ జవివే సమావేశం స్థానిక మోహనరావు మెమోరియల్ ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను తరిమివేయాలన్న ఉద్దేశంతో మారుమూల గ్రామాల్లో విజ్ఞానపరమైన కార్యక్రమాలను జవివే నిర్వహిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఆధునిక సైన్స్ ఫలాల పట్ల అవగాహన కలిగించేందుకు పాఠశాలల్లో వైవిధ్యమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వైద్యుడు మామడి సీతారామయ్య మాట్లాడుతూ మూఢ నమ్మకాలు- ఆధునిక విజ్ఞానం పట్ల విద్యార్థుల్లో ఆలోచన కలగాలన్నారు. విద్యార్థులను ఉద్దేశించి అనేక కార్యక్రమాలు రూపొందించి జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జవివే 2026 కాలమానినిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, నాగరాజు, ఎలమందయ్య, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న కొండపల్లి శాఖ సభ్యులు

కరాటే పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ప్రతిభ చూపిందని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షేక్ ఖాశింషా తెలిపారు. మహిళా విభాగం అండర్- 21లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న షేక్ షాఫియా బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ చూపడం సంతోషంగా ఉందని, ఆమె విజయం ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థినిని అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం.. కాలువల్లో పూడికతీత పనులు ✦ స్థానిక సప్తగిరి బ్యాంకు సమీపంలోని కాలువలో పూడిక ఏర్పడి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు సిబ్బందితో కాలువలో పూడిక తొలగించి మురుగు పారేందుకు చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

అమరావతి పనులు చూసి ఓర్వలేని జగన్

గొల్లపూడి, న్యూస్‌టుడే : అమరావతిలో చేస్తున్న పనులను చూసి వైకాపా అధినేత జగన్ ఓర్వలేక పోతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. అమరావతిపై ఏళ్ల పాటు సాగించిన విష ప్రచారానికి, చేసిన విధ్వంసానికి ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో మార్పు రాలేదన్నారు. ప్రస్తుతం తిరిగి మళ్లీ విష ప్రచారానికి తెరలేపారని.. ఆయన వ్యవహారశైలితో వైకాపా ప్రతిష్ఠ స్థానికి కూడా పనికి రాదని తేలిపోయిందని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక సంస్థలు [illegible] ఇక్కడే ఉద్యోగాలు చేసుకునేలా పరిస్థితి వచ్చిందన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో పనులను ఆపలేరని వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా అభ్యర్థులు దొరకని దుస్థితికి వైకాపా చేరుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదని ఆయన పేర్కొన్నారు.



సాధించిన బహుమతులతో విద్యార్థులు

విజేతలకు బహుమతులు

మైలవరం, న్యూస్‌టుడే : జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వక్తృత్వ, నృత్య, పాటల పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, కో- ఆర్డినేటర్లు సాయి విజయ్, సత్యనారాయణ, శివకృష్ణ, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దులపర్వ ఆదర్శ పాఠశాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాలను రాష్ట్ర సెక్టోరియల్ అధికారి బి.కిశోర్‌బాబు, జిల్లా సమన్వయకర్త అశోక్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో పాల్ ల్యాబ్ సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంఈవో పి.రమేష్ బాబు, పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బరి తెగిస్తున్నారు

కోడి పందేలకు రంగం సిద్ధం

తిరువూరు నియోజకవర్గంలో బరుల ఏర్పాటు

న్యూస్‌టుడే, తిరువూరు

తిరువూరు నియోజకవర్గంలో కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. పండగల సమయం దగ్గర పడుతున్న గ్రామాల సరిహద్దులు, పొలాలు, తోటలను కేంద్రంగా చేసుకుని కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెరపై నిర్వాహకులు ఉంటారైతే.. తెర వెనుక సూత్రధారులు మరొకరున్న ఆరోపణలు ఉన్నాయి. ముందుగానే బరులకు స్థలాల ఎంపిక, బరి ఏర్పాటు పనులు కీలక వ్యక్తుల ఆధ్వర్యంలో కొన్ని నెలలకు ముందుగా చేస్తున్నారు. కోడి పందేల మాటున జూద క్రీడలకు తెర లేపుతున్నారు. వీటి చాటున పేకాట, గుండాట, మద్యం సరఫరా వంటివి ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో బెట్టి రేటు మారుతుంది. తిరువూరు పట్టణంలో మూడు కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి. తిరువూరు, కాకర్ల, మల్లేల, విస్సన్నపేట, తాతాకుంట్ల (కార్పొరేట్ రేంజ్) గ్రామాల్లో, ఎ.కొండూరు మండలంలోని పెద్ద బరులు ఏర్పాటు చేశారు. గంపలగూడెం మండలంలో నెమలి, ఊటుకూరు, కొణిజర్ల, వినగడప, గంపలగూడెం గ్రామాల్లో అన్ని చోట్ల ఇదే తరహాలో ఆధునిక హంగులతో బరులు సిద్ధం చేశారు. పగలు రాత్రి తేడా తెలియకుండా జనరేటర్లు, ఎల్ఈడీ లైట్లు, తిరునాళ్లను మించి అన్ని హంగులతో ఏర్పాట్లు సిద్ధం చేశారు. అధికారులు మాత్రం ఇవన్నీ తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.



తిరువూరులో గురువారం సిద్ధం చేసిన ఓ బరి

కొనసాగుతున్న ఉద్యోగుల రిలే దీక్షలు

జి.కొండూరు, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు తీర్చాలంటూ రాష్ట్ర సహకార యూనియన్ పిలుపు మేరకు జి.కొండూరు కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మండల సహకార సంఘాల సిబ్బంది గురువారం చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరింది. ప్రభుత్వం స్పందించి నినాదాలు చేస్తూ దీక్షలో కూర్చున్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జి.కొండూరు సహకార సంఘ కార్యదర్శి నాగరాజు, కుంటముక్కల కార్యదర్శి సీహెచ్ కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు తీర్చాలంటూ ఇబ్రహీంపట్నంలో సంఘ సభ్యులు చేస్తున్న దీక్ష గురువారానికి నాలుగో రోజుకు చేరింది. దీక్షలో ఇబ్రహీంపట్నం, మూలపాడు, గుంటుపల్లి, మూలపాడు సహకార సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చే వరకు దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

గంపలగూడెం, ఎ.కొండూరు: గంపలగూడెం, ఎ.కొండూరు మండలం కంభంపాడు సహకార బ్యాంకుల వద్ద ఆందోళన చేశారు.



జి.కొండూరులో దీక్షలో సంఘ నేతలు

ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దని ఎమ్మెల్యేకి వినతి

తిరువూరు, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఉపాధి హామీ పథకం మౌలిక స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని సీపీఎం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నేత సీహెచ్ వెంకటేశ్వరరావు, నేతలు విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తిరువూరు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు టి.కృష్ణయ్య, నాగుల్ మీరా, ఎం.ఉదయ్, సుభాని, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విస్సన్నపేట: మండల కేంద్రం విస్సన్నపేట [illegible] విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం కనుల పండువగా నిర్వహించారు. సంప్రదాయం ఉట్టిపడేలా పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన గాలిపటాలు ఎగురవేశారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు, వేశారు. పండగ విశిష్టత తెలిపేలా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక నృత్య రూపకాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన తెదేపా నాయకుడు అనుమోలు శివాజీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కుటుంబానికి వితరణతో మిఠాయిలు, బూందీ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎర్రా రత్నాకర్, పాఠశాల గురువులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు దరఖాస్తు పుస్తకాల పంపిణీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు ఎస్టీయూ జిల్లా శాఖ క్యాలెండర్లు, మండల శాఖ తరఫున సెలవు దరఖాస్తు పుస్తకాలను ఉపాధ్యాయులకు గురువారం పంపిణీ చేసినట్లు రెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షుడు బి.అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వై.మోహన్ కృష్ణ, వై.పిచ్చియ్య, పి.ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు, పవన్ కుమార్, వీరారెడ్డి, క్రాంతి, ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళ నేత్రాలు దానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో గురువారం కుందా కళావతి (55) మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి చొరవతో నేత్రదానం ఆవశ్యకతను వివరించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నిపుణులు ఆమె కళ్లలోని కార్నియా సేకరించి తీసుకెళ్లారు.



కె.కళావతి (పాత చిత్రం)

పూర్ణయ్యకు ఎమ్మెల్యేల నివాళి

చింతలనర్వ (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని చింతలనర్వలో ఇటీవల మృతి చెందిన వృద్ధుడు యనమద్ది పూర్ణయ్య చిత్రపటానికి విజయవాడ తూర్పు, తిరువూరు ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గురువారం నివాళి అర్పించారు. ఆయన కుమారులు మాజీ సర్పంచి నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోసవీడు మాజీ సర్పంచి మృతికి సంతాపం

గోసవీడు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడుకు చెందిన మాజీ సర్పంచి గద్దల సామేలు (74) గురువారం మృతి చెందారు. పాతికేళ్ల క్రితం ఆయన సర్పంచిగా బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్.స్వామిదాసు, మాజీ సర్పంచి కె.రజనీకాంత్ తదితరులు సామేలు మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోదా రంగనాథులకు ముత్యాల హారతి



గోదాదేవికి పూజలో మహిళలు

గంపలగూడెం, ఎ.కొండూరు: ధనుర్మాసం సందర్భంగా గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదా రంగనాయకులకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం గంపలగూడెం శ్రీరామభజన మందిరంలో గోదాదేవికి ముత్యాలహారతి ఇచ్చారు. గోదా అష్టోత్తర శత నామావళి, తిరుప్పావై పాశురాలు పఠించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గోసవీడు, గంపలగూడెంలో భక్తులు నగర సంకీర్తన చేశారు.

గొల్లపూడి : గొల్లపూడి ల్యాంకో కాలనీలోని మహాలక్ష్మి నారాయణస్వామి, గోదాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముత్యాల హారతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎన్.బాలక్ష్మి నరసింహాచార్యులు పూజలు చేశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం : ధనుర్మాసం 24వ రోజు ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోదా రంగనాథులకు ప్రత్యేక హారతులిచ్చారు. వేకువజామున స్వామికి సుప్రభాత సేవ పూజలు నిర్వహించి 24వ పాశురం ఆలపించారు. అనంతరం భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి వివిధ రకాలుగా అలకరించి దేవాలయానికి తీసుకువచ్చి గోదా రంగనాథులకు హారతులు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ

రామచంద్రాపురం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురంలో శివదత్త సాయి మందిరంలో గురువారం భక్తులు లక్ష తులసిపూజ వైభవంగా నిర్వహించారు.

నైపుణ్యాల పెంపునకు శిక్షణ కార్యక్రమాలు దోహదం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట వికాస్ డిగ్రీ కళాశాలలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సర్టిఫికెట్ కోర్సుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో 65 మంది డిగ్రీ విద్యార్థులు పాల్గొని, సైబర్ భద్రతకు సంబంధించిన ఆధునిక అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.నర్సిరెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీకి ఉన్న ప్రాధాన్యం వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. ఐ.సి.టి. అకాడమీ ట్రైనర్ ఉమైర్ అహ్మద్ శిక్షణ ఇచ్చారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రాయోగిక అంశాలు, రియల్ టైమ్ ఉదాహరణలతో వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. వెలగలేరు గ్రామానికి చెందిన ఆరుమేకల సంజీవరావు (65) భార్య, వివాహమైన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో గ్రామంలో కూలి పనులు చేసేవాడు. గ్రామంలో అప్పుగా ఇచ్చిన సొమ్ము తిరిగి రాకపోవడంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపానికి గురై సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

జూదరులపై కేసు

జి.కొండూరు, న్యూస్‌టుడే : గంగినేని గ్రామ శివారులో గురువారం జూదమాడుతున్నారనే సమాచారంతో జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి పదిమంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 13 ద్విచక్ర వాహనాలు, రూ.18,390 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..

వేంసూరు, న్యూస్‌టుడే: వేంసూరు మండల పరిధిలోని మర్లపాడులో ఓ మద్యం దుకాణం సమీపంలో వ్యక్తి బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఇనగడప గ్రామానికి చెందిన వేముల గోపి(25) అనే వ్యక్తి తనభార్య స్వగ్రామం వేంసూరు మండలం లింగపాలెంలో ఉంటూ తాపీపని చేస్తున్నాడు. బుధవారం రాత్రి మర్లపాడులో మద్యం దుకాణం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు పోస్టు మార్టం అనంతరం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆవకాయ్ అదిరింది..!

అలరించిన సినీ గీతాలు.. తోలుబొమ్మల నృత్యాలు


సీఎం చంద్రబాబు, ఈయూ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్..

ఈనాడు, అమరావతి

విజయవాడలోని పున్నమిఘాట్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆరంభమైన ఆవకాయ్-అమరావతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, సినీ సంగీత విభావరి, తోలుబొమ్మలాట కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కృష్ణానది తీరంలో సాయంత్రం సమయంలో చల్లని గాలులు వీస్తుండగా.. అద్వితీయమైన సంగీతానికి ఆహూతులు తన్మయత్వానికి గురయ్యారు.

అలరించిన మ్యూజికల్ కన్సర్ట్..

తెలుగు సినీ ప్రపంచంలో లక్షల మందిని ఉర్రూతలూగించిన పాత, కొత్త గీతాలను ఆలపించి శ్రోతలను అలరించారు. చెప్పవే చిరుగాలీ.. అంటూ జామర్స్ ఆలపించిన గీతానికి సంగీత ప్రియులంతా స్వరం కలిపారు. ఈ యువ లైవ్‌బ్యాండ్ పాడిన ప్రతి పాటకూ అద్భుతమైన స్పందన ఆహూతుల నుంచి వచ్చింది.



సంగీత హోరు

డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు.. ఆవకాయ్ అమరావతి వేడుకలు ప్రారంభోత్సవం సందర్భంగా.. డప్పు వాయిద్య కళాకారులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


దోశ స్టాల్ వద్ద..

వచ్చే ఆహూతులను ఆహ్వానిస్తూ.. డప్పు కళాకారులు చేసిన ప్రదర్శనలు ఔరా అనిపించాయి. ❖ కార్యక్రమం ఆరంభంలో.. తెలుగు సంప్రదాయ కోలాట నృత్యాన్ని మహిళలు ప్రదర్శించారు.

భారీ తోలుబొమ్మల సయ్యాట..

సాధారణంగా తోలుబొమ్మలంటే చిన్నగా ఉంటాయి. తాజాగా ఆవకాయ్ ఉత్సవాల్లో భాగంగా తీసుకొచ్చిన భారీ తోలుబొమ్మలు.. ఆహూతుల మధ్యలోనే ఉంటూ తమ ప్రదర్శన ఇచ్చాయి. అతిథులను సాదరంగా ఆహ్వానించాయి.

అలరించిన ప్రేమ కథ నాటకం

భవానీపురం, న్యూస్‌టుడే: పున్నమిఘాట్ వద్ద నిర్వహిస్తున్న ఆవకాయ్ అమరావతి కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంటుంది. దీనిలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ప్రేమ కథ సంగీత నాటకంలో యువతి, యువకుడి ప్రేమ కథను నృత్య ప్రదర్శనగా ప్రదర్శించారు. తెలుగు, హిందీ సినిమా ల్లోని పాటలకు నృత్య కళాకారులు నృత్యాలు చేసి అలరించారు. ఆహుతులు చప్పట్లతో తమ స్పందనను తెలియజేశారు. దాండియా నృత్యం ఆకట్టుకుంది.

కృష్ణమ్మకు హారతి..

కృష్ణమ్మకు హారతి కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం పున్నమి ఘాట్ వద్ద నిర్వహించారు. విజయవాడ దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ ఆధ్వర్యంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, అర్చకులు శ్రీనివాసశాస్త్రి సహా పలువురు పండితులు ఈ నదీ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.


పున్నమి ఘాట్‌లో ప్రారంభించిన బోట్ హౌస్


మహిళల కోలాటం


ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు అజయ్‌జైన్, ఆమ్రపాలి, లక్ష్మీశ

నేడు భవానీద్వీపంలో సందడి



ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆవకాయ్ అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి భవానీద్వీపంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ద్వీపంలో వేడుకలను జరుపుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు సిద్ధం చేశారు. ద్వీపంలో రెండు విభాగాల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. ఒకవైపు సమావేశాలు మరో వైపు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని ఉచితంగా బోటులో ద్వీపంలోకి అనుమతించనున్నారు. పున్నమిఘాట్ వద్ద కార్యక్రమాలు కొనసాగనున్నాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

ప్రముఖుల సంభాషణలు.. కథా కాలక్షేపాలు

★ ఉదయం11-11:50 గంటలకు: సినిమాల్లో ప్రతినాయకుడిగా నటించే బాలాజీ విట్టల్‌తో ఎస్. హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్రా సంభాషణ ★ మధ్యాహ్నం 12-12:50 గంటలకు: కథ చెప్పే విధానంలో పరిణామం: భారతీయ పురాణాల ప్రయాణం. ★ మధ్యాహ్నం 1-1:50: కథా కాలక్షేపం. సంగీతం, మాటలతో సార్వత్రిక కథలు ★ మధ్యాహ్నం 2:30-3:20: ఓటీటీ యుగంలో సినిమా ★ సాయంత్రం 3:30 నుంచి 4:20 వరకు: అభిలాష నవల నుంచి సినిమా వరకు వల్లి పద్మాజలితో యండమూరి వీరేంద్రనాథ్, ఎ.కోదండరామిరెడ్డి సంభాషణ

మార్వల్ ఆర్ట్స్‌పై శిక్షణ శిబిరం

★ ఉదయం 11:00-11:50: తుహిన్ ఆదిత్య రాయ్‌తో మార్వల్ ఆర్ట్స్ శిక్షణ ★ మధ్యాహ్నం 12-12:50: ప్రముఖ నగారా వాయిద్యకారులు నథూలాల్ సోలంకితో నగారా శిక్షణ ★ మధ్యాహ్నం 1-1:50: ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు షమీమ్‌తో తోలుబొమ్మల తయారీలో శిక్షణ ★ మధ్యాహ్నం 2:30-3:20: ప్రఖ్యాత ఫ్రెంచ్ నృత్యకళాకారులు గిల్లెస్ చుయెన్‌తో నృత్య శిక్షణ శిబిరం

పున్నమిఘాట్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు

★ సాయంత్రం 5-6గంటలకు: చందన బాల కల్యాణ్ కథక్, ఆధ్యాత్మిక సంగీత విభావరి ★ సాయంత్రం 6:15-6:45: నాటకీయ కథల రస ఐక్యం, వసంతరావు రచించిన కూచిపూడి నృత్యం ★ రాత్రి 7-7:50: కథల శబ్దం: సినిమాల్లో సంగీతం, కవిత్వం.. శ్యామ్ రక్షంద జలీల్‌తో ప్రియ సారయ్యా, శేఖర్, కాసర్ల సంభాషణ. ★ రాత్రి 8-9:45: మెహ్ఫిల్-ఏ-సుకూన్: అనుభూతినిచ్చే ముషైరా అజర్ ఇక్బాల్, ఇక్బాల్ అష్హర్, ఖుష్బీర్ సింగ్ షాద్, డా. సుస్రత్ మెహదీ, పాయల మురళీకృష్ణ, పాపులర్ మెరుతి, సైఫ్ నిజామి, సర్దార్ సలీమ్ ★ రాత్రి 10-11:30: అజ్‌రంగ్ హై-ఏవిజి, నిజామీ బంధు(సంగీత విభావరి)

బిల్లులు ఇప్పించాలని గుత్తేదారుల ఆందోళన


ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గుత్తేదారులు, కార్మికులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ పనులు చేపడుతున్న ఎన్‌సీసీ సంస్థ పొదిమానరాన శాఖ టెర్మినల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు సంస్థ తమకు రూ.కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, వాటిని ఇప్పించాలని టెర్మినల్ నిర్మాణ పనుల్లో భాగస్వాములైన చిన్న, మధ్య తరహా గుత్తేదారులు గురువారం ఆందోళన చేపట్టారు. విమానాశ్రయం ఆవరణలోని ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట న్యాయం చేయాలని నినాదాలు చేశారు. పనులు చేపట్టిన తమకు మూడు నెలలుగా నగదు చెల్లించకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. రావాల్సిన బిల్లులు చెల్లించకుండా కొత్త నిర్మాణ సంస్థకు మిగిలిన పనులు అప్పగించిన ముందుకు సాగనివ్వకుండా అడ్డుకుంటామన్నారు. బిల్లులు వెంటనే ఇప్పించాలని రవాణా, వర్తక, రోడ్డు కటింగ్ తదితర గుత్తేదారులు డిమాండ్ చేశారు. స్పందించిన డైరెక్టర్ రామారావు.. నిర్మాణ సంస్థతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గుత్తేదారులు నిరసన విరమించారు.

జోగి సోదరుల బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

★ ఈనెల 20న తీర్పు వెలువరించనున్న ఎక్సైజ్ కోర్టు

★ ప్రసాద్ బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన న్యాయాధికారి

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్, రాము, దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఎక్సైజ్ కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. తీర్పును ఈనెల 20న ఇవ్వనున్నట్లు న్యాయాధికారి వెల్లడించారు. ★ హాజి, కట్ట రాజు, మిథున్ దాస్, అంత దాస్ బెయిల్ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణ 12కు వాయిదా వేశారు. ★ ఇబ్రహీమ్ శ్రీపతి, కల్పుల కప్పుడి కోసం సిట్ వేసిన పిటిషన్‌పై కౌంటర్ నిమిత్తం 12కు వాయిదా పడింది. ★ అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు, తాటి రంగయ్య, సుదర్శన్, బాలాజీ, అల్లూ బెయిల్ పిటిషన్లపై విచారణ 19కి వాయిదా పడింది. ★ తన భార్య గర్భిణి అని.. ఈ దృష్ట్యా తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని సుదర్శన్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం శుక్రవారానికి వాయిదా పడింది. ★ జోగిష్ శేఖు.. ప్రసాద్ బెయిల్ పిటిషన్లు ఫైల్ చేశారు. నోటీసుల నిమిత్తం 19కి వాయిదా వేశారు.

అంతర్జాతీయ యోగా క్రీడాకారుడికి అభినందన


ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ క్రీడలు: రాంచీలో ఇటీవల జరిగిన 50వ జాతీయ సబ్ జూనియర్, జూనియర్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి, కాంస్య పతకాలు కైవసం చేసుకుని రాష్ట్ర ఖ్యాతి ఇనుమడింపజేసిన దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. ధీరజ్ శ్రీకృష్ణ తన కుటుంబ సభ్యులతో గురువారం నగరంలోని మంత్రి విడిది కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి.. ధీరజ్ శ్రీకృష్ణకు శాలువాకప్పి అభినందించారు. భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతిభగల క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు.

కాలం మారినా.. కమ్యూనిజం, మార్క్సిజం సుస్థిరం


కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం పుస్తక ఆవిష్కరణ చేస్తున్న హరినాథరెడ్డి, శర్మ తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ఏడో రోజు గురువారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై మూడో సభగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ నిర్వహించారు. ప్రపంచంలో పరిస్థితులు ఎంత మారినా కమ్యూనిజం, మార్క్సిజం చిరస్థాయిగా ఉంటాయని వక్తలు అభిప్రాయపడ్డారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆర్వీ రామారావు రచించిన 'శత వసంతాల అరుణ పథం', దేవరాజు మహారాజు రచించిన 'మానవ చరిత్ర ఎక్కడ ప్రారంభమైంది?', నికోలాయ్ ఇవనోవ్ రచించిన 'కార్ల్ మార్క్స్ జీవిత సంగ్రహం' పుస్తకాలను ఆవిష్కరించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి 'శతవసంతాల అరుణ పథం'ను పరిచయం చేస్తూ.. కమ్యూనిస్టులు దేశానికి చేసిన సేవలకు సమగ్ర సమాధానం ఈ గ్రంథంలో ఉందన్నారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎం.వి.ఎస్.శర్మ డా.దేవరాజు మహారాజు రచనలను పరిచయం చేస్తూ.. కార్పొరేట్ యుగంలో శాస్త్ర విజ్ఞానం వాణిజ్యాత్మకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య సి.నరసింహారావు 'కార్ల్ మార్క్స్ జీవిత సంగ్రహం'ను పరిచయం చేస్తూ.. మార్క్సిజానికి వైఫల్యం లేదని, అమలులోనే లోపాలున్నాయని చెప్పారు. విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

ఏపీ ఐకాస రాష్ట్ర కార్యవర్గ సమావేశం నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం నగరంలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్టు ఐకాస ఛైర్మన్, సెక్రటరీ జనరల్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఫిబ్రవరి 5న విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించనున్న ఏపీ ఐకాస నాలుగో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన ప్రచార పత్రాల ఆవిష్కరణ ఉంటుందని వారు పేర్కొన్నారు.

కథల నేర్పరి.. మునిపల్లె రాజు


మాట్లాడుతున్న వీరలక్ష్మి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : పాఠకుల మనసులను సున్నితంగా స్పృశిస్తూ, వారిలోని మానవీయ విలువలను తట్టి లేపేందుకు కథలను సాధనంగా వాడుకున్న నేర్పరి.. మునిపల్లె రాజు అని ప్రముఖ రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మి కొనియాడారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ఏడో రోజు గురువారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంగా మునిపల్లె రాజు శత జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కథా రచన పరంగా మునిపల్లె రాజు సంప్రదాయ అభిమాని అయినప్పటికీ.. వాటిలోని మూలాలను అర్థం చేసుకుని మూఢాచారాలకు వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని చెప్పారు. సభాధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మునిపల్లె రాజు తెలుగు సాహిత్యంపై తనదైన ముద్ర వేసిన రచయిత అని అన్నారు. సాహితీ సంపాదకులు కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ.. ఆధునిక తెలుగు పాఠకులకు మ్యాజిక్ రియలిజం కథన శైలిని పరిచయం చేశారని పేర్కొన్నారు. కొప్పర్తి రాంబాబు కథలు స్వాతంత్ర్యం అనంతర కాలంలోని సామాజిక పరిణామాలను ప్రతిబింబిస్తాయని చెప్పారు.

సినిమాల్లో విజయాలకే విలువ



ప్రసంగిస్తున్న విజయ్‌కుమార్. వేదికపై కోదండరామిరెడ్డి, యండమూరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై ఆఖరి సభగా 'యండమూరి-కోదండరామిరెడ్డి సినీ అనుభవాల జుగల్‌బందీ' కార్యక్రమం నిర్వహించారు. ఎమెస్కో సంస్థ అధినేత విజయ్‌కుమార్ స్వాగతం పలికారు. క్లిష్టమైన అంశాలను సరళంగా, హృద్యంగా చెప్పగల కథాశిల్పం యండమూరి వీరేంద్రనాథ్ ప్రత్యేకత అన్నారు. పాపులర్ నవలలను హిట్ సినిమాలుగా మలిచిన దర్శకుడు కోదండరామిరెడ్డి అని ప్రశంసించారు. ఈ సందర్భంగా యండమూరి, కోదండరామిరెడ్డిలు.. 'అభిలాష' సహా తమ కలయికలో వచ్చిన చిత్రాల అనుభవాలను శ్రోతలతో పంచుకున్నారు. సినిమా విఫలమైతే కొంత బాధ కలిగినా.. త్వరగా తేరుకుంటామని కోదండరామిరెడ్డి తెలిపారు. 'వేట' సినిమా ఫలితం ముందే ఊహించానన్నారు. 'అభిలాష'లోని 'సందెపొద్దుల కాడ సంపెంగ నవ్వింది' పాట మొదట వద్దనుకున్నా.. ఆ తర్వాత సూపర్‌హిట్ అయిందన్నారు. యండమూరి మాట్లాడుతూ.. నవలని సినిమాగా మార్చడాన్ని దర్శకులకు అప్పగించడమే మంచిదన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు వేర్వేరుగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. సినీ రంగంలో కేవలం విజయవాలకే విలువ ఉంటుందని, వైఫల్యాల తర్వాత ఎదురయ్యే పరిస్థితులను కోదండరామిరెడ్డి ప్రస్తావించారు.

విమర్శ లక్ష్యం.. దిశానిర్దేశం



మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి, వేదికపై ప్రతినిధులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై రెండో సభగా 'పాతికేళ్ల సాహిత్య విమర్శ'పై చర్చా గోష్ఠి నిర్వహించారు. ప్రముఖ విమర్శకుడు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ.. సమాజం, సాహిత్యం, సాహిత్య విమర్శలు పరస్పర ఆధారితమని పేర్కొన్నారు. విమర్శ కూడా విమర్శకు నిలబడే స్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. గత పాతికేళ్లలో తెలుగులో సుమారు 500 సాహిత్య విమర్శ గ్రంథాలు వెలువడ్డాయని, మార్క్సిస్టు, విప్లవాత్మక విమర్శ శైలి ఇంకా కొనసాగుతోందని తెలిపారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు సభకు స్వాగతం పలికారు. చినుకు పత్రిక సంపాదకులు నండూరి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. గుంటూరు లక్ష్మీ నరసయ్య ప్రాంతీయ, అస్తిత్వ స్పృహతో వచ్చిన విమర్శలు కొత్త కోణాలను అందిస్తున్నాయని అన్నారు. తెలకపల్లి రవి విమర్శను అర్థం చేసుకోవడం సులభం కాదని, సృజనాత్మక ప్రక్రియను కొలతలతో మాపడం సాధ్యమా అన్నదే ప్రశ్న అని వ్యాఖ్యానించారు.

రచయితలకు చక్కటి అవకాశం వికీపీడియా


పుస్తకావిష్కరణలో నారాయణరావు, కళాసాగర్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రచయితల రచనా శైలిని పెంపొందించుకోవడానికి వికీపీడియా ఒక చక్కటి అవకాశమని జి.ఆర్.కె. పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. గురువారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవలో వికీపీడియా స్టాల్ నిర్వాహకుడు వై.కళాసాగర్ ఆధ్వర్యంలో 'వికీపీడియా గురించి మీకు తెలుసా?' అనే పుస్తక ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం నారాయణరావు మాట్లాడారు. వికీపీడియా ద్వారా మనం రాయాలనుకున్న రచనలను రాయవచ్చని, దీనికి నిర్వాహకులు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణ తరగతులు పూర్తిగా ఉచితమని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ కథాచిత్రమ్..!

ఈనాడు - అమరావతి

పిల్లల విక్రయాలతోనే కుటుంబానికి ఆదాయం

★ ప్రియాంక కుటుంబం అందరిపై దిల్లీలో కేసులు

★ తప్పించుకుని ఉత్తరాఖండ్‌కు పరారైన నిందితురాలు

పిల్లల విక్రయాల ద్వారా వచ్చే సొమ్మే ఆ కుటుంబానికి ఆదాయం.. ఆ డబ్బుతో విలాస జీవితం.. ఒకరు.. ఇద్దరు కాదు.. యావత్ కుటుంబంలో అందరూ విక్రయాల కేసుల్లో నిందితులే.. ఒకరు మినహా అందరూ ప్రస్తుతం జైళ్లలోనే ఉన్నారు.. ఇదీ శిశు అమ్మకాల కేసులో దిల్లీ ముఠా కీలక సూత్రధారి ప్రియాంక కుటుంబ నేపథ్యం. ప్రియాంకను అదుపులోకి తీసుకునేందుకు విజయవాడ నుంచి దిల్లీ వెళ్లిన ప్రత్యేక బృందం.. ఆమె మూలాలు తెలుసుకుని వెళ్లే సరికే త్రుటిలో తప్పించుకుని పరారైంది. నిందితురాలిని పట్టుకునేందుకు నగరం నుంచి మరో బృందం కూడా వెళ్లనుంది.

కుటుంబమంతా జైలులోనే..

ప్రియాంకకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. ఆమె దిల్లీతోపాటు యూపీలోని మీరట్‌లోనూ నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. దిల్లీ సబర్బన్, యూపీలోని శివారు గ్రామాల నుంచి పిల్లల్ని తీసుకుని వివిధ ప్రాంతాల్లోని ముఠాలకు విక్రయిస్తుంది. ఈమెపై దిల్లీలోని పశ్చిమ విహార పోలీసు స్టేషన్, హరియాణాలోని ఫరీదాబాద్ స్టేషన్లతోపాటు విజయవాడలో మూడు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇది ఒక ఎత్తైతే.. ప్రియాంక తల్లి, సోదరి, తమ్ముడిపై దిల్లీలోని బేగంపూర్ స్టేషన్‌లో పిల్లల విక్రయాల కేసులు నమోదయ్యాయి. అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేశారు. తల్లి దేవకి, సోదరి ప్రియ దిల్లీలోని మండాలి జైలులో, సోదరుడు పీయూష్ తీహార్ కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు.

దిల్లీ నుంచి ఉత్తరాఖండ్‌కు..

ఈ కేసులో దిల్లీకి చెందిన కిరణ్‌శర్మ అరెస్టు అయినప్పటి నుంచి ప్రియాంక తప్పించుకు తిరుగుతోంది. దిల్లీలో ఆమె ఇంటికి వెళ్లిన పోలీసులకు.. అక్కడి నుంచి మకాం మీరట్‌కు మార్చినట్లు గుర్తించారు. ఆపై మీరట్ వెళ్లేసరికి గంట ముందు ఆమె, భర్త బయటకు వెళ్లిపోయినట్లు తేలింది. దీంతో ఇంట్లో ఉన్న ఆమె అత్తమామలకు నోటీసులు ఇచ్చారు. నిందితురాలు మీరట్ నుంచి ఉత్తరాఖండ్ పారిపోయినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అక్కడ బృందానికితోడు మరొకటి విజయవాడ నుంచి పంపనున్నట్లు తెలిసింది. పిల్లల అమ్మకాలతో వచ్చే ఆదాయంతో ప్రియాంక విలాస జీవితం గడుపుతోంది. కాలు బయటపెడితే కారు ఉండాల్సిందే. బాయ్‌ఫ్రెండ్స్‌నూ మార్చేస్తుందని దర్యాప్తులో తేలింది. నిందితురాలి బ్యాంకు ఖాతాలు, లావాదేవీలను విశ్లేషిస్తున్నారు.

దొరికిన నూరి ఆచూకీ..

ముంబయి ముఠా కింగ్‌పిన్ అయిన కవిత సహాయకురాలు నూరి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ముంబయి శివారు థానేలో ఉన్నట్లు తేలింది. ఈమెను కూడా ఒకట్రెండు రోజుల్లో అదుపులోకి తీసుకునే వీలుంది. ఈమె రెండు సార్లు పిల్లల్ని తీసుకుని విజయవాడ వచ్చి సరోజినికి అప్పగించింది. కవిత తరఫున నూరి కొరియర్‌గా వ్యవహరించినట్లు తేలింది. ముంబయిలో అరెస్టు అయిన కవితను గురువారం విజయవాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

అంతరాలయ దర్శనంపై నియంత్రణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భక్తుల రద్దీ దృష్ట్యా వారాంతపు సెలవు, ముఖ్య పర్వదినాల్లో అంతరాలయ దర్శనాన్ని నియంత్రిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాలు, పర్వదినాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు అంతరాలయం దర్శనం నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.500 అంతరాలయ దర్శనం టికెట్ల విక్రయాలు ఉండవని తెలిపారు. భక్తులు మార్పులను గమనించి సహకరించాలని కోరారు.

సత్యవర్ధన్‌పై దాడి కేసులో.. నిందితుల బెయిల్ పిటిషన్లపై 12న తీర్పు

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పును 12న వెలువరించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రకటించింది. నిందితులు తేలప్రోలు రాము, రామాంజనేయులు, కొమ్మా కోట్లు, వజ్రకుమార్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై గురువారం వాదనలు ముగిశాయి. వీటిపై తీర్పు సోమవారం వెలువడనుంది. పటమట స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజిని కోర్టు ముందుంచాలని వేసిన పిటిషన్‌పై కూడా వాదనలు పూర్తి అయ్యాయి. దీనిపైనా ఉత్తర్వుల కోసం 12వ తేదీకి వాయిదా వేశారు. గత నెలలో కోర్టు వాయిదాకు హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిన వంశీని సోమవారం కోర్టు హాజరుకు తిరిగి సమన్లు జారీ అయ్యాయి.

ఆ ఇద్దరి ఆచూకీ దొరకలే

★ ఎండీఎంఏ కేసులో గ్రీష్మ, రాజేష్‌ల కోసం గాలింపు

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గుడివాడకు చెందిన గ్రీష్మ దొరికితేనే అసలు సరఫరాదారులు ఎవరనే విషయం వెలుగులోకి వచ్చే వీలుంది. ఈమె నుంచే ఇటీవల అరెస్టు అయిన ఇంజినీరింగ్ విద్యార్థి మహేష్‌రెడ్డికి సరఫరా అయినట్లు దర్యాప్తులో బయటకు వచ్చింది. ఇద్దరూ బెంగళూరులో బీటెక్ చదువుతున్నారు. గ్రీష్మ నుంచి డ్రగ్స్ తీసుకుని యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించేవాడని పోలీసులు గుర్తించారు. ఈమె ఫోన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల గుడివాడలో ఆతర్వాత హైదరాబాద్, బెంగళూరులో టవర్ లొకేషన్ చూపించింది. ఆతర్వాత నుంచి ఫోన్ స్విచాఫ్ చేసింది. ఈ కేసులో మాచవరం స్టేషన్ నుంచి పరారైన నిందితుడు రాజేష్ కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. ఇతని కోసం నెల్లూరు, హైదరాబాద్‌లో ప్రత్యేక బృందం గాలిస్తోంది.

బేర్‌మన్న రూ.7.69 లక్షల కోట్లు



తారాత్తించిన అమెరికా 500% సుంకాల బిల్లు

సెన్సెక్స్ ▼780 **84181** | నిఫ్టీ ▼264 **25877**

బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.69 లక్షల కోట్లు తగ్గి రూ.472.25 లక్షల కోట్ల (5.25 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

మూడురోజులుగా నష్టపోతున్న మన సూచీలు, నాలుగోరోజు మరింత ఎరుపెక్కాయి. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు ఆపకపోతే, భారత ఉత్పత్తులపై 500% సుంకాలు విధించే బిల్లుకు ట్రంప్ ఆమోదం తెలపడమే ఇందుకు కారణం. ఫలితంగా మార్కెట్లపై బేర్ పట్టుబిగించింది. సెన్సెక్స్, నిఫ్టీ సుమారు 1% నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలు, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్‌ఐఐ) అమ్మకాలు ఆజ్యం పోశాయి. లోహ, చమురు- గ్యాస్, కమొడిటీ కంపెనీల షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు తగ్గి 89.94 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 2.55% పెరిగి 61.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా మినహా మిగతావన్నీ నష్టాల్లోనే ముగిశాయి.

ఆద్యంతం నష్టాల్లోనే..

బీఎస్‌ఈ సెన్సెక్స్ 84,778.02 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమయింది. నష్టాలు క్రమంగా పెరిగి, ఒక దశలో సూచీ 84,110.10 పాయింట్లకు తాకింది. చివరకు 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలక 26,000 స్థాయి దిగువకు వచ్చింది. ఈ సూచీ 263.90 పాయింట్లు కోల్పోయి 25,876.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,858.45 వద్ద కనిష్ఠాన్ని; 26,133.20 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

నాలుగే లాభాల్లో..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో నాలుగే లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్ 0.91%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.48%, బజాజ్ ఫైనాన్స్ 0.29%, బీఈఎల్ 0.01% చొప్పున లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 2.94%, టీసీఎస్ 2.74%, టాటా స్టీల్ 1.93%, ట్రెంట్ 1.15%, పవర్ గ్రిడ్ 1.74%, ఇన్ఫోసిస్ 1.57%, ఎన్‌టీపీసీ 1.38% డీలాపడ్డాయి.

రిలయన్స్ షేరుకు 4 రోజుల్లో 8% నష్టం

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు గురువారమూ నష్టాలు కొనసాగాయి. బీఎస్‌ఈలో ఈ సంస్థ షేరు 2.25% నష్టపోయి రూ.1,470.30 వద్ద ముగిసింది. గత నాలుగు రోజుల్లో రిలయన్స్ షేరు మొత్తంగా 7.67% నష్టపోయింది. మార్కెట్ విలువ రూ.1,65,299.15 కోట్లు తగ్గి రూ.19,89,679.45 కోట్లకు పరిమితమైంది.

భారీ యంత్రపరికరాల షేర్లు డీలా

ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం బిడ్ వేసే విషయంలో చైనా కంపెనీలపై ఉన్న ఆంక్షలను ఆర్థిక శాఖ ఎత్తివేసే అవకాశం ఉందంటూ వార్తలు రావడంతో, బెల్ సహా భారీ యంత్రపరికరాల రంగ కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. చైనా సంస్థల నుంచి పోటీ ఎదురవుతుందనే ఆందోళనే ఇందుకు కారణం. బీఎస్‌ఈలో బెల్ 10.34%, ఏబీబీ ఇండియా 4.86%, సీమెన్స్ 3.97%, ఎల్అండ్‌టీ 3.35%, హిటాచీ ఎనర్జీ 5.88%, ఐనాక్స్ విండ్ 4.11%, సుజ్లాన్ ఎనర్జీ 3.7%, టిటాగఢ్ రైల్ సిస్టమ్స్ 3.54% చొప్పున నష్టపోయాయి.

ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లకు 'సుంకాల' సెగ

అమెరికా 500% సుంకాల హెచ్చరికతో, ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ షేరు ఇంట్రాడేలో 13% కుదేలైనా, చివరకు 8.49% నష్టంతో ముగిసింది. ఈ కంపెనీ మొత్తం ఆదాయంలో అమెరికా వాటానే 60 శాతానికి పైగా ఉండటం ఇందుకు కారణం. కేపీఆర్ మిల్ 4.01%, పెరల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 7.9%, ఆపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 8.01%, అవంతి ఫీడ్స్ 8.49% వరకు నష్టపోయాయి.



4 ట్రేడింగ్ రోజుల్లో తగ్గాయి ఇలా.. | సెన్సెక్స్ 1,581.05 పాయింట్లు (1.84%) | నిఫ్టీ 451.70 (1.71%) | మార్కెట్ విలువ రూ.9 లక్షల కోట్లు

ఈనాడు బిజినెస్

ఎయిరిండియాకు బోయింగ్ డ్రీమ్‌లైనర్



బోయింగ్ తయారీ 787-9 (డ్రీమ్‌లైనర్) విమానాన్ని ఎయిరిండియా అందుకుంది. ప్రభుత్వ అధీనంలో ఎయిరిండియా ఉన్నప్పుడు, 2017లో ఒక డ్రీమ్‌లైనర్ ఈ సంస్థకు చేరింది. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి టాటా గ్రూప్‌నకు ఎయిరిండియా చేరాక, డ్రీమ్‌లైనర్‌ను అందుకోవడం ఇప్పుడే. ఆయా విమానయాన సంస్థల అవసరాలు, సూచనలకు అనుగుణంగా (కస్టమ్ మేడ్) డ్రీమ్‌లైనర్‌ను బోయింగ్ రూపొందిస్తోంది. తాజా విమానంలో ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ సీట్లు ఉంటాయి. సియాటెల్‌లోని బోయింగ్ ఎవరెట్ ప్లాంటులో ఈనెల 7న జరిగిన కార్యక్రమంలో, డ్రీమ్‌లైనర్‌ను ఎయిరిండియాకు అప్పగించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తనిఖీల తరవాత, కొద్ది రోజుల్లోనే ఈ విమానం సేవలు అందిస్తుంది. ఆర్థిక సంవత్సరం మరో 12 డ్రీమ్‌లైనర్ విమానాలు కూడా 2026లో సేవలు ప్రారంభించనున్నాయి.

జుట్టు పెరగడానికి అల్కెమ్ ల్యాబ్స్ థెరపీ కిట్

దిల్లీ: జుట్టు పెరిగేందుకు ఉపకరించే ఒక థెరపీ కిట్‌ను ఆవిష్కరించినట్లు అల్కెమ్ లేబొరేటరీస్ ప్రకటించింది. జుట్టు పెరగడానికి మద్దతునివ్వడం, వెంట్రుకల కుదుళ్లను బలోపేతం చేయడం, జుట్టు రాలడాన్ని తగ్గించడం కోసం న్యూట్రిషనల్ సప్లిమెంటేషన్‌ను తమ 'రెనోసియా న్యూట్రిషనల్ థెరపీ కిట్' అందిస్తుందని సంస్థ తెలిపింది. ఈ కిట్‌లోని సప్లిమెంట్స్ అన్నీ శాకాహార పదార్థాలతో కూడుకున్నవని సంస్థ తెలిపింది. కిట్‌లో విటమిన్లు, ఖనిజాలు, అమైనో యాసిడ్ వంటి పోషకాహార సప్లిమెంట్లు ఉంటాయని, వారంలో ఏ రోజు, ఏది వేసుకోవాలో కూడా సమాచారం ఇస్తున్నట్లు కంపెనీ వివరించింది.

తనిష్క్ ప్రచారకర్తగా నటి అనన్య పాండే



హైదరాబాద్: టాటా గ్రూప్ ఆభరణాల రిటైల్ బ్రాండ్ తనిష్క్, తమ కొత్త ప్రచారకర్తగా బాలీవుడ్ నటి అనన్య పాండేను నియమించింది. కొత్తతరం కొనుగోలుదార్ల విశ్వాసం, స్టైల్‌ను అనన్య ప్రతిబింబిస్తారని, తనిష్క్ ఆభరణాల పోర్ట్‌ఫోలియోను ప్రజల్లోకి తీసుకెళ్తారని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా 'ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్' విక్రయాలను మళ్లీ తీసుకొచ్చింది. రూ.10,000 నుంచి ఈ ఆఫర్ ప్రారంభమవుతుందని, డైమండ్ విలువపై 20% రాయితీ ఇస్తున్నట్లు వివరించింది. ప్రతి మహిళకు డైమండ్ ఆభరణాలు అందేలా ప్రత్యేకమైన ఆఫర్ అని అనన్య పాండే పేర్కొన్నారు. ఆధునికత, స్వీయ ఎదుగుదల, అనుబంధాలను బ్రాండ్ దృష్టికి తాజా భాగస్వామ్యం నిదర్శనమని కంపెనీ చీఫ్ మార్కెటింగ్ అధికారి పెల్కి షెరింగ్ తెలిపారు.

హైదరాబాద్‌లోనే మహిళా అప్రెంటిస్‌లు ఎక్కువ

అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాల్లో మహిళల వాటా బాగా పెరుగుతోందని టీమ్ లీజ్ డిగ్రీ అప్రెంటిస్‌షిప్, ఐఎల్ఓ గ్లోబల్ నివేదిక తెలిపింది. మహిళా అప్రెంటిస్‌ల సంఖ్య 2021-22లో 1,24,000 కాగా, 2023-24కు 1,96,914కు చేరినట్లు వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా 1,000కి పైగా సంస్థల్లోని 10 లక్షల మంది అప్రెంటిస్‌ల సమాచారాన్ని క్రోడీకరించి, ఈ నివేదిక రూపొందించినట్లు ఆయా సంస్థలు తెలిపాయి. ఈ నివేదిక ప్రకారం.. 2024లో 42% మహిళా అప్రెంటిస్‌లతో హైదరాబాద్ ముందు ఉండగా, కోల్‌కతా, చెన్నై స్థిరమైన వృద్ధిని నమోదుచేసి తర్వాత స్థానంలో ఉన్నాయి. ఐటీ, బీపీఎం, రిటెయిల్, వాహన, ఎలక్ట్రానిక్స్, బీఎఫ్ఎస్ఐ, పర్యాటక, అతిథ్యం రంగాలు అప్రెంటిస్ కార్యక్రమాలను ఆఫర్ చేస్తున్నాయి. 38% సంస్థల్లో మహిళా అప్రెంటిస్‌లు లేరు. 26% సంస్థల్లో 1-10% మంది ఉన్నారు. 2% సంస్థల్లోనే 50% పైగా మహిళా అప్రెంటిస్‌లు ఉన్నారు.

విమాన తయారీలోకి అదానీ గ్రూప్!

ఎంబ్రాయర్‌తో ఒప్పందం



బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్, మనదేశంలో విమానాల రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకవసరమైన తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయడం కోసం, అదానీ గ్రూప్‌తో ఎంబ్రాయర్, ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. భారత విమాన రంగంలోని భారీ అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం ఎంబ్రాయర్ గత అక్టోబరులో దిల్లీలో తన కార్యాలయాన్ని నెలకొల్పింది. ఎంబ్రాయర్‌తో ఒప్పందం ద్వారా భారత్‌లో విమానాల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్ అడుగుపెట్టినట్లయింది. ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు నిమిత్తం ఎంబ్రాయర్‌తో ఇటీవలే అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదానీ, ఎంబ్రాయర్‌ల నుంచి ఈ విషయంపై అధికారిక స్పందన రాలేదు. 'విమానయాన రంగంలో అతితక్కువ ప్రతిఫలం లభించే మార్కెట్లలో భారత్ ఒకటి. ఇక్కడ నిర్వహణ ఖర్చులు ఎంత తక్కువగా ఉండి, అంత ఎక్కువమందిని చేరవేయగలిగితేనే మనుగడ ఉంటుంది. 146 మంది ప్రయాణించేందుకు అనువైన తమ ఈ195-ఈ2 విమానం ఈ విపణికి ఎంతో అనువైనద'ని ఎంబ్రాయర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాల్ విలరాన్ తెలిపారు.

కోడి గుడ్లు

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
విజయవాడ	600
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	585
చిత్తూరు	603

సంపదలో 75% సమాజానికి ఇచ్చేస్తా

కుమారుడి హఠాన్మరణం వేళ వేదాంతా అగర్వాల్ పునరుద్ఘాటన



వేదాంతా గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్, తన సంపదలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి విరాళంగా ఇస్తానని పునరుద్ఘాటించారు. అమెరికాలో ఆయన కుమారుడు అగ్నివేశ్ ఆకస్మిక మరణం తర్వాత సామాజిక మాధ్యమం 'ఎక్స్‌'లో అనిల్ అగర్వాల్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 'దేశంలో ఏ బిడ్డ ఆకలితో నిద్రపోకూడదు. ఏ ఒక్కరికీ విద్య దూరంకాకుడదు. ప్రతి మహిళ సొంత కాళ్లపై నిలబడాలి. ప్రతి యువ భారతీయుడు అర్థవంతమైన పనిని పొందాలి అనే కలను మేము పంచుకునేవాళ్లం, మనం సంపాదించిన దానిలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి తిరిగి ఇద్దామని అగ్నితో కలిసి వాగ్దానం చేశాను. నేను ఈ రోజు ఆ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తున్నాను. మరింత సాధారణమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నా' అని అగర్వాల్ పేర్కొన్నారు. పలువురికి అందించిన సాయంతో, వారి అభ్యున్నతి రూపంలో అగ్నివేశ్ జీవించే ఉంటారన్నది తన ఆలోచనగా అనిల్ తెలిపారు. అగ్నివేశ్ మరణించిన రోజును తన జీవితంలో 'చీకటి' దినంగా ఆయన అభివర్ణించారు.

ఒక ఛార్జింగ్‌తో 810 కి.మీ.

వోల్వో విద్యుత్తు ఎస్‌యూవీ ఈఎక్స్ 60



వోల్వో కార్స్ సంస్థ, సరికొత్త మధ్యశ్రేణి విద్యుత్తు స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) ఈఎక్స్ 60ని ఆవిష్కరించింది. ఈ కారు బ్యాటరీని పూర్తిగా ఛార్జింగ్ చేస్తే 810 కిలోమీటర్లు (503 మైళ్లు) ప్రయాణించొచ్చని సంస్థ పేర్కొంది. 10 నిముషాల ఛార్జింగుతోనే 340 కి.మీ.వరకు దూసుకెళ్లొచ్చనీ తెలిపింది. ఆల్ వీల్ డ్రైవ్ మోడ్‌లోనూ ఒక పూర్తి ఛార్జింగుతో 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. 'ఛార్జింగ్ మౌలిక వసతుల కొరత వల్లే ఆసక్తి ఉన్నా, విద్యుత్తు కార్లు కొనేందుకు కొందరు ముందుకు రావడం లేదు. ఈ భయాలన్నీ దూరం చేసేలా ఈఎక్స్ 60 ఉంటుంద'ని వోల్వో ఈఎక్స్ 60 కార్యక్రమ అధిపతి అఖిల్ కృష్ణన్ తెలిపారు. ఈనెల 21న కారు ధర, ఇతర వివరాలు వెల్లడిస్తారు.

ఎంసీఎల్ఆర్ తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ఈనాడు, హైదరాబాద్: వివిధ కాల పరిమితుల నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బీఐ ఇటీవల రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.30 శాతానికి, ఏడాది వ్యవధికి 8.40శాతానికి చేరింది. రెండు మూడేళ్ల వడ్డీ రేట్లలో మార్పు లేదు. రెపో ఆధారిత వడ్డీ రేటుకు మారని గృహ రుణాలకు, వ్యక్తిగత, వాహన రుణాలకు ఈ మేరకు వడ్డీ భారం తగ్గుతుంది.

శీతాకాలంలో చలిమంటలు..
కాల్చిన జొన్న, చెరకురసం విందు



ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం నగరాల్లో ఉంటూ పల్లెటూరి వాతావరణం, ఆహారానికి దూరమవుతున్న వారి కోసం మహారాష్ట్రలో 'హుర్డా పార్టీ'ల ట్రెండు నడుస్తోంది. శీతాకాలంలో బాగా దొరికే ఆకుపచ్చటి లేత జొన్న గింజలను మరాఠీలో 'హుర్డా' అంటారు. ఏటా నవంబరు నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల కాలంలో హుర్డా పార్టీల ద్వారా ఒక్కో రైతు రూ.లక్షల ఆదాయాన్ని గడిస్తున్నారు. ఈ సీజనులో లభించే లేత జొన్నలు, ఇతర చిరు ధాన్యాలు కాల్చినవి.. చెరకు రసం, సీజనల్ బెర్రీల వంటి వాటిని హుర్డా పార్టీలో ఆరగిస్తారు. పొలాల్లో చలిమంట వేసుకోవడం, ఎడ్లబండ్లపై తిరగడం వంటివి చేస్తారు. దీన్నే హుర్డా పార్టీ అంటారు. అహల్యానగర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా విస్తృతంగా కొనసాగుతున్న ఈ ట్రెండుకు ఇన్‌ఫ్లుయెన్సర్లు మరింత ప్రచారం కల్పిస్తున్నారు. హుర్డా పార్టీలతో గ్రామీణ ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా మారుతున్నాయి.

ఈటీవీ భారత్

ఇల్లే ఊరు!

అనగనగా ఒక ఊరుంది.. ఊరంటే ఊరు కాదు.. ఒకటే ఇల్లున్న ఊరు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే. హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ స్పీతి జిల్లాలో ఉన్న కాజా గ్రామ పంచాయతీ పరిధిలో కాకతీ అనే గ్రామంలో ఒకే ఒక్క ఇల్లుంది. ఈ గ్రామం చుట్టూ ఎత్తైన పర్వతాలున్నాయి. కొండల కింద కూరగాయల తోటలు, చిన్న చెట్లు ఉంటాయి. అవే ఈ గ్రామానికి రక్షణ వలయంగా ఉన్నాయి. 100 ఏళ్ల నాటి ఈ ఇంట్లో ఉండేవారు పొలాల్లో పనిచేసుకుంటారు. పశు సంపదతో ఉపాధి పొందుతారు. కాకతీలోని ఏకైక ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములుంటారు. వీరిలో ఒకరైన కల్జాంగ్ తప్కా. బౌద్ధ లామాగా ఉన్నారు. ఆయన కాజాలో సేవలందిస్తున్నారు. మరో సోదరుడు సెరింగ్ నమ్‌గ్యాల్ తన భార్యతో కలిసి ఈ ఇంటిలో నివసిస్తున్నారు. 15 బిగాల పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నారు. లాహౌల్ స్పీతి జిల్లాకు శీతాకాలంలో మిగిలిన ప్రాంతంతో సంబంధాలు తెగిపోతాయి. ఇక్కడ మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ కారణంగా అక్కడి వారిలో చాలామంది కుల్లు-మనాలీ, మండీలకు వలస వెళ్తుంటారు. కానీ సెరింగ్ కుటుంబం అలా వెళ్లడానికి తిరస్కరించి అక్కడే ఉంటోంది. 2011లో ఈ గ్రామానికి విద్యుత్తు, రోడ్డు అందుబాటులోకి వచ్చాయి.



ఈటీవీ భారత్

అమెరికా సామ్రాజ్యవాద ధోరణిని వ్యతిరేకిస్తున్నాం

- అంతర్జాతీయ సముద్రయాన చట్టాలను గౌరవించండి
- అమెరికాకు రష్యా హితవు
- నౌకలో ముగ్గురు భారతీయులు



మాస్కో: తమ చమురు నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంపట్ల రష్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ సముద్రయాన చట్టాలను ఆ దేశం గౌరవించాలని డిమాండు చేసింది. మారిటైం నేవిగేషన్ వ్యవస్థకు స్వేచ్ఛ ఉండాలని స్పష్టం చేసింది. అమెరికా సామ్రాజ్యవాద ధోరణిని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. నౌకలోని సిబ్బందిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని రష్యా విదేశాంగ శాఖ డిమాండు చేసింది. వారు క్షేమంగా స్వదేశాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కోరింది. అమెరికా స్వాధీనం చేసుకున్న మ్యారినెరా నౌకలో 17 మంది ఉక్రేనియన్లు, ఆరుగురు జార్జియన్లు, ముగ్గురు భారతీయులు, ఇద్దరు రష్యన్లున్నారు. 'అంతర్జాతీయ సముద్రయాన ప్రాథమిక సూత్రాలను, విధానాలను గౌరవించాలని, మ్యారినెరా నౌక స్వాధీనాన్ని విరమించుకోవాలని, సముద్రాల్లోని నౌకల విషయంలో అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉండాలని అమెరికాకు స్పష్టం చేశాం' అని రష్యా విదేశాంగశాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. నౌక స్వాధీనం సమయంలో అమెరికా పేర్కొన్న ఆంక్షల చట్టం నిరాధారమైందని అభిప్రాయపడింది. 'వెనెజువెలా సహజ వనరులపై నియంత్రణ సాధించే వ్యూహాత్మక చర్యల్లో భాగంగా మ్యారినెరాను స్వాధీనం చేసుకున్నామని అమెరికా అధికారులు చేసిన ప్రకటన అత్యంత దుర్మార్గం. అటువంటి నయా సామ్రాజ్యవాద ధోరణులను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని రష్యా విదేశాంగశాఖ స్పష్టం చేసింది. 'అమెరికా, పశ్చిమ దేశాల ఏకపక్ష నియంత్రిత చర్యలు చట్ట విరుద్ధం. సముద్రయాన పరిధిని సమర్థించుకునేందుకు అవి చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదు' అని పేర్కొంది.

మా ఆమోదంతోనే..

'అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా రష్యా జెండాతో మ్యారినెరా నౌక సముద్ర యానానికి తాత్కాలిక అనుమతి జారీ చేశాం. ఉత్తర అట్లాంటిక్‌లోని అంతర్జాతీయ జలాల్లో శాంతియుత ప్రయాణానికి రష్యా చట్టం అనుమతిస్తుంది. అది రష్యా పోర్టుకు వస్తోంది' అని రష్యా విదేశాంగశాఖ వివరించింది. గత కొన్ని వారాలుగా మ్యారినెరా విషయంలో అమెరికా చర్యలపై మా అభ్యంతరాలను ఆ దేశానికి తెలియజేశామని వెల్లడించింది.

■ 'ఏం చేసినా మాకు శిక్ష పడదన్న అహంకారంతో అమెరికా వ్యవహరిస్తోంది. ఇలాంటి చర్యలకు గట్టి ప్రతిస్పందన అవసరం. అంతర్జాతీయ చట్టాలను పదే పదే ఉల్లంఘిస్తే అమెరికా మిలిటరీ దాడులను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని రష్యా పార్లమెంటు సభ్యుడు అలెక్సీ జురావ్లెవ్ హెచ్చరించారు. అవసరమైతే టార్పిడోలతో దాడులు చేస్తామని, అమెరికా కోస్టుగార్డు పడవలను ముంచేయడం వంటి చర్యలు చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

నౌక సీజ్.. వీడియో విడుదల

రష్యా జెండాతో వెళ్తున్న వెనెజువెలా నౌక స్వాధీనానికి సంబంధించిన వీడియోను యూఎస్ కోస్టుగార్డు విడుదల చేసింది. అమెరికా రక్షణశాఖ, తీర రక్షక దళం సంయుక్త ఆపరేషన్ నిర్వహించి మ్యారినెరాను సీజ్ చేసినట్లు అందులో పేర్కొంది. అమెరికా భద్రత, అంతర్జాతీయ చట్టాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించింది.

66 అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా నిష్క్రమణ

భారత్, ఫ్రాన్స్ నేతృత్వంలోని సౌర కూటమిపై ప్రభావం

వాషింగ్టన్: తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ 66 అంతర్జాతీయ సంస్థలు, కూటములు, ఒప్పందాల నుంచి వైదొలగుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత్, ఫ్రాన్స్ నేతృత్వంలోని అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) కూడా వీటిలో ఉంది. దీనికి సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ బుధవారం సంతకం చేశారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. "మొత్తం 66 సంస్థల నుంచి వెలుపలకు రావడంతో పాటు నిధుల మంజూరును, మద్దతును నిలిపివేస్తున్నాం. వీటిలో ఐక్యరాజ్య సమితికి చెందినవి 31, ఐరాసయేతర సంస్థలు 35 ఉన్నాయి. ఇకపై ఆ సంస్థలు నిర్వహించే సమావేశాల్లో అమెరికా పాల్గొనదు, వాటికి నిధులు అందించదు" అని రూబియో తెలిపారు. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఆయా విభాగాలను ట్రంప్ ఆదేశించారని పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స దేశవ్యాప్తం

ప్రధాని త్వరలో ప్రారంభిస్తారు: గడ్కరీ

దిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స అందించే పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ప్రారంభించనున్నారని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. 2024 మార్చిలో చండీగఢ్‌లో ప్రారంభించిన నమూనా పథకాన్ని తర్వాత ఆరు రాష్ట్రాలకు విస్తరించారు. క్షతగాత్రుల్లో ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందేలా ఈ పథకాన్ని రూపొందించారు. ఇప్పుడు దీనిని దేశవ్యాప్తం చేయనున్నామని మంత్రి తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రవాణా శాఖల మంత్రులతో గురువారం దిల్లీలో నిర్వహించిన వార్షిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ప్రతి కుక్కనూ తొలగించాలని చెప్పలేదు

- ఏబీసీ నిబంధనల ప్రకారం వెళ్లాలన్నాం : సుప్రీంకోర్టు



దిల్లీ: రోడ్లపై తిరిగే ప్రతి కుక్కనూ తొలగించాల్సిందిగా తామేమీ చెప్పలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జంతు సంతాన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల ప్రకారం వాటిపై వ్యవహరించాలని మాత్రమే ఆదేశించామని తెలిపింది. వీధికుక్కల బెడదపై గురువారం సయితం విచారణ కొనసాగించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాల ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ఇదివరకు ఇచ్చిన ఆదేశాల అమలుకు అనుకూలంగా, వ్యతిరేకంగా వాదనలు వినిపించిన వారిలో సీనియర్ న్యాయవాదులు కె.వేణుగోపాల్, శ్యామ్ దివాన్, సిద్ధార్థ లూథ్రా, గోపాల్ శంకరనారాయణన్, సి.యు.సింగ్ తదితరులు ఉన్నారు. దిల్లీలో కుక్కలతోపాటు ఎలుకలు, కోతుల బెడద కూడా తీవ్రంగా ఉందని సింగ్ చెప్పారు. కుక్కల్ని అకస్మాత్తుగా తొలగిస్తే ఎలుకల సంఖ్య ఇంకా పెరిగిపోయి ఇతర విపరిణామాలకు దారితీస్తుందన్నారు.

అయితే పిల్లుల్ని పెంచుదాం!

అగర్వాల్ వాదనలపై జస్టిస్ మెహతా సరదాగా వ్యాఖ్యానిస్తూ- 'కుక్కలు, పిల్లులు పరస్పర శత్రువులు. పిల్లులేమో ఎలుకల్ని తింటాయి. కాబట్టి మనం పిల్లుల్ని పెంచుదాం' అని అన్నారు. ఒక వ్యక్తిని వాసన చూసి అతని స్వభావాన్ని శునకాలు పసిగట్టగలవని జస్టిస్ నాథ్ చెప్పారు. పెంపుడు కుక్క అయినా పొరుగువారిపై దాడి చేస్తే నేరమేనన్నారు. భిన్నవాదనలు కొనసాగి అసంపూర్తిగా ముగిశాయి. దీంతో శుక్రవారం వీటిని కొనసాగించనున్నారు. లద్దాఖ్‌లో అరుదైన వన్యప్రాణులపై కుక్కలు చేస్తున్న దాడుల గురించి ఇటీవల ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని చదివి, శుక్రవారం వాదనలకు రావాలని న్యాయవాదులకు జస్టిస్ మెహతా సూచించారు.

పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

- పలువురు ప్రముఖుల సంతాపం

పుణె: పశ్చిమ కనుమల పరిరక్షణకు జీవితాంతం కృషి చేసిన ప్రముఖ పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ (83) బుధవారం రాత్రి కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో పుణెలోని ఓ ఆసుపత్రిలో చేరిన ఆయన అక్కడే తుది శ్వాస వదిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారత పర్యావరణ పరిశోధన, పరిరక్షణ విధానాలను రూపొందించడంలో మాధవ్ గాడ్గిల్ ప్రధాన పాత్ర పోషించారు. పశ్చిమ కనుమలపై గాడ్గిల్ అద్భుత కృషికి గానూ 2024లో ఐక్యరాజ్య సమితి ఆయనకు అత్యున్నత పర్యావరణ పురస్కారమైన 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు'ను ప్రదానం చేసింది. ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహా మండలి, జాతీయ సలహా మండలి, జాతీయ పులుల సంరక్షణ సంస్థలతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లోనూ సభ్యుడిగా ఆయన సేవలందించారు. పద్మ భూషణ్ సహా పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆయనను వరించాయి. గాడ్గిల్ మరణం పట్ల మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేతలు జైరాం రమేశ్, ప్రియాంకా గాంధీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. పర్యావరణం కోసం జీవితకాలం పోరాడిన యోధుడు గాడ్గిల్ అంటూ ప్రశంసించారు. ఆయన మరణం దేశ పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి ఎదురుదెబ్బ లాంటిదని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

మీ ఎదుగుదలకు అడ్డంకులివే..



- కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధపడకపోవడం.
- కొత్తగా ప్రయత్నించి విఫలమైతే ఇతరులు మీ గురించి ఏమనుకుంటారో అని భయపడటం.
- ఉన్నత లక్ష్యాల గురించి ఆలోచించకుండా తాత్కాలిక ఆనందాల కోసం తాపత్రయపడటం.

– జస్టిన్ వెల్ష్, సోలోప్రెన్యూర్

మహిళను కాల్చి చంపిన ఐసీఈ అధికారి

- మినియాపొలిస్‌లో తీవ్ర ఉద్రిక్తత

మినియాపొలిస్: అమెరికాలోని మినియాపొలిస్‌లో ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) అధికారి మంగళవారం ఓ మహిళను కాల్చి చంపిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ట్రంప్ హయాంలో అక్రమ వలసదారులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం ఐసీఈ అధికారులు మినియాపొలిస్‌లో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో 37 ఏళ్ల రీనీ నికోల్ గుడ్ ప్రయాణిస్తున్న కారును ఐసీఈ అధికారులు ఆపడానికి ప్రయత్నించారు. ఆమె ఆపకుండా ముందుకు దూసుకెళ్లడంతో ఓ అధికారి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నికోల్ గుడ్ ప్రాణాలు కోల్పోయారు. ఆ మహిళ.. అధికారిని తన కారుతో ఢీకొట్టి చంపాలనుకుందని, ఆత్మరక్షణ కోసమే అతను కాల్పులు జరిపారని హోంలాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ తెలిపారు. మినియాపొలిస్ మేయర్ జాకబ్ ఫ్రే ఈ వాదనలను తోసిపుచ్చారు. వీడియో ఆధారాల ప్రకారం ఆ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ ఘటన తర్వాత ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఐసీఈ అధికారులు నగరం నుంచి వెళ్లిపోవాలని ప్రజలు, రాష్ట్ర, స్థానిక అధికారులు డిమాండ్ చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా స్థానిక పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



ఐసీఈకి వ్యతిరేకంగా మినియాపొలిస్‌లో ఆందోళన చేస్తున్న పౌరులు. అంతర చిత్రంలో రీనీ నికోల్ గుడ్

ఆడపడుచులకు అన్నగా అండగా ఉంటా

- ఈ ఏడాదిలోనే లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నాం
- గుంటూరు సరస్ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలోని డ్వాక్రా, మెప్మా సంఘాల్లో 1.13 కోట్ల మంది ఆడపడుచులు ఉన్నారు. రూ.26 వేల కోట్ల మూలనిధితో మహిళల సత్తా ఏమిటో చూపించారు. మీకు రూ.లక్ష కోట్ల అప్పు కావాలంటే బ్యాంకర్లు క్యూ కట్టి ఇచ్చే స్థాయికి చేరారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. మీకు ముందుండి కూడా ప్రభుత్వం నుంచి అన్నివిధాలా తోడ్పాటు అందిస్తామని, పొదుపు సంఘాలు ఆన్‌లైన్‌లోనే రుణాలు తీసుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గుంటూరులో జాతీయస్థాయి సరస్ మేళా-2026ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు తొలుత స్టాళ్లను పరిశీలించి, ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభలో ప్రసంగించారు.

డ్వాక్రా, మెప్మా నా మానస పుత్రికలు

'డ్వాక్రా, మెప్మా సంఘాలు నా మానస పుత్రికలు. 1995లో నేను సీఎం అయ్యాక మహిళాభ్యున్నతి కోసం డ్వాక్రా సంఘాలు పెట్టా. ఆ రోజు మీరు రోడ్డు పైకి వస్తుంటే మగవాళ్లు ఎగతాళి చేశారు. వేలంపాటదిలో మీకు ధైర్యం చెప్పా. రాజకీయ రోజుల్లో మీ ఇంట్లో మీ మాటే వింటారని భరోసా కల్పించా. నా మాట నమ్మి, ముందడుగు వేశారు. మీరు రూపాయి పొదుపు చేస్తే అన్నగా మరో రూపాయి కట్టా (రివాల్వింగ్ ఫండ్)గా ఇచ్చా. మీ సంపాదనతో పిల్లలను పైకి తెచ్చి, కుటుంబానికి ఆర్థికంగానూ అండగా నిలిచారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 89 లక్షల మంది డ్వాక్రా, పట్టణ ప్రాంతాల్లో 24 లక్షల మంది మెప్మా సంఘాల్లో ఉన్నారు. వీరిలో 57 లక్షల మంది కుటుంబానికి ఆధారమయ్యారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని నిజాయతీగా తిరిగి చెల్లించాలన్న నా మాటను మీరు చక్కగా పాటించారు. 2024-25లో బ్యాంకులు, స్త్రీనిధి నుంచి రూ.46,590 కోట్లు, ఈ



గుంటూరులో జరుగుతున్న జాతీయ స్థాయి సరస్ మేళా వేదికపై స్వయం సహాయక బృందాలకు స్త్రీ నిధి చెక్ అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు

ఏడాది ఇప్పటివరకు రూ.31,175 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్నట్లు లెక్కలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. రూ.26 వేల కోట్ల రివాల్వింగ్ ఫండ్ (మూలనిధి) ఉన్న ఏకైక సంస్థ మా ఆడబిడ్డల సంస్థ అని గర్వంగా చెబుతున్నా. ఆడపడుచుల వద్ద స్త్రీనిధిలోనే రూ.1,782 కోట్ల కార్పస్ ఫండ్ ఉంది. ఏటా రూ.5,200 కోట్ల టర్నోవర్ చేస్తున్నారు.

షాపింగ్‌మాల్స్, ఆన్‌లైన్ మార్కెటింగ్‌కి ఎదగాలి

ప్రతి మహిళా మెరుగ్గా ఆలోచించాలి. తయారు చేసిన ఉత్పత్తులను షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్‌లో అమ్మగలిగేలా మార్కెట్‌ను సృష్టించాలి. డబ్బులు ఎలా సంపాదించాలనే చిట్కాలు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వారికి చెప్పాలి. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో అడుగేస్తున్నా. సెర్ప్‌లో 70 వేల మందిని పారిశ్రామికవేత్తలను చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే 72,832 మంది, మెప్మాలో 30 వేలు లక్ష్యం అనుకుంటే 21,091 మంది తయారయ్యారు. మరో నెల రోజుల్లో లక్ష లక్ష్యం పూర్తవుతుంది. మా ఆడబిడ్డలు ఒక్క ఏడాదిలో లక్షమంది పారిశ్రామికవేత్తలను తయారు చేసిన ఘనతను ఆంధ్రప్రదేశ్‌కు కట్టబెట్టారు. ముఖ్యమంత్రి అంటే పెత్తందారు కాదు. మీలో నమ్మకాన్ని, ఆశను కల్పించే వ్యక్తి. నేను ప్రతిరోజూ దేవుణ్ని ఒక్కటే ప్రార్థిస్తా. రాష్ట్రంలో ఐదుకోట్ల మందీ ఆరోగ్యంగా ఉండాలి. ఆదాయాన్ని పెంచుకోవాలి. ఆనందంగా జీవించాలి. అందుకోసమే రాత్రింబవళ్లు పనిచేస్తున్నా.

సరస్ చక్కని కార్యక్రమం

సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్ సొసైటీ) చక్కని కార్యక్రమం. దిల్లీలో జరిగే ఇలాంటి పెద్ద కార్యక్రమాన్ని గుంటూరుకు తీసుకొచ్చిన మీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇదో మినీ ఇండియాలా కనిపిస్తోంది. పెమ్మసాని చంద్రశేఖర్ బాగా చదువుకుని అమెరికా వెళ్లి సంపాదించారు. సమాజసేవకు రాజకీయాలే సరైన మార్గమన్న నా మాట విని వచ్చారు. కేంద్ర సహాయమంత్రిగా చక్కని సేవలందిస్తున్నారు. మంత్రి శ్రీనివాస్ కూడా తొలిసారి ఎమ్మెల్యే అయినా జాక్‌పాట్‌లో మంత్రి పదవి దక్కించుకున్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

రూ.4,837 కోట్ల రుణాల పంపిణీ

గుంటూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్త్రీ నిధి ద్వారా 27 వేల డ్వాక్రా సంఘాలకు రూ.1,375 కోట్లు, బ్యాంకు లింకేజీ కింద 2.17 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.2,171 కోట్లు, సూక్ష్మ, చిరు వ్యాపారులు 86,600 మందికి రూ.1,291 కోట్ల రుణాలు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబు సరస్ వేదికగా చెక్కులను పంపిణీ చేశారు.


సరస్ మేళాలో సీఎంతో ఓ స్టాల్ నిర్వాహకులు


జాతీయ స్థాయి సరస్ మేళాలో కిక్కిరిసిన సందర్శకులు

'సరస్' ప్లేట్లో.. దేశవ్యాప్త రుచులు!



← వేడివేడిగా జమ్మూకశ్మీర్ రుచులు



సరస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టులో నోరూరిస్తున్న రాజస్థాన్ వంటకాలు

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని అన్ని పేరొందిన ఆహార పదార్థాలు గుంటూరు శివారులోని సరస్ మేళా ఫుడ్‌కోర్టులో ఆహార ప్రియుల నోరూరిస్తున్నాయి. చుట్టూ వివిధ రాష్ట్రాల స్టాల్స్. ఆ మధ్యలో డైనింగ్ టేబుల్‌పై తీరొక్క రుచులను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన వంట మాస్టర్లు వేడివేడిగా వడిస్తున్నారు. కశ్మీరీ బిర్యానీ, ఝార్ఖండ్ దుస్కా, పంజాబ్ మూంగ్ లెట్‌చిల్లా, ఉత్తరాఖండ్ జాంగోర్ కే ఖీర్, రాజస్థాన్ రాజ్వాడీ తాలీ, కేరళ పాల్‌కప్పా చికెన్ కర్రీ.. ఘుమఘుమలాడుతున్నాయి. కేరళ స్టాల్‌లో 40 రకాల పళ్లరసాలు, సోడాలు, ఐస్‌క్రీమ్‌లు వివిధ రకాల ఫ్లేవర్లతో నోటిని తీపెక్కిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ స్టాల్‌లో వజ్వాన్ మటన్ రోగన్ జోష్ విత్ రైస్, ఆఫ్ఘానీ చికెన్ గ్రిల్డ్ విత్ చట్నీ, కశ్మీరీ హాట్ చికెన్, కుల్చాలూ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో దొరికే బిర్యానీలు, కాజా, నేతి అరిసెలు, పూతరేకులు, మామిడి తాండ్ర చవులూరించేస్తున్నాయి. ఇంకెదుకాలస్యం మీరూ వెళ్లి ఓ పట్టుపట్టండి!



కాకినాడ స్పెషల్ కాజాలు

మడ అడవుల పరిరక్షణలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతాం

- గతేడాది తీర ప్రాంతాల్లో 700 హెక్టార్ల మేర అడవులు పెంచాం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: మడ అడవులు, వాటిల్లోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించటంలో ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. గతేడాది రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో 700 హెక్టార్ల మేర మడ అడవులు పెంచామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తి కొనసాగిస్తామన్నారు. తీర ప్రాంతాన్ని రక్షించేందుకు 3 దశల్లో మడ అడవుల పెంపకం, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేస్తామని వివరించారు. ఇందులో తీరప్రాంత వాసులనూ భాగస్వాముల్ని చేసి, సుస్థిర ఆదాయం పొందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 'తీర ప్రాంత ఆవాసాల్లో మడ అడవుల పెంపకం.. సుస్థిర ఆదాయం (మాంగ్రోవ్స్ ఇనీషియేటివ్ ఫర్ షోర్‌లైన్ హాబిటాట్స్ అండ్ టాంజిబుల్ ఇన్‌కమ్స్ -మిస్తీ)" అనే అంశంపై విజయవాడలో గురువారం జాతీయ కార్యశాల జరిగింది. కేంద్ర, ఏపీ అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖలు కలిసి నిర్వహించిన కార్యశాలలో పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ.. 'రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50% మేర పచ్చదనం పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. మడ అడవుల పరిరక్షణలో రాజకీయ ఒత్తిళ్లు, ఇతర భయాలు లేకుండా అధికారులకు అండగా ఉంటాం. ఇతర రాష్ట్రాలతో ముడిపడి ఉన్న అంశాలపై సంప్రదింపులతో సమన్వయం చేసుకుంటాం. అటవీ శాఖ సిబ్బంది సంక్షేమానికీ కట్టుబడి ఉన్నాం' అని వివరించారు.



పవన్‌కల్యాణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చలపతిరావు, కాంతిలాల్ దండే

✦ రెండు రోజుల కార్యశాలలో భాగంగా తొలి రోజైన గురువారం 'మిస్తీ' పథకం పురోగతి సమీక్ష, వివిధ రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలు, మడ అడవుల పునరుద్ధరణ, తీర ప్రాంత రక్షణ తదితర అంశాలపై చర్చించి, భవిష్యత్తు వ్యూహాలు రూపొందించారు. ప్రజా భాగస్వామ్యంతో పర్యావరణ సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీ దళాల అధిపతి డా.పీవీ చలపతిరావు, కాంపా సీఈవో ఆనంద్ మోహన్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన అటవీ శాఖాధికారులు, వివిధ పరిశోధన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ బృందం శుక్రవారం కృష్ణా అభయారణ్య ప్రాంతంలో పర్యటించనుంది.

నేటి నుంచి పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు

- ప్రారంభించనున్న పవన్‌కల్యాణ్

ఈనాడు, కాకినాడ-న్యూస్‌టుడే, పిఠాపురం: సంక్రాంతి పండగకు ముందే కాకినాడ జిల్లాలో సంబరాలు మొదలయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే 'పీఠికాపురి సంక్రాంతి మహోత్సవాలను' పవన్‌కల్యాణ్ శుక్రవారం ప్రారంభించనున్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా వేదిక, మైదానాలను తీర్చిదిద్దారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా రంగవల్లులతో కూడిన పూరిల్లు, పక్కనే నీటిబావి, ధాన్యం బస్తాలతో ఎడ్లబండి ఉండేలా సెట్ వేశారు. చేనేత, హస్తకళలు, కొండపల్లి బొమ్మలతో పశుసంవర్ధక, మాతాశిశు సంక్షేమ శాఖలు స్టాళ్లు ఏర్పాటుచేశాయి. నోరూరించే పిండివంటలు ప్రదర్శించనున్నారు.


పల్లెకళ ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన గుడిసె, బావి

✦ మూడు రోజులపాటు సంబరాల్లో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించారు. తొలిరోజు థింసా, రేలారే రేలా, కొమ్ము, కోయ, గరగ నృత్యాలు, కోలాటం, డప్పులు, సినీ కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయి. కూచిపూడి నృత్యం, సంగీత విభావరి తదితరాలూ ఏర్పాటుచేశారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, నారాయణ ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. జబర్దస్త్ కమెడియన్ హైపర్ ఆది, క్రికెటర్ అంబటి రాయుడు తదితరులు హాజరవుతారు. రెండోరోజు ఎమ్మెల్సీ నాగబాబు, జబర్దస్త్ కళాకారులు రానున్నారు. మూడోరోజు దర్శకుడు హరీశ్ శంకర్, నటులు నవీన్ పొలిశెట్టి, కిరణ్ అబ్బవరం రానున్నారు.

✦ సంక్రాంతి సంబరాల వేదికగా కాకినాడ జిల్లాలో రూ.211 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.



పెట్టుబడుల్లో ఈ జాగ్రత్త అవసరం

పెట్టుబడులు పెట్టడం ఎంత ముఖ్యమో, వైవిధ్యమైన మదుపు మార్గాలను ఎంచుకోవడమూ అంతే ముఖ్యం. మీ సంపాదన మొత్తాన్ని ఒకే చోట పెట్టుబడి పెట్టడం వల్ల మీరు నష్టపోయే ముప్పు ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా స్టాక్ మార్కెట్, బాండ్లు, రియల్ ఎస్టేట్, బంగారం తదితర రూపాల్లో పెట్టుబడులు పెడితే నష్టభయం తక్కువగా ఉంటుంది.

– మార్క్ టిల్బురీ, అంత్రప్రెన్యూర్

జనసేనకు నాగబాబు, మిత్రుల విరాళం రూ.48 లక్షలు

ఈనాడు, అమరావతి: జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఆయన మిత్రులు కలిసి పార్టీ కోసం రూ.48 లక్షల విరాళాన్ని డీడీ రూపంలో అందించారు. 'నా సేన కోసం నా వంతు' కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ కోశాధికారి రత్నంకు ఈ మొత్తాన్ని అందజేశారు. మరో రూ.2లక్షలూ త్వరలో పార్టీకి అందిస్తామని పేర్కొన్నారు.

ఏసీబీ ఎఫ్ఐఆర్‌ల రద్దు చెల్లదు

- హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు విధానం న్యాయాన్ని అపహాస్యం చేసేలా ఉందని వ్యాఖ్య
- ఇకపై ఇలాంటి పిటిషన్లను విచారణకు స్వీకరించొద్దని నిర్దేశం

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన 13 మంది అధికారులపై విజయవాడ అవినీతి నిరోధక విభాగం సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (ఏసీబీ సీఐయూ) నమోదు చేసిన ఎఫ్ఆర్ఐలను రద్దుచేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత ఏడాది ఆగస్టు 1న వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం కొట్టేసింది. ఈ కేసులో ప్రతివాదులందరిపై ఏసీబీ దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తులను సవాల్ చేస్తూ దాఖలయ్యే పిటిషన్లను ఏపీ హైకోర్టు విచారణకు స్వీకరించరాదని ఆదేశించింది. ఈ తీర్పు కాపీ వెలువడిన ఆరు నెలల్లోపు ప్రతివాదులపై దర్యాప్తు పూర్తి చేసి, తుది నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. వారిపై అరెస్ట్ లాంటి కఠిన చర్యలు తీసుకోరాదని నిర్దేశించింది. దర్యాప్తును వేగంగా పూర్తి చేయడానికి ప్రతివాదులంతా సహకరించాలని సూచించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది.

అవినీతి నిరోధక కేసుల దర్యాప్తు కోసం ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను 'పోలీస్‌స్టేషన్'గా నోటిఫై చేస్తూ 2003లో జీఓ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత 2016 అక్టోబర్ 17న ఏసీబీ డీజీ కార్యాలయాన్ని విజయవాడకు తరలించారు. దాన్నే ఏసీబీ కేసుల విచారణ పోలీస్‌స్టేషన్‌గా కొనసాగించారు. 2020 వరకు 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 12 కేసుల్లో దర్యాప్తు పూర్తవగా ఒక కేసులో ఛార్జిషీట్ కూడా వేశారు. ఈ నేపథ్యంలో 2020-23 మధ్య కాలంలో ఈ కేసుల్లో నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనల ప్రకారం విజయవాడ ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేయనందున ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని కోరారు. ఈ కేసు నడుస్తుండగానే ఈ కార్యాలయాన్ని రాష్ట్రం మొత్తానికి ఏసీబీ పోలీస్‌స్టేషన్‌గా వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 14న జీఓ ఇచ్చింది. అయితే అప్పటి వరకు ఏసీబీకి రాష్ట్రంలో నమోదు చేసిన కేసులపై దర్యాప్తు చేసే అధికారం లేదని, 2016 అక్టోబర్ 17 తర్వాత నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని నిందితులు కోరారు. దీంతో హైకోర్టు 13 ఎఫ్ఐఆర్‌లను కొట్టేస్తూ నిరుడు ఆగస్టులో తీర్పిచ్చింది. దాన్ని సవాల్ చేస్తూ ఏసీబీ (రాయలసీమ) జాయింట్ డైరెక్టర్ సెప్టెంబర్ 12న సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ వేశారు.

దర్యాప్తును మొగ్గలోనే తుంచేశారు..

'అవినీతి నిరోధక చట్టం కింద శిక్షార్హమైన నేరాలపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లను హైకోర్టు కొట్టేయడంతో కొన్ని కేసుల దర్యాప్తును మొగ్గలోనే తుంచేసినట్లయింది. మరికొన్ని కేసుల్లో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా రద్దు చేసినట్లయింది. ఎఫ్ఐఆర్‌లు దాఖలైన పోలీస్‌స్టేషన్ల జ్యూరిస్‌డిక్షన్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకొని హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు న్యాయాన్ని అపహాస్యం చేయడమే. ఒక సాంకేతిక కారణం చూపి ఎఫ్ఐఆర్‌లను కొట్టేసినప్పుడు ప్రత్యామ్నాయంగా మరో జ్యూరిస్‌డిక్షన్ చూపాల్సిన బాధ్యత హైకోర్టుకు ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చట్టాల్లో మార్పుచేర్పులు, సవరణలు, రద్దు చేస్తే తప్పితే రాష్ట్ర విభజనకు ముందున్న చట్టాలన్నీ విభజన తర్వాత రెండు రాష్ట్రాలకూ వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తున్నాం. వీటిలో ఇప్పటికే దాఖలైనవి, ఇకపై దాఖలు చేయబోయే ఛార్జిషీట్లను, దర్యాప్తు తర్వాత ఏవైనా ఇతరత్రా అంశాలుంటే వాటినీ సవాల్ చేసే స్వేచ్ఛను ప్రతివాదులకు ఇస్తున్నాం' అని ధర్మాసనం తీర్పులో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్, గుంటూరు ప్రమోద్‌కుమార్‌లు వాదనలు వినిపించారు.

ఆయుధాల రేంజ్‌ను పెంచే 'రామ్‌జెట్'

ఐఐటీ మద్రాస్ ఆవిష్కరణ

ఈనాడు, చెన్నై: రక్షణ దళాలు వినియోగించే ఆయుధాలు, తుపాకుల రేంజ్‌ను పెంచుకునే అదనపు సాంకేతికతను ఐఐటీ మద్రాస్ సాధించింది. మందుగుండుకు అమర్చే వినూత్న ఆర్టిలరీ షెల్‌ను ఆవిష్కరించింది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించి విజయం సాధించామని, ఈ సాంకేతికతకు 'రామ్‌జెట్'గా నామకరణం చేశామని ఐఐటీ మద్రాస్ ప్రకటించింది. రక్షణ రంగం చరిత్రలో ఇదొక అద్భుతమని వెల్లడించింది. ఇది ఓ హైస్పీడ్ ఇంజిన్‌లా.. గాలిని అదిమిపట్టి, ఇంధనాన్ని ఉపయోగించి వేగంగా ముందుకెళ్లే థ్రస్ట్‌లా పనిచేస్తుందని వివరించింది. రేంజ్ పెంచుకునేందుకు రక్షణ దళాలు ఇప్పటికే వినియోగిస్తున్న తుపాకుల్ని మార్చకుండా.. ఈ సాంకేతికతను అన్వయించుకుంటే సరిపోతుందని తెలిపింది. ఈ ప్రాజెక్టును ఆచార్యులు పి.ఎ.రామకృష్ణ, జి.రాజేష్, ఎం.రామకృష్ణ, మురుగైయన్, లాజర్.సి.యోగేశ్‌కుమార్, లెఫ్టినెంట్ జనరల్స్ పి.ఆర్.శంకర్, హరిమోహన్ అయ్యర్ చేపట్టారని వివరించింది. ఇదే తరహా సాంకేతికతను రాకెట్లకూ అన్వయించుకునే వీలుందని, దీనిపై పరిశోధనలు జరగాల్సి ఉందని ప్రొఫెసర్ పి.ఎ.రామకృష్ణ పేర్కొన్నారు.


రామ్‌జెట్ ఆర్టిలరీ షెల్ నమూనా

రేంజ్ ఎంత పెంచుకోవచ్చు..(కి.మీ.లో)

ఆయుధం	ప్రస్తుతం	రామ్‌జెట్ రేంజ్
బోఫోర్స్	24	43
ధనుష్	30	55
వజ్ర	36	62
ఏటీఏజీఎస్	40	70

అమరావతి పనులపై నాబార్డ్ బృందం సంతృప్తి

తుళ్లూరు, న్యూస్‌టుడే: జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) డీజీఎం అబువురాజన్ ఆధ్వర్యంలోని బృందం గురువారం రాజధాని అమరావతిలో పర్యటించింది. అమరావతి అభివృద్ధికి గతంలో నాబార్డ్ రూ.7,387.70 కోట్ల ఆర్థిక సహకారం ప్రకటించింది. ఆ నిధుల్లో కొంతమేర రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది. ఈ నిధులతో ఏపీ సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రస్తుతం అమరావతిలో 9 ప్రాజెక్టులను చేపట్టారు. గురువారం ఆయా ప్రాజెక్టుల సైట్లలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అబువురాజన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీసీఎల్ ఎస్ఈ నరసింహ, సీఆర్డీఏ ఎకౌంట్స్ విభాగం కంపెనీ సెక్రటరీ కె.రాజేష్ బాబు రాజధానిలో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును నాబార్డ్ బృందానికి వివరించారు.


పనుల వివరాలు తెలుసుకుంటున్న నాబార్డు డీజీఎం అబువురాజన్

16 ఏళ్లు నిండితేనే 'గిగ్' కార్మికులుగా అర్హులు

సామాజిక భద్రత కోడ్ మార్గదర్శకాల్లో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లుగా నమోదు కోసం 16 ఏళ్ల వయసు నిండిన వారే అర్హులని కేంద్ర కార్మికశాఖ స్పష్టం చేసింది. కేంద్ర పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులే సామాజిక భద్రత పథకాలకు అర్హులు అవుతారని వెల్లడించింది. నమోదైన కార్మికులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో పాటు డిజిటల్ ఐడీ కార్డు అందిస్తామని పేర్కొంది. ఈ మేరకు సామాజిక భద్రత కోడ్ ముసాయిదా మార్గదర్శకాల్లో అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు పథకం అమలును వివరించింది. కార్మికుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిన కేంద్రం.. రిజిస్ట్రేషన్ సమయంలో కార్మికుడి వయసు 60 ఏళ్లు దాటినా, ఏడాదిలో 90 రోజులు పని చేయకున్నా ఈ పథకం వర్తించదని స్పష్టం చేసింది. పూర్తి వివరాలు https://epaper.eenadu.net లో..

దేశంలోనే తొలిసారిగా ఎయిర్ టాక్సీల రూపకల్పన

- విపత్తుల వేళ వినియోగించేలా..
- ప్రయోగాలు విజయవంతం అంటున్న మ్యాగ్నమ్ వింగ్స్ సంస్థ

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరాలు, పట్టణాల్లో వినియోగించేందుకు ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తెస్తున్నామని మ్యాగ్నమ్ వింగ్స్ సంస్థ ఎండీ అభిరామ్ చావా అన్నారు. గుంటూరు నల్లచెరువులోని సంస్థ ప్రయోగశాలలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రయోగాలు చేస్తున్నారని, తాము రూపొందించిన వీ2 ఎయిర్ టాక్సీని ఇటీవలే విజయవంతంగా పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఇది 110 కిలోల బరువును తరలిస్తుందని చెప్పారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా, సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా తయారుచేశామని చెప్పారు. రోడ్డు మార్గంలో నాలుగు గంటలు పట్టే దూరాన్ని దీనిద్వారా 20 నిమిషాల్లో చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మోటార్లు ఉంటాయని, రెండు పనిచేయకపోయినా ఆటంకం లేకుండా వెళుతుందని, అత్యవసర పరిస్థితుల్లో ప్యారాచూట్ వినియోగించవచ్చన్నారు. రెండేళ్లలో వీటిని అందరూ వినియోగించుకునేలా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దీన్ని పూర్తిగా గుంటూరులోనే రూపొందించామని చెప్పారు. ఇప్పటికి 6 మోడల్స్ రూపొందించామని.. వీటిని రెండేళ్లలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు డాక్టర్ మమత రాయపాటి, డాక్టర్ కార్తీక్ చౌదరి యలవర్తి, తేజోకృష్ణ కనగాల పాల్గొన్నారు.


ఎయిర్ టాక్సీ వద్ద అభిరామ్ తదితరులు

ఒకరిని లోపలికి పంపితే.. అందరూ దార్లోకి వస్తారు

- కోర్టు ఆదేశాలంటే నవ్వులాటగా ఉంది
- మచిలీపట్నం కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం
- పవరేంటో చూపిస్తామంటూ ఘాటు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 'కోర్టు ఆదేశాలంటే నవ్వులాటలా ఉంది. కోర్టు పవరేంటో చూపిస్తాం. ఒక అధికారిని లోపలికి పంపితే అందరూ దార్లోకి వస్తారు. చట్టం కంటే తాము ఎక్కువని అధికారులు భావిస్తున్నారు. వారిని ఎక్కడ నిలబెట్టాలో మాకు తెలుసు' అని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వైకాపా కార్యాలయానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని తామిచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆయన్ను ఆదేశించింది. కమిషనర్ చర్యలు కోర్టు ధిక్కారం కిందకు వస్తాయని హెచ్చరించింది. వివరణ ఇస్తూ అఫిడవిట్ వేయాలని విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

✦ ఆక్యుపెన్సీ ధ్రువపత్రం జారీచేసే విషయంలో హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులిచ్చారని కృష్ణా జిల్లా వైకాపా అధ్యక్షుడు పేర్ని నాని హైకోర్టులో వ్యాజ్యం వేశారు. తాము సమర్పించే దస్త్రాలను పరిశీలించి సర్టిఫికెట్ జారీపై నిర్ణయం తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ పట్టించుకోలేదన్నారు.

✦ గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పార్టీ కార్యాలయం విషయంలో అధికారులు కక్షతో వ్యవహరిస్తున్నారు. న్యాయస్థానాలు చెప్పినా పదేపదే వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చారు. అంతిమంగా ధ్రువపత్రం నిరాకరణకు ఉత్తర్వులిచ్చారు. నిర్మాణ పనులు ఆపాలంటూ నోటీసులిచ్చారు' అన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ కమిషనర్‌కు ఆంగ్లం రాదనుకోవాలా? కోర్టు ఉత్తర్వులు అర్థం కాలేదా? అని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలంటే నవ్వులాటగా ఉందా అని మండిపడ్డారు. కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేశారు.

భవిష్యత్తు నగరంగా అమరావతి

ఎవరెంత బాధపడినా..

- నిర్మాణానికి నూతన సాంకేతిక విధానాల్ని వినియోగిస్తున్నాం
- రాజధానిలో కలిసిపోనున్న విజయవాడ, గుంటూరు, మంగళగిరి
- 'ఆవకాయ్-అమరావతి' వేడుకల ప్రారంభ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆవకాయ్-అమరావతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై ఏపీ సాంస్కృతిక మండలి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి కందుల దుర్గేష్, ఈయూ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, ఎంపీ కేశినేని శివనాథ్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్

ఈనాడు, అమరావతి: 'రాజధాని అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ నగరంగా నిర్మిస్తున్నాం. రానున్న కాలంలో విజయవాడ, గుంటూరు, మంగళగిరి పూర్తిగా అమరావతిలో కలిసిపోతాయి. ఎవరెంత బాధపడినా అమరావతి భవిష్యత్తు నగరంగా (ఫ్యూచర్ సిటీ) మారి తీరుతుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా రూపాంతరం చెందుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో నిర్వహించిన 'ఆవకాయ్-అమరావతి' సాంస్కృతిక వేడుకల్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. అమరావతి తరహా డైనమిక్ సిటీ ఎక్కడా ఉండదు. ఇక్కడ కృష్ణానీరు ఉంది. కాలుష్యం ఉండదు. అమరావతిలో పచ్చదనాన్ని పెంచుతాం. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. నూతన సాంకేతిక విధానాల్ని వినియోగిస్తున్నాం' అని వెల్లడించారు. 'ప్రపంచంలో ఉండే నాలెడ్జ్, సాంకేతికతను రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత నాది. దాన్ని ఉపయోగించుకుని ప్రయోజకులయ్యే బాధ్యత యువతదే. తెలుగుజాతిలో చొరవ, మంచితనం, నైపుణ్యం విలువలు, సామర్థ్యం ఉన్నాయి. అందుకే మనవాళ్లు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా నంబర్ వన్‌గా ఉన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా అక్కడ అత్యధిక తలసరి ఆదాయం తెలుగువారిదే' అని పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..



పున్నమి ఘాట్‌లో పర్యాటక బోట్ ప్రారంభించి అందులో కూర్చున్న సీఎం చంద్రబాబు, ఈయూ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, హౌస్‌బోట్‌ల యజమాని జి.పాపారావు, మంత్రి కందుల దుర్గేష్

సంస్కృతిని మరిస్తే మనల్ని మనం మరిచినట్లే

''ఆవకాయ్ అనగానే గుర్తొచ్చేది ఆంధ్రప్రదేశ్. అది మనందరి సంప్రదాయం. రాబోయే రోజుల్లో ప్రపంచానికే ఆతిథ్యం ఇచ్చే పరిస్థితికి ఆంధ్రప్రదేశ్ రానుంది. 2019-24 మధ్య పండగలు, ఉత్సవాల నిర్వహణ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విజయవాడలో దసరా ఉత్సవాన్ని నిర్వహించాం. కోల్‌కతా, మైసూరును మరిపించేలా నిర్వహించాం. ఇలాంటి సంస్కృతీ సంప్రదాయాల్ని, ఆచారాల్ని కాపాడుకోవాలి. మన సంస్కృతిని మరిచిపోతే మన చరిత్రను, మనల్ని మనమే మరిచిపోయినట్లే.

మూడు పుష్కరాల నిర్వహణ అదృష్టం

తెలుగు సంస్కృతికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, అతిథుల్ని గౌరవించడం మన సంప్రదాయం. కుల, మత బేధాలు లేకుండా సమాజంలో అందరితో ప్రేమగా ఉండటం తెలుగువారికి అలవాటు. ముఖ్యమంత్రిగా మూడు పుష్కరాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నా. 2027లో గోదావరి పుష్కరాలను, 2028లో కృష్ణా పుష్కరాలను నిర్వహించబోతున్నాం.

తెలుగు హీరోలకు ఉండే క్రేజే వేరు

ఆహార సంస్కృతి, పండగలు, సినిమా రంగంలో తెలుగువారికి ఎవరూ సాటిరారు. చరిత్ర ఉన్నంతవరకు తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా ఉండే వ్యక్తి ఎన్టీఆర్. ఏఎన్ఆర్, కృష్ణ, శోభన్‌బాబు, ఎస్వీఆర్, చిరంజీవి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏపీ నుంచి వచ్చినవారే. బాలకృష్ణ అఖండ తాండవం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆయన అన్‌స్టాపబుల్. దేశంలో ఎన్ని సినీ పరిశ్రమలున్నా తెలుగు హీరోలకు ఉండే క్రేజే వేరు.

అప్పట్లో నాపై బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యేక నిఘా

కోహినూర్ వజ్రం దొరికింది ఆంధ్రప్రదేశ్‌లోనే. ఇక్కడి నుంచి నిజాం సంస్థానానికి, అక్కడినుంచి లండన్‌కు చేరింది. అప్పట్లో నేను లండన్ ఎగ్జిబిషన్ చూస్తానంటే 'మీరు ఇక్కడి వస్తే కోహినూర్ వజ్రాన్ని డిమాండ్ చేస్తారు' అని చెప్పి బ్రిటిష్ ప్రభుత్వం నాపై ప్రత్యేక ఇంటెలిజెన్స్ నిఘా పెట్టింది.

గ్రామాలకు వెళ్లి సంక్రాంతి పండగ చేసుకోవాలి

సంక్రాంతి అంటే పెద్దపండగ. ఎక్కడెక్కడో ఉన్నవారంతా గ్రామాలకు, తాము పుట్టిన ప్రాంతానికి వెళ్లి అక్కడ అందరితో కలిసి పండగ చేసుకోవాలి. మా సతీమణి 20 ఏళ్ల ముందే ఎక్కడున్నా సంక్రాంతికి ఊరికి వెళ్లాలనే సంప్రదాయాన్ని నెలకొల్పారు. దాన్ని ఇప్పటికీ పాటిస్తున్నా. ప్రజలందరూ గ్రామాలకు వెళ్లి పుట్టినవారితో మమేకం కావాలి. మన సంప్రదాయాలతో అనుసంధానం కావాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

'ఆవకాయ్-అమరావతి' అద్భుతః



తోలుబొమ్మలాటలు..

విజయవాడలోని పున్నమిఘాట్‌లో ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు గురువారం వేడుకగా ఆరంభమయ్యాయి. జామర్స్ లైవ్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజికల్ కన్సర్ట్ సంగీత ప్రియులను మైమరిపించింది. సీఎం చంద్రబాబు, ఆహూతులు కార్యక్రమానికి విచ్చేసిన సమయంలో డప్పు కళాకారుల ప్రదర్శన వేరే స్థాయిలో సాగింది. ఆహూతుల మధ్యలోనే ఉంటూ చేసిన భారీ తోలు బొమ్మల ప్రదర్శన మరో ప్రధాన ఆకర్షణ. రాజస్థాన్‌కు చెందిన 13వ తరం నగాడా కళాకారుడు నాథులాల్ సోలంకి తన ప్రదర్శనతో అందరినీ కట్టిపడేశారు. - ఈనాడు, అమరావతి



'ఆవకాయ్-అమరావతి'లో ప్రత్యేక ఆకర్షణగా ఏనుగు తోలుబొమ్మ

5 నెలల్లో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్

'దేశంలో మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ రాబోయే 5 నెలల్లో అమరావతిలో రాబోతుంది. రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారుచేసే శక్తి తెలుగు జాతికి ఉండనుంది. విశాఖలో డేటాసెంటర్లు పెట్టేందుకు చాలా కంపెనీలు వస్తున్నాయి. ఏఐ వస్తే ఉద్యోగాలు పోతాయంటున్నారు. ఎక్కడికీ పోవు. ఉద్యోగాలు కల్పించడానికి పర్యాటకాన్ని ప్రమోట్ చేస్తున్నాం.'

బ్లూవ్యాలీ ఏర్పాటుకు ఏపీ కంటే మెరుగైన రాష్ట్రం మరొకటి లేదు

'బ్లూ వ్యాలీ ఏర్పాటుకు దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను మించిన రాష్ట్రం మరొకటి లేదు. యూరోపియన్ యూనియన్‌తో విన్‌విన్ విధానంలో పనిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధం. దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25% ఆంధ్రప్రదేశ్‌కే వచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ఇటీవల పేర్కొంది. పీపీపీ విధానంలో 32% ప్రాజెక్టులు రాష్ట్రంలోనే ప్రారంభమైనట్లు కేంద్రం వెల్లడించింది. ప్రపంచంలోనే తెలుగుజాతిని నంబర్ వన్‌గా నిలపాలనేదే మా సంకల్పం.'

తెలుగుభాష సాహిత్య విజ్ఞానాన్ని వారసత్వంగా అందిస్తోంది. నన్నయ్య, తిక్కన, ఎర్రన మహాభారతాన్ని ఎంతో మధురంగా రాశారు. పోతన భాగవతం చదివితే భక్తి పరవశం కలుగుతుంది. అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలతో సాహిత్యానికి సంగీతాన్ని జతచేశారు. వీరేశలింగం, గురజాడ రచనలు సమాజంలో మార్పు తెచ్చాయి. శ్రీశ్రీ లాంటివారు తమ రచనలతో సమాజాన్ని చైతన్యపరిచారు.'

– సీఎం చంద్రబాబు

బలపడిన వాయుగుండం

తుపానుగా మారే అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం.. తీవ్ర వాయుగుండంగా బలపడినట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. ఇది శ్రీలంక తీరం వైపు దూసుకొస్తోంది. గురువారం సాయంత్రానికి పొట్టువిల్ (శ్రీలంక)కు 250 కిలోమీటర్లు, బట్టికోల(శ్రీలంక)కు 300, ట్రింకోమలి (శ్రీలంక)కి 400, కరైకల్ (పుదుచ్చేరి)కు 780, చెన్నైకి 940 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. శుక్రవారం ఉదయంలోగా తుపానుగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. తుపానుగా రూపాంతరం చెందితే 'ఓర్ణబ్ (అర్ణబ్)'గా నామకరణం చేయనున్నారు. ఈ పేరును బంగ్లాదేశ్ సూచించింది. దీనికి 'సముద్రం' అని అర్థం. ఇది వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంకలో పొట్టువిల్, ట్రింకోమలి మధ్యలో శుక్రవారం రాత్రి తీరం దాటే అవకాశముంది. దీని ప్రభావంతో శుక్ర, శనివారాల్లో తమిళనాడు, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా. దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

■ రాబోయే 4 రోజుల్లో ఉత్తర కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో పొగ మంచు కురిసే అవకాశముందని తెలిపింది. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో, శని, ఆది, సోమవారాల్లో పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని అంచనా. ■ రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. గురువారం విశాఖపట్నం, కడప, అనంతపురం ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు తగ్గాయి.

నెల్లూరుకు టాటా పవర్

రూ.6,675 కోట్లతో ప్రాజెక్టు

- 200 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటు
- 2028 జనవరి నాటికి ఉత్పత్తి
- సౌర విద్యుత్ తయారీ కేంద్రంగా నెల్లూరు.. నాయుడుపేట

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇంగోట్ అండ్ వేఫర్ తయారీ ప్రాజెక్టును టాటా పవర్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ రూ.6,675 కోట్లతో ఏర్పాటు చేస్తోంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఇఫ్కో సెజ్‌లో 200 ఎకరాల్లో (33 శాతం గ్రీన్ ఏరియా బఫర్‌తో కలిపి) ఈ ప్రాజెక్టు ఏర్పాటవుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు వెయ్యి మందికి ఉపాధి లభించనుంది. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల రంగంలో టాటా సంస్థ కీలకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 4,721 మెగావాట్ల సౌర, 1,034 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను, 700కు పైగా నగరాల్లో 3 వేల మెగావాట్ల రూఫ్‌టాప్ ప్రాజెక్టులను ఈ సంస్థ నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్ ద్వారా దేశీయ అవసరాలతో పాటు ఎగుమతులు చేయాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

రెండేళ్లలో ఉత్పత్తిలోకి

ప్లాంటు నిర్మాణాన్ని 2028 జనవరి నాటికి పూర్తి చేసి.. ఉత్పత్తి ప్రారంభించాలన్నది లక్ష్యం. ప్రస్తుతం 120 ఎకరాల్లో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందించింది. భవిష్యత్తు విస్తరణ కోసం మరో 80 ఎకరాలను వినియోగించుకోనుంది. సంస్థకు కేటాయించే భూములను సెజ్ పరిధి నుంచి మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సొంత అవసరాలకు 200 మెగావాట్ల సోలార్ ప్లాంటు

ఇంగోట్, వేఫర్ల తయారీ యూనిట్‌కు అవసరమైన విద్యుత్ కోసం క్యాప్టివ్ విధానంలో 200 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. దీనికి అవసరమైన భూములను నెడ్‌క్యాప్ ప్రత్యేకంగా కేటాయిస్తుంది. ఈ ప్రక్రియను 6 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు కోసం కనిగిరి రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా రోజుకు 12.6 మిలియన్ లీటర్ల నీటిని సంస్థ వినియోగించుకుంటుంది.

నెల్లూరు, నాయుడుపేట కేంద్రంగా

నెల్లూరు, నాయుడుపేట ప్రాంతం సోలార్ ప్యానళ్లు, ఇతర కాంపోనెంట్ల తయారీ కేంద్రంగా మారనుంది. నెల్లూరులో ఇండోసోల్ సంస్థ 10 గిగావాట్ల ఫొటో వోల్టాయిక్ సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ప్లాంటు కోసం భూసేకరణ ప్రక్రియ మొదలైంది. ప్రీమియర్ ఎనర్జీస్ నాయుడుపేట సెజ్‌లో ఇంటిగ్రేటెడ్ ప్లాంటు (ఇంగోట్, వేఫర్, సోలార్ సెల్స్) ఏర్పాటు చేస్తోంది. వోల్టసన్ ల్యాబ్స్ (సెల్, మాడ్యూల్స్) తయారీ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. తాజాగా టాటా పవర్ సంస్థ ఇంగోట్, వేఫర్ తయారీ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. దీంతో సౌర విద్యుత్ ప్యానళ్లు, ఇతర కాంపోనెంట్ల తయారీకి ఈ ప్రాంతం అనువైనదిగా అభివృద్ధి చెందనుంది.

చిప్‌ల తయారీలో కీలకం

సెమీకండక్టర్స్ (కంప్యూటర్ చిప్‌లు, ట్రాన్సిస్టర్స్), సోలార్ సెల్స్ తయారీకి ఇంగోట్స్ (లార్జ్ మెటల్ బ్లాక్‌లు), వేఫర్స్ (పలుచని పొరలతో-సిలికాన్) అవసరం ఉంటుంది. ఫోన్లు, ఎలక్ట్రానిక్ విడి భాగాలు, సౌర విద్యుత్ ఉత్పత్తికి ఇవి బేస్‌గా పనిచేస్తాయి. వైర్లు, షీట్లు, యంత్ర విడి భాగాల తయారీలోనూ ఇంగోట్స్‌ను వినియోగిస్తారు. ఎలక్ట్రానిక్స్‌లో క్లిష్టమైన మైక్రోఫ్యాబ్రికేషన్ ప్రక్రియల్లో వేఫర్‌లు వాడతారు. వాటిని దేశీయంగా టాటా సంస్థ తయారు చేయనుంది.

ఐఐటీ మద్రాస్‌లో పరమ్ రుద్ర సూపర్ కంప్యూటింగ్ సిస్టమ్



చెన్నై, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 3.1 పెటాఫ్లాప్ పరమ్ రుద్ర సూపర్ కంప్యూటింగ్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చింది. సీ-డాక్ రుద్ర సిరీస్ సర్వర్లతో దేశంలో తయారైన ఈ వ్యవస్థ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌పై నడుస్తుందని ఐఐటీ మద్రాస్ గురువారం ప్రకటనలో పేర్కొంది. ఏరోస్పేస్, మెటీరియల్స్, క్లైమేట్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ వంటి రంగాల్లో ప్రపంచ స్థాయిలో పోటీ పడేందుకు కూడా వీలుగా ఉండనుందని పేర్కొంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ ఇటీవల ఈ సూపర్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'పరమ్ శక్తి' పేరిట ప్రారంభమైన అధునాతన వ్యవస్థను పరిశోధకులు ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రారంభోత్సవంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి, సీ-డాక్ డైరెక్టర్ ఇ.మగేష్, ఐఐటీ మద్రాస్ కంప్యూటర్ సెంటర్ ఛైర్మన్, ఆచార్యులు జి.ఫణికుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలు పరిసమాప్తం



రికార్డు స్థాయిలో భక్తుల రాక

- 9 రోజుల్లో 7.09 లక్షల మంది సందర్శన

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలు గురువారం అర్ధరాత్రితో పరిసమాప్తమయ్యాయి. డిసెంబరు 30న ప్రారంభమైన ఈ దర్శనాలకు రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు. పది రోజుల్లో 7.60 లక్షల మందికి దర్శనాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకోగా తొమ్మిది రోజులకే 7.09 లక్షల మందికి ఆ భాగ్యం కలిగింది. గతేడాది 6.83 లక్షల మందికి పది రోజుల్లో దర్శనం లభించగా.. ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 8 లక్షలకు చేరుకోనుంది. ఈసారి తొమ్మిది రోజుల్లో హుండీ కానుకలు రూ.36.86 కోట్లు లభించగా, లడ్డూలు 37.97 లక్షలు విక్రయించారు. 2.06 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. మరోపక్క, శ్రీవారి దర్శనం కోసం గురువారం సాయంత్రానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 15 గంటల్లో దర్శనం కల్పించనున్నట్లు తితిదే ప్రకటించింది. వైకుంఠ ద్వార దర్శనాలు ముగిసిన నేపథ్యంలో సర్వదర్శనానికి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు టోకెన్ల జారీని గురువారం ప్రారంభించారు. మొత్తం పది వేల టోకెన్లు ఇచ్చారు. శ్రీవారి మెట్టు మార్గంలో మరో రెండు వేల టోకెన్లు జారీచేశారు.

శ్రీవాణి కోటాకు ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్

తిరుమలలో రోజువారీ కరెంట్ బుకింగ్ విధానంలో ఆఫ్‌లైన్‌లో జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టికెట్లను శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ కింద జారీ చేయనున్నారు. రోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో వాటిని అందుబాటులో ఉంచుతారు. మధ్యాహ్నం 2 గంటల వరకు నగదు చెల్లించి పొందవచ్చు. టికెట్ పొందిన భక్తులు అదేరోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. నలుగురికి (1+3) మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతి ఉంటుంది. దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధ్రువీకరణ, మొబైల్ నంబరు వంటి వివరాలు తప్పనిసరి. మొదట వచ్చిన వారికి మొదట విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

25న సిఫారసు దర్శనాలు రద్దు

- రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు


తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సన్నిధిలో ఈ నెల 25న రథసప్తమిని పురస్కరించుకుని తితిదే అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి గురువారం ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఆ రోజు ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని, వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫారసు లేఖలూ స్వీకరించబోమని తితిదే ఓ ప్రకటనలో వెల్లడించింది. రథసప్తమి సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు. తిరుపతిలో ఈ నెల 24 నుంచి 26 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయరు.

రథోత్సవం ఇలా..

- ■ తెల్లవారుజామున 5.30 నుంచి ఉదయం 8.00 వరకు సూర్యప్రభ వాహన సేవ జరగనుంది. సూర్యోదయం ఉదయం 6.45 గంటలకు ఉంటుంది.
- ■ ఉదయం 9–10 : చిన్నశేష వాహనం
- ■ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 : గరుడ వాహనం
- ■ మధ్యాహ్నం 1–2: హనుమంత వాహనం
- ■ మధ్యాహ్నం 2–3 : చక్రస్నానం
- ■ సాయంత్రం 4–5 : కల్పవృక్షం
- ■ సాయంత్రం 6–7 : సర్వభూపాలం
- ■ రాత్రి 8–9 : చంద్రప్రభ వాహనం

'రాయలసీమ ఎత్తిపోతలు' చేపట్టలేదని జగనే చెప్పారు

- డీపీఆర్‌కు ముందస్తు పని చేసుకుంటున్నామని అఫిడవిట్ వేశారు
- మంత్రులు పయ్యావుల, జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పేరుతో మాజీ సీఎం జగన్ రూ.900 కోట్ల అవినీతికి పాల్పడ్డారని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు.. సచివాలయంలో గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం లేదని, డీపీఆర్ తయారు చేయడానికి ముందస్తు పని చేసుకుంటున్నామని ఎన్జీటీలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో జగన్ అఫిడవిట్ వేయించారు. ప్రిపరేటరీ వర్క్ పేరుతోనే నిధులు దోచేశారు. ఎత్తిపోతల ప్రాజెక్టు పేరు చెప్పి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తెచ్చిన నిధులు ప్రభుత్వానికి చేరలేదు. అందుకే దీన్ని తెఫ్ట్ ఇరిగేషన్ పథకం అంటున్నాం. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఇరిగేషన్ ప్రాజెక్టు కాదు.. తాగునీటి ప్రాజెక్టు అంటూ 2023లో జీవో ఇచ్చారు. ప్రాజెక్టుల పేరుతో రాయలసీమ రైతులను జగన్ మోసం చేశారు. 2020లో 102 సీమ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఇది సీమకు న్యాయం చేయడమా? మిగులు జలాల మీద వాటాను కోరబోమని నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి కృష్ణా ట్రైబ్యునల్ ముందు అఫిడవిట్ వేశారు. సీమ నీటి హక్కులను శాశ్వతంగా సమాధి చేశారు. జగన్ మోసపూరిత మాటలను రాయలసీమ ప్రజలు గుర్తించాలి. జాతికి అంకితం చేసేశానంటున్న వెలిగొండ ప్రాజెక్టుకు జగన్ రాగలరా' అని ప్రశ్నించారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో సంబంధం లేదు..

'తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మాకు, మా ప్రభుత్వానికీ ఎలాంటి సంబంధమూ లేదు' అని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి పయ్యావుల స్పష్టం చేశారు. ఆగిపోయిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును ఆపేది ఏంటని ప్రశ్నించారు. తామే ఈ ప్రాజెక్టును అప్పట్లో ఆపామని భారాస నేత హరీశ్‌రావు మాట్లాడుతూ చెప్పారని మంత్రి గుర్తుచేశారు. 'ఏ ప్రాజెక్టుకూ రూపాయి ఖర్చు పెట్టని ఆయనకు వాటి వద్దకు వెళ్లేందుకు ముఖం చెల్లదు. కుప్పం బ్రాంచి కెనాల్‌కు డమ్మీగేటు పెట్టి జగన్ ప్రారంభించడం చూసి అందరూ నవ్వుకున్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతలతో సీమను చంద్రబాబు సస్యశ్యామలం చేశారు. ఇప్పటి వరకు రూ.79,227 కోట్లు అప్పు చేశాం. చట్ట విరుద్ధంగా ఒక్క రూపాయి కూడా రుణం తీసుకోలేదు' అని అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడేందుకు జగన్ అసెంబ్లీకి వస్తే సమాధానం ఇస్తాం' అని తెలిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2014-19 మధ్య రాయలసీమలో రూ.20వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు.

చినగొల్లపాలేన్ని కబళిస్తోన్న కడలి

- ఎంపీ చొరవతో నేడు కేంద్ర బృందం పరిశీలన



కోతకు గురవుతున్న చినగొల్లపాలెం వ్యవసాయ భూములు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: పచ్చని వాతావరణానికి నిలయమైన కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని చినగొల్లపాలెం గ్రామం సముద్ర కోతకు గురవుతోంది. ఇప్పటికే ఈ గ్రామంలో కనుచూపు మేరలో కొబ్బరి, సరుగుడు, పంటచేలు సాగరంలో కలిసిపోయాయి. దీంతో వందల మంది రైతులు రోడ్డున పడ్డారు. సుమారు 300 మీటర్ల వరకు పొలాల గట్లను కోసుకుంటూ సముద్రం చొచ్చుకొచ్చింది. గతంలో ఈ ప్రాంతంలో రక్షణ గోడ, డ్రెడ్జింగ్ తదితర పనులకు రూ.291.5 కోట్లతో అంచనాలు రూపొందించి, గాలికొదిలేశారు. ప్రధానంగా కోడూరు, నాగాయలంక మండలాల్లోని ఔట్‌ఫాల్ స్లూయిస్‌లు దెబ్బతినడంతో ఎగువ నుంచి కాలువల ద్వారా సముద్రంలో కలిసే నీరు వెనక్కి వచ్చేస్తోంది. దీంతో సుమారు ఐదు వేల ఎకరాల వ్యవసాయ భూముల్లోకి ఉప్పునీరు చేరి బీడుగా మారాయి. సముద్ర కోత కారణంగా చినగొల్లపాలెం కనుమరుగవుతోందని, కోడూరులో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చెన్నై నుంచి జాతీయ తీర పరిశోధన కేంద్రం (ఎన్‌సీసీఆర్) శాస్త్రవేత్తల బృందం శుక్రవారం చినగొల్లపాలెం, కోడూరుల్లో పర్యటించనుంది. ఈ బృందం సముద్ర కోతకు గురవుతున్న గ్రామాలు.. దెబ్బతిన్న ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితులను పరిశీలించనుంది.



కోడూరులో దెబ్బతిన్న ఔట్‌ఫాల్ స్లూయిస్

రూ. 20,252 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

13,334 ఉద్యోగాల కల్పన లక్ష్యం ● విద్యుత్తు ఛార్జీల తగ్గింపు ఉత్తర్వులకూ ఆమోదం

- వచ్చే మార్చి నాటికి యూనిట్ ధర రూ.4.80
- రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి



గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎస్ విజయానంద్, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, నారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.20,252.42 కోట్ల పెట్టుబడులతో 14 పారిశ్రామిక, పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. ఈ పెట్టుబడుల వల్ల రాష్ట్రంలో 13,334 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇందులో విమాన తయారీ కంపెనీ, విమాన శిక్షణ స్కూల్, స్టార్ హోటళ్లు, ఆహార శుద్ధి పరిశ్రమలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో కీలకాంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. వైకాపా ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించినందున ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ అభివృద్ధి పథకానికి అనుమతి లభించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 క్లస్టర్లలో కామన్ ఫెసిలిటీ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. రూ.200 కోట్లతో అమలయ్యే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వమే 90% నిధులు భరిస్తుంది. వీటి వల్ల 2030 నాటికి 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ అమలు చేస్తుంది. మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఛార్జీలు తగ్గించాం

2019-20 నుంచి 2023-24 మధ్య డిస్కంలు అన్నీ 12,771.96 కోట్ల మేర ట్రూఅప్ ఛార్జీలు వేయాలని విద్యుత్తు నియంత్రణ మండలికి జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ సంస్థలు మళ్లీ నియంత్రణ మండలిని సంప్రదించగా రూ.4,495 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను ఆమోదించింది. ఆ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని మంత్రిమండలి ఆమోదించింది. 'జగన్ తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచితే కూటమి ప్రభుత్వం 39 పైసల మేర తగ్గించింది. గతంలో యూనిట్ ధర రూ.5.19 ఉండగా.. ఇప్పటికే రూ.4.90కి తగ్గింది. మార్చి నాటికి రూ.4.80కి తగ్గిస్తాం. వచ్చే సంవత్సరంలో మరో 20 పైసలు తగ్గించి యూనిట్ విద్యుత్‌ను రూ.4.60కే సరఫరా చేస్తాం' అని మంత్రి తెలిపారు.

లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రా హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు

ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను ఇక నుంచి లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్ కంపెనీగా పరిగణిస్తారు. రాష్ట్రంలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ కోసం సంస్థాగత మూలధనాన్ని సమీకరించేందుకు మంత్రిమండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిధికి రాష్ట్ర ప్రభుత్వం తొలుత 19-20 శాతం మూలధనంలో వాటాగా అందిస్తుంది. ఏపీ మారిటైం బోర్డు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్, రోడ్డు అభివృద్ధి సంస్థ, ఎయిర్‌పోర్టు అభివృద్ధి సంస్థలను ఒకే గొడుగు కిందకు చేర్చి రూ.250 కోట్లతో మూలధన నిధిని ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

■ అనకాపల్లి జిల్లా డి.ఎల్.పురంలో 2.9 కి.మీ. వాటర్ ఫ్రంట్ పొడవునా క్యాప్టివ్ ఓడరేవు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ఓడరేవు ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించారు. అది ఇప్పుడు కొత్తగా ఎంఎస్ ఏఎంఎన్ఎస్ పోర్ట్స్ రాజయ్యపేట ప్రైవేటు లిమిటెడ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్‌గా మార్చేందుకు అనుమతి ఇచ్చారు. ఆ ఓడరేవు నిర్మాణాన్ని ఈ ఎస్‌పీవీకి అప్పగించాలని నిర్ణయించారు.

■ రాష్ట్రంలో బార్లపై విధించిన అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం (ఏఆర్ఈటీ) ఉపసంహరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.99 ఎంఆర్‌పీ (180ఎంఎల్), ఐఎంఎఫ్ఎల్, బీరు, వైన్, ఆర్‌టీడీలు మినహా ఇతర అన్ని సైజుల మద్యం బాటిళ్ల ఎంఆర్‌పీపై రూ.10 పెంచాలని నిర్ణయించారు. రిటైలర్ మార్జిన్ 1శాతాన్ని పెంచాలన్న మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి రూ.506 కోట్ల మేర ఆదాయం పెరుగుతుంది.

■ మున్సిపల్ కార్పొరేషన్ల చుట్టూ 5 కి.మీ. పరిధిలోని పర్యాటక కేంద్రాల్లో మూడు.. అంతకన్నా ఎక్కువ నక్షత్రాల హోటళ్లలో ప్రస్తుత పరిమితులకు అదనంగా మైక్రో బ్రూవరీలను అనుమతించేందుకు ఆమోదం.

■ జలజీవన్ మిషన్ కింద మంచినీటి సరఫరా పథకాలు నిర్మించేందుకు వీలుగా జల జీవన్ నీటి సరఫరా కార్పొరేషన్‌కు రూ.12 వేల కోట్ల సమీకరణకు ఆమోదం. ఈ కార్పొరేషన్‌కు ఎన్ఏబీఎఫ్ఐడీ సమకూర్చిన రూ.5,000 కోట్ల రుణానికి పూచీకత్తుగా ఉండేందుకు ఆమోదం.

■ ఎస్సీ లబ్ధిదారులకు ఇచ్చిన హామీలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రూ.1,500 కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీ ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అనుమతి.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాశ్. చిత్రంలో యామినీశర్మ, కిలారు దిలీప్

జగన్‌ను అలాగే వదిలేస్తే అవినీతికి కళ్లెం వెయ్యలేం

భాజపా నేత జయప్రకాశ్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ అక్రమాలపై విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు. జగన్ లాంటి వ్యక్తులను అలాగే వదిలేస్తే అవినీతికి కళ్లెం వెయ్యడం సాధ్యం కాదని పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "2019-24 మధ్య జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. దెబ్బతిన్న వ్యవస్థలను కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకెళ్తుంటే వైకాపా నాయకులు ఓర్వలేక బురద జల్లే కుట్రలు చేస్తున్నారు" అని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నేతలు కిలారు దిలీప్, యామినీశర్మ పాల్గొన్నారు.

145 కేసులు.. 30 సార్లు జైలుకు

అంతర్రాష్ట్ర గజదొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

పాలకోడేరు, న్యూస్‌టుడే: వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గజదొంగ ఆరేపల్లి దుర్గారావు ఎలియాస్ బుడగ పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు పోలీసులకు చిక్కాడు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం మేకవారిపాలెం శివారు నవీన్ మిట్టల్ కాలనీకి చెందిన ఇతనిపై తెలుగు రాష్ట్రాల్లో 145 కేసులు నమోదయ్యాయి. 30 సార్లు జైలుకు వెళ్లాడు. అయినా తీరు మారలేదు. తాజాగా మరోమారు దొంగతనానికి పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ కేసు వివరాలను గురువారం పాలకోడేరులో భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని కలిదిండి లావణ్య ఇంట్లో గత నెల 29న చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం నిందితుడు విస్సాకోడేరు సెంటర్‌లో ఉండగా పట్టుకున్నారు. అతన్నుంచి రూ.7.18 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుర్గారావుపై మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉందని డీఎస్పీ వెల్లడించారు.

స్పీడు పెంచుదాం.. మళ్లీ మనదే అధికారం

- వచ్చే ఏడాది పార్టీ సభ్యత్వ కార్యక్రమం
- పార్లమెంటరీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: 'మన అందరిదీ సింగిల్ లైన్.. సింగిల్ ఎజెండా. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఒక్కరే మన నాయకుడు. నాతోపాటు మీరంతా సైనికులే. మరింత స్పీడ్ పెంచుదాం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర తిరగరాద్దాం' అని తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపు ఇచ్చారు. పార్టీ కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటానన్నారు. నూతనంగా నియమించిన పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జోనల్ కోఆర్డినేటర్లతో ఉండవల్లిలోని నివాసంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. 'పార్టీ పిలుపు అందిపుచ్చుకుని కార్యక్రమాలు సమర్థంగా అమలు చేస్తే అన్ని నియోజకవర్గాల్లోనూ గెలవొచ్చు. మంగళగిరిలో విజయమే ఇందుకు ఉదాహరణ. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చాలి. పనితీరుపై మూడు నెలలకోసారి సమీక్షిస్తాం. ఇది రాష్ట్ర కమిటీకి కూడా వర్తిస్తుంది. మనం తీసుకునే 10 నిర్ణయాల్లో మూడు తప్పులు ఉంటాయి. వాటిని సరిచేసుకుని ముందుకెళ్లాలి. మిమ్మల్ని నియమించింది పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు. పార్టీ ఇచ్చిన ఆదేశాలను అందరూ తు.చ. తప్పకుండా పాటించాలి. సమస్యలు ఉంటే బాధ్యత తీసుకుని పరిష్కారానికి కృషిచేయాలి. ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, జోనల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకోండి. నియోజకవర్గాల్లో ప్రజాదర్బార్, కార్యకర్తల సమావేశాలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత మీదే. జిల్లా స్థాయి నుంచి క్లస్టర్, యూనిట్, బూత్, అనుబంధ సంఘాలతో సహా అన్ని కమిటీలు పూర్తి చేయాలి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, మండల అధ్యక్షులతో క్యాలెండర్ ప్రకారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి' అని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

కూటమి 15 ఏళ్లు కలిసిసాగాలి

'పార్టీ కోసం పూర్తి సమయం కేటాయిస్తాను. అందరం కలిసి పార్టీని బలోపేతం చేద్దాం. నెలకోసారి కూటమి పార్టీ నేతలతో సమావేశమై సమన్వయం చేసుకోవాలి. మనం 15 ఏళ్లపాటు కలిసికట్టుగా ముందుకెళ్లాలి' అని తెలిపారు.

అందర్నీ గౌరవిస్తాం.. పనిచేస్తే గుర్తిస్తాం

'తెదేపాలో ఉత్తమ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చాం. అందరినీ గౌరవిస్తాం. పనిచేసేవారిని గుర్తిస్తాం. ప్రతి ఒక్కరూ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి. మై టీడీపీ యాప్ ద్వారా వచ్చే సూచనలను అమలు చేయాలి. ఇన్‌ఛార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని జిల్లాలో పాలనాపరమైన అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లాలి. పార్టీకి కార్యకర్తే అధినేత. 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు కార్యకర్తలను కలిసి, వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. జగన్‌రెడ్డి ఏనాడూ కార్యకర్తలను పట్టించుకోలేదు. పరదాలు కట్టుకుని తిరిగారు. పార్టీ కార్యక్రమాల నిర్మాణంపై దృష్టిపెట్టాలి. సోషల్ మీడియాపైనా దృష్టిపెట్టండి. వచ్చే ఏడాది సభ్యత్వ కార్యక్రమం చేపడతాం. అందుకు సిద్ధంగా ఉండాలి' అని లోకేశ్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లు మంతెన సత్యనారాయణరాజు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, సుజయ్‌కృష్ణ రంగారావు, దీపక్‌రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవిరావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'తూర్పు'లో సీఎం పర్యటన

ఈనాడు, రాజమహేంద్రవరం: తూర్పు గోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. తొలుత స్థానిక వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం ప్రజావేదిక సభలో మాట్లాడి, నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం అమరావతి చేరుకుంటారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కోనసీమలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని ఇటీవల తూర్పుగోదావరిలో విలీనం చేశారు. హామీ నెరవేర్చిన తరువాత నియోజకవర్గ పర్యటనకు వస్తున్న పార్టీ అధినేతకు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు తెదేపా శ్రేణులు ఏర్పాట్లు చేశాయి.

అమరావతిపై జగన్ విషప్రచారం

మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి విస్తరణ కోసం భూసమీకరణ ప్రారంభమైన వేళ మాజీ సీఎం జగన్ విషప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ విమర్శించారు. భూసమీకరణలో భూములు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రైతులు ముందుకు వస్తుండడంతో దాన్ని ఆపేయాలని జగన్ విషప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. అమరావతిపై జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సచివాలయంలో గురువారం నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. "జగన్ అసలు రివర్ బేసిన్‌కి, రివర్ బెడ్‌కి తేడా తెలుసుకోవాలి. రాజధానిపై మిడిమిడి జ్ఞానంతో జగన్ మాట్లాడుతున్నారు. కృష్ణా నది వెడల్పు, ప్రవాహం ఎంత? కరకట్ట ఎంత ఉండాలనే అంశాలను పరిగణనలోకి తీసుకుని అమరావతి నిర్మాణం చేస్తున్నాం. కరకట్ట వెడల్పుపైనా జలవనరుల శాఖ అధికారులతో నిత్యం సంప్రదింపులు చేస్తున్నాం. నదీగర్భంలో ఎక్కడా పట్టాభూములు లేవు. విజయవాడ-మంగళగిరి వెళ్లేందుకు సీడ్‌యాక్సెస్ రోడ్డు, పశ్చిమ బైపాస్ సిద్ధమయ్యాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానమంత్రిని కలిసి విన్నవించడంతో పాటు కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అమిత్ షాలను కోరారు. రాష్ట్రానికి రాజధాని ఉండాలి. సీఎం ఎక్కడ కూర్చుంటే అక్కడ రాజధాని ఎలా అయిపోతుంది? ఇవాళ సీఎం శ్రీకాకుళం వెళ్తే అది, రేపు ఇంకోచోటకు వెళ్తే అది రాజధాని అయిపోతాయా? నగరాలన్నీ చాలావరకూ నదీ తీరాల్లోనే వెలిశాయి. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అమరావతిని అభివృద్ధి చేసి తీరతాం" అని తెలిపారు.

యూరప్ సంస్కృతికి దగ్గరగా ఏపీ

- పెట్టుబడుల ఆకర్షణలో మీ డైనమిజం ఆకట్టుకుంటోంది
- 'ఆవకాయ్-అమరావతి' సభలో ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్

ఈనాడు, అమరావతి: 'భారత్‌లో కొత్త రాజధాని అమరావతి ఓ ప్రభావవంతమైన ప్రాంతం. వ్యవసాయం, నైపుణ్యం, ఆర్థిక వృద్ధిలో, పెట్టుబడుల్లో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా ఉంది. విదేశీ పెట్టుబడులు పెద్దఎత్తున ఆకర్షిస్తోంది. ఈ డైనమిజం యూరోపియన్ యూనియన్ (ఈయూ)ను విశేషంగా ఆకట్టుకుంటోంది' అని ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్ అన్నారు. విజయవాడలో గురువారం ప్రారంభమైన 'ఆవకాయ్-అమరావతి' ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో హెర్వే డెల్ఫిన్ విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఏపీతో కలవడానికి ఈయూ సిద్ధం

భారత్-ఈయూ సదస్సుతో రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుంది. సెమీ కండక్టర్లు, అగ్రి ఫుడ్, ఏఐ, గ్రీన్ హైడ్రోజన్, ఇన్నోవేషన్, స్టార్టప్ హబ్ రంగాల్లో భారత్‌తో కలిసి పని చేస్తాం. రెండు దేశాల బంధంలో ఏపీ కూడా కీలక భాగస్వామిగా ఉండబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రంగంలో కలిసి పని చేసే ఆస్కారం ఉంది. యూరోపియన్ యూనియన్ ఏపీతో కలవడానికి సిద్ధంగా ఉంది. సంప్రదాయం, సంస్కృతిని మేళవిస్తూ అంతా కలిసి నిర్వహిస్తున్న కార్యక్రమం విజయవంతం కావాలి. తెలుగు సంప్రదాయంలో ఆవకాయది విశేషమైన రుచి.

బాహుబలి చూశా..

ఆంధ్రప్రదేశ్‌లోని సంస్కృతీ సంప్రదాయాలు ఈయూకి దగ్గరగా ఉన్నాయి. రాజమౌళి తీసిన బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలు చూశాను. అందులో 'నాటు నాటు' పాట నన్ను ఎంతో ఆకర్షించింది. ఏపీకి చెందిన కూచిపూడి, కలంకారి, కొండపల్లి బొమ్మలు ప్రపంచాన్ని ఆకర్షించాయి. కళలు, సినిమా, సాహిత్యం, సంగీతం వివిధ సమాజాలను దగ్గర చేస్తాయి. ఇటీవల జరిగిన 30వ ఈయూ ఫిల్మ్ ఫెస్టివల్ త్వరలో ఏపీలోనూ నిర్వహించేందుకు ఆస్కారం ఉంది.

చంద్రబాబుతో డెల్ఫిన్ భేటీ

సీఎం చంద్రబాబుతో యూరోపియన్ యూనియన్ రాయబారి హెర్వే డెల్ఫిన్ గురువారం భేటీ అయ్యారు. ఈయూ-భారత సంబంధాలు, ఈయూ- ఏపీ సంబంధాల గురించి చర్చించినట్లు 'ఎక్స్' వేదికగా చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న విస్తృత అవకాశాల్ని ఆయనకు వివరించినట్లు పేర్కొన్నారు.





'ఆవకాయ్-అమరావతి' వేదికపై సీఎం చంద్రబాబు, హెర్వే డెల్ఫిన్‌ల ఆత్మీయ సంభాషణ ★ కళాకారుల నృత్య ప్రదర్శన

'ఆవకాయ్...అమరావతి' ఓ సాంస్కృతిక విప్లవం

– కందుల దుర్గేష్, పర్యాటకశాఖ మంత్రి



గతంలో సాహిత్యం, సంగీతం, సినిమా, నాటకాలు, కళలు, నృత్యం ఇలా ఒక్కోదానికి ఒక్కో వేదిక ఉండేవి. 'ఆవకాయ్...అమరావతి' కార్యక్రమం ద్వారా వీటన్నింటినీ ఒక వేదికపైకి తీసుకొచ్చాం. సాహిత్యం, కళల్లో ఇదో ఆరెంజ్ రివల్యూషన్. ఏపీ దేశానికి కోహినూర్ వజ్రం లాంటిది. ఇక్కడ ప్రతి నదికీ ఓ కథ ఉంది. ప్రతి కళకూ ఆత్మ ఉంది. అవి చెప్పేది వినాలి. ప్రతి సందర్శకుడు రాష్ట్రాన్ని సొంతింటిలా భావించేలా పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతాం. ఆవకాయలో అన్ని రకాల రుచులు ఉంటాయి. అందుకే ఈ కార్యక్రమానికి దాని పేరు పెట్టాం.

చంద్రబాబు ఓ ఛాంపియన్

– సంజయ్‌రాయ్, టీవర్క్ ఆర్ట్స్ ఎండీ

చంద్రబాబు ఓ ఛాంపియన్. 49 ఏళ్ల తర్వాత నేను ఈ రాష్ట్రానికి వచ్చాను. విజయవాడ పరిశుభ్రమైన నగరమే కాదు.. చారిత్రక ప్రాంతం కూడా. మీరు సృజనాత్మక రంగాన్ని అభివృద్ధి చేయాలి. దీని వల్ల సంపద సృష్టితో పాటు యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయి.

వైకాపా హయాంలోనే ఎక్కువ పెట్టుబడుల సాకారం

- చంద్రబాబు దెబ్బకు భారతి సిమెంట్స్ సహా పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారు
- రాజధాని నిర్మాణానికి అమరావతి సరైన ప్రదేశం కాదు: మాజీ సీఎం జగన్



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో కాదు, చంద్రబాబు హయాంలోనే రాష్ట్రం నుంచి భారతి సిమెంట్స్ సహా పలువురు పారిశ్రామికవేత్తలు భయపడి పారిపోతున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు. కూటమి నాయకులకు కప్పం కట్టకుండా ఏ పరిశ్రమనైనా నడిపే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. 2014-19 తెదేపా హయాంలో కంటే 2019-24 వైకాపా హయాంలోనే ఎక్కువ పెట్టుబడులు సాకారం అయ్యాయన్నారు. గురువారం జగన్ తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'తమ బినామీలకు రూ.వేల కోట్ల భూములను కారుచౌకగా ఇస్తున్నారు' అని ఆరోపించారు.

రాయలసీమ లిఫ్ట్ పూర్తిచేస్తాం

'రాయలసీమ లిఫ్ట్ రాష్ట్ర ప్రజలకూ అవసరమే. చంద్రబాబు తన స్వార్థంతో దీన్ని అడ్డుకుంటే అడ్డుకోవచ్చు. మేం అధికారంలోకొచ్చాక వాయువేగంతో పూర్తిచేస్తాం' అని జగన్ చెప్పారు. 'రాయలసీమ లిఫ్ట్‌కు చంద్రగ్రహణం పట్టింది' అని విమర్శించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుమతులన్నీ తామే తెచ్చామని, కోర్టుల్లో ఉన్న 130 కేసులను పరిష్కరించామని చెప్పారు. చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఏమీ చేయకపోయినా అంతా వారిద్దరి వల్లే పూర్తయిందన్నట్లు బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు.

రివర్ బేసిన్‌లో రాజధాని ఎలా కడతారు?

సుప్రీంకోర్టు దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి

"రివర్ బేసిన్‌లో ఒక చిన్న భవనం నిర్మించాలంటేనే అనుమతులివ్వరు. అలాంటిది రివర్ బేసిన్‌లో సోకాల్డ్ రాజధాని పేరిట నగరాన్నే నిర్మించాలని చంద్రబాబు అనుకుంటున్నారు. దీన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాలి" అని జగన్ అన్నారు. రాజధాని కట్టడానికి అమరావతి సరైన ప్రదేశం కాదన్నారు. అది విజయవాడ, గుంటూరుకు 40 కి.మీ. దూరంలో ఉందని, కనీసం రోడ్లు, విద్యుత్తు వంటి సదుపాయాలైనా అక్కడ లేవని చెప్పారు. 'ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుని పరిపాలిస్తే అదే రాజధాని. ఈ కీలకాంశాన్ని అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారు ఎక్కడి నుంచి పరిపాలించాలనేది వారే నిర్ణయించుకోవాలని రాజ్యాంగం చెబుతోంది. మిగతా అంశాలన్నీ అసంబద్ధం' అని వ్యాఖ్యానించారు.

భూముల అభివృద్ధికే రూ.2 లక్షల కోట్లు కావాలి

'తొలివిడత భూ సమీకరణలో తీసుకున్న 50 వేల ఎకరాల అభివృద్ధికి ఎకరాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.లక్ష కోట్లు అవసరమని అప్పట్లో డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఆ లెక్కకు కుంభకోణాలు, లేదా మరే ఇతర కారణాలున్నాయో ఆయన (చంద్రబాబు)కే తెలియాలి. ఆ లక్ష కోట్లు ఎప్పటికి రావాలి? ఎప్పుడు అభివృద్ధి చేయగలరో దేవుడికే తెలియాలి. భూసమీకరణ కింద ఇప్పుడు మరో 50వేల ఎకరాలు, దాని అభివృద్ధికి మరో రూ.లక్ష కోట్లంటే మొత్తంగా రూ.2 లక్షల కోట్లవుతాయి. మొదటి దశలో తీసుకున్న 50వేల ఎకరాలే అభివృద్ధి చేయలేదని రైతులు ఏడుస్తున్నారు' అని జగన్ పేర్కొన్నారు.

అమరావతిపై మళ్లీ విషం కక్కిన జగన్

11 సీట్లకే పరిమితమైనా మార్పు రాలేదు

రాజధానిపై మరోసారి అవాకులు, చవాకులు

ఈనాడు, అమరావతి: అధికారంలో ఉన్న ఐదేళ్లూ అమరావతిని సర్వనాశనం చేయడమే లక్ష్యంగా కుట్రలు చేసిన వైకాపా అధ్యక్షుడు జగన్ ఇప్పటికీ రాజధానిపై విషం కక్కడం మానలేదు. అవాకులు, చవాకులతో మరోసారి రాష్ట్ర ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. గురువారం జాతీయ మీడియాతో మాట్లాడుతూ అమరావతిపై జగన్ విద్వేషం వెళ్లగక్కారు.

ఈ మహానగరాలన్నీ ఇలానే..

చంద్రబాబు రివర్ బేసిన్‌లో సోకాల్డ్ రాజధాని కట్టాలనుకుంటున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కానీ.. మానవచరిత్రలో గొప్ప నాగరికతలన్నీ నదీతీరాల వెంబడే విలసిల్లాయి. లండన్ (థేమ్స్ నది), న్యూయార్క్ (హడ్సన్), కైరో (నైలు) బాగ్దాద్ (టైగ్రిస్), మాస్కో (మొస్క్వా), బెర్లిన్ (స్ప్రీ), షాంగై (హువాంగ్‌పు) రోమ్ (టైబర్)... ఇలా అనేక మహానగరాలు నదీ తీరాల్లోనే అభివృద్ధి చెందాయి. మన దేశ రాజధాని దిల్లీ యమునా నది ఒడ్డున ఉంది. కోల్‌కతా, లఖ్‌నవూ, వారణాసి, కాన్పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, ఆగ్రా, మథుర, నాసిక్, కటక్ లాంటి నగరాలన్నీ నది ఒడ్డునే ఉన్నాయి. తాగునీరు, వ్యవసాయం, రవాణా వంటివాటికి అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో నదీతీరంలో మహానగరాల నిర్మాణం జరిగింది. కృష్ణా నదికి ఒక ఒడ్డున విజయవాడ ఉన్నప్పుడు, మరో ఒడ్డున అమరావతిని నిర్మిస్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేంటి? రాజధాని నిర్మాణానికి ఎన్జీటీ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

హైకోర్టు స్పష్టంగా చెప్పినా..

రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తిచేయాలని హైకోర్టు స్పష్టంగా చెప్పినా పట్టించుకోని జగన్.. తాను అధికారంలో ఉన్నన్నాళ్లూ అదే పాట పాడారు. అధికారం పోయినా అమరావతి విషయంలో ఆయన వైఖరిలో మార్పులేదని మరోసారి రుజువైంది.

ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందేమో!

అమరావతిపై నాలుక మడతేయడం, మాటమార్చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. గుంటూరు-విజయవాడ మధ్య 35 వేల ఎకరాల్లో రాజధాని నిర్మించాలని, రాజధానిగా అమరావతి తమకు ఆమోదయోగ్యమేనని ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్... 2019 ఎన్నికల వరకు అదే పాట పాడారు. రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని 2019 ఎన్నికల సమయంలోనూ జగన్, వైకాపా నాయకులు ఢంకా భజాయించి చెప్పారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు.. ఈ మూడూ ఎక్కడుంటే అదే రాజధాని అని జగన్ ఒక సభలో చెప్పారు. 2019 ఎన్నికల్లో ఓట్ల కోసం నటించిన జగన్... గెలిచాక అసలు రూపం బయటపెట్టారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సర్వనాశనం చేసేందుకు నడుం కట్టారు. 2024 ఎన్నికల్లో తల బొప్పి కట్టడంతో... మూడు రాజధానులపై తమ పార్టీలో చర్చించుకుని తమ విధానం ప్రకటిస్తామని బొత్స సత్యనారాయణ, వైవీ సుబ్బారెడ్డి వేర్వేరు సందర్భాల్లో చెప్పారు. వైకాపా మళ్లీ అధికారంలోకి వస్తే సీఎంగా జగన్ అమరావతిలోనే ఉంటారని, విశాఖ వెళ్లరని 2025 సెప్టెంబరు 13న సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వైకాపా నాయకుల నిజస్వరూపమేంటో, అమరావతిపై వారి వైఖరేంటో జగన్ తాజా వ్యాఖ్యలతో మరోసారి స్పష్టమైంది.

EENADU Vol: 52, Issue: 150 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao


జోస్ ఆలుక్కాస్
A TRADITION OF FINE JEWELLERY
ఈ మకర సంక్రాంతికి,
కొత్త ఆరంభాలను
సంబరంగా జరుపుకుందాం.
ఫ్లాట్
50%
తగ్గింపు
బంగారు ఆభరణాల
తరుగు ఛార్జీలపై
ఈ ఆఫర్ జనవరి 18 వరకు మాత్రమే
0%* తరుగు ఛార్జీలు వెండి ఆభరణాలకు
మీ పాత 22 క్యారెట్ బంగారు ఆభరణాలను అధిక లాభాలతో ఎక్స్ఛేంజ్ చేసుకోండి
అతినవీన సరికొత్త డిజైన్లు
పెరుగుతున్న బంగారం ధరల నుంచి రక్షణ పొందడానికి ఇప్పుడే అడ్వాన్స్ బుకింగ్ చేసుకోండి
వజ్రాలపై
30%
తగ్గింపు
15%
తగ్గింపు
ప్లాటినం ఆభరణాల
తరుగు ఛార్జీలపై
*నియమ నిబంధనలు వర్తిస్తాయి
62 YEARS OF TRUST
OPP: RADIO STATION, M.G. ROAD, VIJAYAWADA. PH: 0866-2475916
ROAD NO.4/9, BRODIPET, GUNTUR. PH: 0863-2241916
MINI BYPASS ROAD, NELLORE. PH: 0861 – 2353916
JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
josalukkasonline.comలో షాపింగ్ చేయండి


THE RESPONSIBLE JEWELLER™
MALABAR
GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE
తగ్గింపు 30%* వరకు
అన్ని బంగారు, అన్‌కట్ & రత్నాభరణాల తరుగు ఛార్జీలపై.
తగ్గింపు 30%* వరకు
వజ్రాల విలువపై.
ఈ ఆఫర్ నవంబర్ 28, 2025 - జనవరి 18, 2026 వరకు మాత్రమే
Brides of India
అక్కాచెల్లెళ్లు ఆమెను వజ్రాభరణాలతో అలంకరించగా, స్నేహితులు ప్రేమ పాఠాలను చెవిలో గుసగుసలాడగా, ఆ గదిలో నవ్వులు వెల్లివిరిశాయి. బాల్యస్మృతులు మరియు రేపటి కలలు కలబోసుకుని, ఆమె తళుకులీనుతుంది, ఆ వేడుక ఆమె హృదయ స్పందన.
ఆమెలాంటి ఎందరో వధువుల ఆనందకరమైన హృదయాల నుండి ప్రేరణ పొందిన మా ఆభరణాల సేకరణలు బంగారం, వజ్రాలు, పోల్కీ మరియు విలువైన రాళ్లతో అద్భుతంగా రూపొందించబడ్డాయి - భారత వధువుల మోములోని కాంతిని మరియు సంతోషాన్ని గౌరవించడానికి, ప్రతి ఆభరణం ఏరికోరి తయారు చేయబడింది.
ప్రతి భారతీయ వివాహం ఒక అద్భుత వేడుక
Watch the Bridal Elegance Unfold
ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం | తిరుపతి | కర్నూలు | విజయవాడ | కాకినాడ | రాజమహేంద్రవరం | గుంటూరు | భీమవరం | కడప | నెల్లూరు | అనంతపురం | శ్రీకాకుళం | ఏలూరు | ఒంగోలు | అనకాపల్లి | విజయనగరం | గాజువాక | నంద్యాల | మచిలీపట్నం | అమలాపురం | 09562 916 916
BUY ONLINE AT:
malabargoldanddiamonds.com
410 కి పైగా షోరూములు 14 దేశాలలో


TVS
TVS Jupiter
శుభారంభానికి శ్రీకారం చుట్టండి
SCAN ME
TVS SMARTXONNECT
DOUBLE HELMET STORAGE
METAL MAXX BODY
MORE PICK-UP WITH TVS iGO Assist
₹75 650* నుండి ప్రారంభం
₹7 500# తక్షణం డిస్కౌంట్
5.99%^ అతి తక్కువ వడ్డీ రేటు
TVS Jupiter ఎక్కువవల్ల లాభం
5+ YEAR WARRANTY
TVS CREDIT
SHRIRAM Finance
IDFC FIRST Bank ALWAYS YOU FIRST
HINDUJA LEYLAND FINANCE
L&T Finance
HDFC BANK
వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించండి.
tvsjupiter | www.tvsmotor.com/tvs-jupiter
Call: 1800 315 7777
* Ex-showroom price of TVS Jupiter 110 BS VI Drum variant in Andhra Pradesh. # 5% instant discount of up to ₹ 7 500 on HDFC Bank credit card and debit card transaction above ₹ 49 999.99. Valid till 31st January, 2026.
^ T&C apply. Finance will be at the sole discretion of the financier. + 5 yr. warranty without any additional charges.